
ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక




వెల
4 అణాలు

సంపుటము 42 సంచిక 2


ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY

సెప్టెంబరు 7 1949


వార్తా చిత్రాలు



సోవియట్ రష్యాలో భారతరాయబారిగా నియమితులైన డా. సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారు మాస్కో వెళ్ళటానికి ముందు ఢిల్లీ ఆంధ్రులు ఆయనకు సన్మానంచేసిన సందర్భంలో రాష్ట్రపతి పట్టాభిగారూ రాధాకృష్ణన్‌గారూ మాట్లాడుకొంటూండగా తీసిన ఫోటో.




మాస్కోలో భారతరాయబారిగా నియమితులైన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారి గౌరవార్థం ఢిల్లీ ఆంధ్రసంఘంవారు క్రిందటి నెల రాష్ట్రపతి పట్టాభిసీతారామయ్యపంతులుగారి అధ్యక్షతను ఏర్పాటుచేసిన సన్మానసభలో ప్రధానామాత్యుడు పండిత నెహ్రూ రాధాకృష్ణపండితునిగురించి ప్రసంగిస్తున్న దృశ్యం.



రాష్ట్రనిర్మాణావసరమును వివరించుటకై భారత ప్రధానివద్దకు శ్రీ౦తి రామమూర్తిగారి నాయకత్వాన ఢిల్లీకి వెళ్ళిన ఆంధ్రరాయబారవర్గ సభ్యులు. ఢిల్లీ ఆంధ్రులు వీరికి సన్మాన మొసంగినపుడు తీసిన చిత్రం. కూర్చున్నవారు ఎడమనుంచి: సీతాపతిరావు, కల్లూరి సుబ్బారావు, శ్రీమతి దుర్గాబాయ్, యు. టి. కె. వి. రెడ్డి, కళా వెంకట్రావు, కర్నల్ టి. యస్. నాయుడు, యస్. రామమూర్తి, లంక సుందరం, యన్. జి. రంగా, కోటిరెడ్డి, కర్నల్ టి. యన్. శాస్త్రి, అనంతశయనం అయ్యంగారు, నాగప్ప, యం. వి. రమణరావు, యం. సత్యనారాయణ రావుగారలు.



ఆర్. ఎస్. ఎస్. నాయకుడు ఎం. ఎస్. గోల్వాల్కరుగారు ఢిల్లీ వచ్చినపుడు స్వాగత మొసంగుట.



ఆర్. ఎస్. ఎస్. నాయకుడు శ్రీ గోల్వాల్కర్ జెయిలునుండి విడుదలయిన తర్వాత మొదటిసారిగా ఈ నెల 21 న ఢిల్లీ వచ్చినపుడు రైలుస్టేషనువద్ద ప్రజాసమూహము స్వాగత మిస్తున్న దృశ్యం.

ఆంధ్రపత్రిక


ప్రతిబుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగుడా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మపథములకెల్లన్.

—మహాభారతము.


Founder : K. NAGESWARA RAO

విరోధి సంవత్సర భాద్రపద శుద్ధ పౌర్ణమి బుధవారము



శ్రీ కాళహస్తి

కిరాతార్జునుని కొండపైనుండి దృశ్యం. సువర్ణముఖి నదీతీరమునందు వెలయు యీ పుణ్యక్షేత్రమునందలి ఆలయము, గోపురము, రాజవీధి, పురమునందలి కొంతభాగము యిందు కానవగును.



ఆంధ్రపత్రిక

1949-వ సం॥ సెప్టెంబరునెల 7-వ తేది బుధవారము

అంకెలగురించి పోరాటము

జాతీయభాషవిషయమున పరిషత్తు కాంగ్రెసుపక్షములో దాదాపు ప్రతిష్టంభన ఏర్పడినది. ఇది కేవలము భాషకు సంబంధించినది కూడ కాదు. అదయిననూ బాగుండెడిది. కొంత అర్థ ముండెడిది. కాని ప్రస్తుతవిభేదము అంకెలకు సంబంధించినది. ఇకముందు భారతప్రభుత్వమునకు సంబంధించిన వ్యవహారములందు ఇంగ్లీషుఅంకెలు ఉపయోగించవలెనా లేక హిందీ అంకెలు ఉపయోగించవలెనా అనునదే పరిషత్తు కాంగ్రెసుపక్షమునందు ప్రతిష్టంభనకు కారణమైనది.

ఈ సమస్యపట్ల కాంగ్రెసుపక్షము రెండు సరిసమాన సంఖ్యగల వర్గములుగ విడిపోయినది. ఈ మధ్య ఈ విషయమునుగురించి అనేకపర్యాయములు చర్చ జరిగినది. ప్రతి పర్యాయము కూడ ఉభయపక్షవాదములు సరిసమానముగ నున్నట్లే వెల్లడి అయినది. శుక్రవారము కడసారి చర్చ జరిగినది. 90 నిమిషములసేపు వాదములు సాగినవి. హిందీఅంకెలకు అనుకూలురు 77 మంది తేలిరి. అదేసంఖ్యాకులే, ఇంగ్లీషుఅంకెలకు అనుకూలురుగ తేలిరి. ఇది ఇంత ప్రధానమైన విషయము కాబట్టి అధ్యక్షుడు తన ఓటును ఏ పక్షమునకూ ఇవ్వ నిరాకరించెను. కాని సంప్రదాయము ననుసరించి ఇపుడమలునందున్న పద్ధతికే అనుకూలముగ తన ఓటు యిచ్చిన బాగుండెడిది. ఈ సందర్భమున పూర్వ కేంద్రశాసనసభకు అధ్యక్షుడుగా విఠల్‌భాయిపటేల్ ఓటుచేసిన ఉదంతమును జ్ఞప్తికి తెచ్చికొనిన మంచిది. అది అప్పటి భారతప్రభుత్వము తలపెట్టిన ప్రజారక్షణకు సంబంధించిన విషయము. శాసనసభలో దానికి అనుకూల ప్రతికూలుర సంఖ్య సరిసమానముగ వచ్చెను. అధ్యక్షుడు పటేలు అప్పటికి అమలులో నున్న చట్టమునకు అనుకూలముగ క్రొత్తగ ప్రతిపాదింపబడిన ప్రజారక్షణకు ప్రతికూలముగ ఓటు నిచ్చెను. అదేవిధముగ పరిషత్తు కాంగ్రెసుపక్షమునకు అధ్యక్షత వహించిన కాంగ్రెసు అధ్యక్షులు పట్టాభి సీతారామయ్యగారు కూడ ప్రెసిడెంటు పటేలు చేసినట్లుగ చేసిన బాగుండెడిది. వారి ఓటు ఇపుడు అమలునందున్న ఇంగ్లీషు అంకెలకు అనుకూలముగ నుండెడిది. వారు ఇంగ్లీషుఅంకెలకు ప్రతికూలముగ నున్నట్లు లేదు. జాతీయభాషకు సంబంధించిన మున్షీ అయ్యంగారి ముసాయిదాతీర్మానములో అంకెల విషయముకూడ చేర్చబడియున్నది. అంకెల సమస్యను విడతీయక తీర్మానమునంతను ఏకముగా పరిశీలించవలసినదని అధ్యక్షులు నిర్ణయించిరి. అటువంటపుడు ఇంగ్లీషుఅంకెలకు అనుకూలముగ ఓటు నిచ్చుటలో కష్టము లేదు.

మున్షీ అయ్యంగారి ముసాయిదాకు హిందీప్రాంతేతరులందరూ ప్రతికూలురు. అంతేకాక, భారతప్రధాని తదితర మంత్రులుకూడ ఇంగ్లీషుఅంకెలకు అనుకూలురే. హిందీప్రాంతీయులైన బీహారు, సంయుక్తరాష్ట్రము మధ్యరాష్ట్రము మొదలైన రాష్ట్రములకు చెందినవారు మాత్రము హిందీ అంకెలుండవలెనని పట్టుబట్టుచున్నారు. వీరి వైఖరి వట్టి మూర్ఖభావముతోనూ, హేయభావముతోనూ కూడుకొని యున్నదని చెప్పవలసియున్నది. ఇంగ్లీషుఅంకెలు అన్ని రాష్ట్రములందు అన్ని తరగతులవారికి తెలియును. పైగా వీటికి అంతర్జాతీయముగా వాడుక యున్నది. జాతీయత అనుసాకుతో సంకుచితభావమును ప్రచారమొనర్చి అందరికి తెలిసియున్న అంకెలను వదలమనుటలో గల అర్థము ఎవరికిని బోధపడదు. ప్రతి రాష్ట్రములోనూ సామాన్యముగా స్వభాషకు చెందిన అంకెలకన్న ఇంగ్లీషు అంకెలే ఎక్కువ పరిచయములో నున్నవి. అసలు ఏకప్రపంచవిధానమునకు అందరు ప్రయత్నించుచుండ హిందీవాదులు మాత్రము ఇంతవరకు దేశమునకంతకు ఏకముగా నుండిన అంకెలను దొలగించుటకు ప్రయత్నించుట చూచిన వింతగ కనపడక మానదు. వాస్తవమునకు వారు హిందీప్రాబల్యము స్థాపించ చూచుచున్నట్లున్నది గాని దేశమునకు ఏది సౌకర్యమో, ఉపయోగమో, ఆలోచించుచున్నట్లు లేదు. ఆమధ్య జరిగిన హిందీసాహిత్యసమ్మేళన సమావేశతీర్మానములు చూచిన ఈ అంశము బోధపడగలదు. వారి వైఖరి కేవలము భాషాయుతమైన సామ్రాజ్యవాదమని చెప్పవలెను. తమ మొండివాదమువల్ల వారు భారతఐక్యతను సాధించుటకు బదులు నిజమునకు దానిని విధ్వంస మొనర్చుచున్నారు. జాతీయభాషను ఏర్పరచుటకు బదులు హిందీభాషాధిపత్యమును స్థాపించుటకు ప్రయత్నించుచున్నారని అనుమానపడవలసి వచ్చుచున్నది. హిందీతర ప్రాంతీయులందరు తమకు వ్యతిరేకులవుట వారికి కనువిప్పుగ నుండవలెను.

ఏకీభావము కుదరకపోవుటవలన పరిషత్తులో కాంగ్రెసుసభ్యులు తమ ఇష్టానుసారము ఈ విషయమై ఓటు చేయవచ్చునని అధ్యక్షులు తెలిపిరట. ఇది సక్రమమైన పద్ధతి. ఇంత విభేదమున్నప్పుడు ప్రతి సభ్యునికి ఓటింగు విషయమున స్వేచ్ఛను ఇచ్చుట ఉచితమైన సంగతి. హిందీఅంకెలకు ప్రాతికూల్యము చూపిన సభ్యులందరు అభినందనీయులు. వారు తమపట్టును విడవకుండగ నుండవలెను. పరిషత్తు మున్షి గోపాలస్వామి అయ్యంగారి ముసాయిదాను ఆమోదించవలెను. కేంద్రములో హిందీప్రాంతీయులు అధికసంఖ్యాకులుండుటవలన అన్యరాష్ట్రీయులయెడ వారెట్లు వ్యవహరించగలరో కూడ ఇపుడు సూచనగ తెలియుచున్నది.

ట్రూమన్ అట్లీ విజ్ఞప్తి

కాశ్మీరువిషయంలో పాకిస్తాన్, భారతదేశముల కేర్పడిన తగాదాలో మధ్యవర్తిపరిష్కారమునకు అవకాశము గలదా యను విషయము స్పష్టముగ నిర్ధారణ అయినగాని, జనవాక్యనిర్ణయాధికారిగా భద్రతామండలిచే నియమింపబడిన అడ్మిరల్ చెస్టర్ నిమిట్జ్‌ను పరిష్కర్తగా అంగీకరించు విషయమున భారతప్రభుత్వ మొక నిర్ణయమునకు రాజాలదు. కాశ్మీరు సంస్థానముపై పాకిస్తాన్ దురాక్రమణ జరిపిన దాదాపు రెండు సంవత్సరములకు అమెరికా బ్రిటిష్ ప్రభుత్వములు హఠాత్తుగ విశేష శ్రద్ధ వహించి, సమితి ప్రతిపాదనలను అంగీకరింపవలసినదిగ పాకిస్తాన్, భారత ప్రధాన మంత్రులకు విజ్ఞప్తిచేయుట కొంత విచిత్రముగ, విపరీతముగ కన్పించును. భారతప్రభుత్వము పాకిస్తాన్‌పై ఫిర్యాదు చేసినపుడు, బ్రిటన్, అమెరికా అసలు విషయమును అవగాహనచేసుకొనుటకు ప్రయత్నింపక, దురాక్రమణ జరిపిన పాకిస్తాన్ ప్రభుత్వమును దురాక్రమణకు గురియైన భారతప్రభుత్వమును ఒకేవిధముగ చూచి, ఇరుపక్షములకును రాజీచేయ ప్రయత్నించెను. ఆదిలో అట్టి ప్రయత్నములు జరిగియున్నందుననే భారతప్రభుత్వము సమాధానమునకు ఎంత ఆత్రముగ నున్నను, కాశ్మీరుకమిషను ఎంత ప్రయత్నము చేసినను, పాకిస్తాన్ సమాధానమునకు విముఖముగ నుండుట జరుగుచున్నది.

భారతప్రభుత్వము మొదటినుండియు మధ్యవర్తిసంఘముతో మనస్ఫూర్తిగ సహకరించుచుండెను. న్యాయముగ నున్న కమిషను ప్రతిపాదనలనన్నింటిని అంగీకరించుచునే వచ్చెను. భారతప్రభుత్వ అంగీకారమును పొంది, అనంతరము పాకిస్తాన్ ప్రభుత్వముచే అంగీకరింపచేయుటకు ప్రయత్నించి విఫలమైనపుడెల్ల తిరిగి క్రొత్త ప్రతిపాదనలు చేయుచు వాటికి భారతప్రభుత్వామోదమును పొందుటకే కాశ్మీరుకమిషను ప్రయత్నము చేయుచు వచ్చెను. బ్రిటిష్ ప్రధానమంత్రి అట్లీ అమెరికా అధ్యక్షుడు ట్రూమన్ ఇపుడు సమితిప్రతిపాదనలను అంగీకరింపమని కోరుటయు కాశ్మీరు కమిషను అనుసరించుచున్న పక్షపాతవిధానమును న్యాయబద్ధము చేయుటకే ప్రయత్నించుచుండిరని చెప్పవలసియున్నది. భారతప్రభుత్వమునకు అట్లీ ట్రూమన్‌లపై ఎంతటి గౌరవమున్నప్పటికిని, కాశ్మీరు ప్రజలకు సమ్మతము కానట్టి, భారతప్రభుత్వమింత కాలముగ ఏ సిద్ధాంతములకు కట్టుబడి వ్యవహరించుచున్నదో, అట్టి సిద్ధాంతములకు విరుద్ధముగ నుండు ప్రతిపాదనలను పరిష్కారమార్గమును అంగీకరింపజాలదు.

పాకిస్తాన్ ప్రభుత్వము తన పూర్వవిధానమును వదలి, సమాధానమునకు దోహదము చేయగల వైఖరిని అవలంబింపకున్న భారతప్రభుత్వము అమెరికా, బ్రిటను ప్రభుత్వముల విజ్ఞాపనల ననుసరించి వ్యవహరించినను కాశ్మీరుతగాదా పరిష్కారము కాజాలదు. అడ్మిరల్ నిమిట్జ్ పరిష్కర్తగా నియమింపబడినను దాదాపు ఒక సంవత్సరముగా కాశ్మీరుకమిషను సాధింపజాలక పోయిన సమాధానమును సాధింపజాలడు.

తూర్పు యూరప్‌నందు పరిస్థితి విషమించి, యుగస్లావియాపక్షమున బ్రిటన్ అమెరికాలు, రష్యాతో యుద్ధము చేయవలసిన ప్రమాద మేర్పడ నున్నందున అట్లీ, ట్రూమన్ ఇట్టి అసాధారణ 'చర్య' తీసుకొని యుండవచ్చును. కాని ఇది కాశ్మీరుసమస్యాపరిష్కారమునకు సవ్యమైన మార్గము కాజాలదని పూర్వాపరములను గమనించిన వారే గ్రహింపగలరు.

వల

సాక్షిబలి

వి.ఎడి. ప్రసాదరావు

౧౨

శీతాకాలపు ఎండలో కరుగుతూ పేర్కొంటూన్న నేతిలాగ ఉన్నాయి ఇద్దరిమనోగతులూ!

నెమ్మది నెమ్మదిగా ప్రభావతిపరిస్థితులు ఒక్కొక్కమాటగా తెలుసుకోగలిగాడు.

ఆనాడుసాయంత్రమే మళ్లీప్రభావతిపతి, తా మిద్దరూ దొడ్డివాకిలిలో ఉండగానే. ఇంటికి వచ్చాడు. ప్రభావతీ దొడ్డితలుపు వేసికొని ఇంట్లోకి రావటం మాత్రమే మేడమీదనుంచి చూడగలిగాడు. నిర్ధారణ లేని అనుమానాలతోనే ఆమెను వేధించి పరీక్షలు సాగించాడు. ఆమె కూడా కోపంతో బిర్రబిగిసి, ఎదురు సవాళ్ళు చేయసాగింది. ఆ పతికి తన పత్నివిషయంలో గుణదోషాలు ఏవీ నిర్ధారణ కాలేదు. ఆ స్థితిలోని అతని అశక్తదుర్జనస్వభావం ఆమెను మరింత మండించింది. కాపురం చిచ్చులమంటగా తయారయింది.

కారణరహితంగానే అనుమానాలూ, ఋజువులూ పెట్టి అతను ఆమెను యాగీచేయటం ప్రారంభించాడు. నిజంగా తప్పున్న విషయంలో ప్రాయశ్చిత్తకాండే జరగలేదు. తప్పు లేని కాలంలో, దండనలు ప్రారంభ మయాయి. ఆ తర్వాత, ఆ యింటికి ఒక ఆడుబిడ్డతోడయింది. అతని చెల్లెలు కాదు. చెల్లెలువరుస ఏర్పడే దూరపు చుట్టం కాబోలు. దిక్కుండే చేరిందో, దిక్కు లేక చేరిందో, చెల్లెలో మరేమో భగవంతుడి కెరుక. ఆ యింట్లో మకాంపెట్టి, ఆ దంపతులమధ్య పోరుపులు ఎక్కువ చేసి, ప్రభావతిజీవితం నరకప్రాయంగాచేసి వైచింది. ఒకనాడు ఏదో స్వల్పవిషయంపైననే తగువు రాజింది. పతి నానాదుర్భాష లాడాడు. ప్రభావతిని గుమ్మంలో కీడ్చి, దిక్కున్న చోటికి పొమ్మన్నాడు. ఏదో గుబులుగా కడుపులో రాజుతున్న అనుమానం తప్ప, పతికి తనను వెళ్లగొట్టాల్సినంత కారణము, అతనికి తెలిసిన దేదీలేదు. గృహకలహంలో, గృహిణీ, యజమానుల పరస్పరగౌరవా లెరుగని, భార్యాభర్తలు కొట్లాడుకొన్నంతమాత్రంగానే జరిగింది ఆ సంఘటన. ఆతర్వాత రెండురోజులు ఎల్లాగో ఓపిక పట్టి ఆయింట్లో ఉంది. అప్పుడే రాఘవరావుకు ఉత్తరం వ్రాసింది.

మర్నాడు నేను పుట్టింటికి వెళ్లిపోతున్నానని ఆ యాడుబిడ్డతో చెప్పి, మగడు ఇంట లేనప్పుడే తనవి రెండుమూడు బట్టలు మూటకట్టుకొని తన దగ్గిరే ఉంటూవచ్చిన కొద్దిపైకం తీసికొని, ఏకాకిగా, ఇంటికి బయలుదేరి వచ్చేసింది. భర్త దగ్గిరనుంచి కబు రేమీ రాలేదు.

మగనితో కాపురం వేరుకానూ లేదు, ఇక తనంత తనుగా కలిసి ఉండే స్థితీ లేదు. తను ఇంక ఆ పతితో కాపురంచేయబోననే నిశ్చయంతో ఇంటికి వచ్చింది. కాని ఎన్నాళ్లకూ రాఘవరావు రాలేదు.

“నిజమే! నీమీదమాత్రం నాకు హక్కు ఏముంది. అయినా నిన్ను నేను ఏమికోరగలను. జీవితంలో అడుగైనా నువ్వింకా పెట్టలేదు. చదువైనా పూర్తిచేసుకోలేదు. నిన్ను నువ్వు పోషించుకోటమే ప్రారంభించలేదు. ఇప్పుడు నీమెడకు గుదిబండనై నీకు అయినవారందర్నించీ నిన్ను వేరుచేసి, ఎక్కడో కానిదేశంలో నాతోపాటు నిన్నుకూడా అగాధపాతాళానికి ఏందుకు నాకు హక్కు ఏముంది?”

‘హక్కు లేదా!’ - అంటూ బిగ్గ కౌగలించున్నాడు. ఆ క్షణంలో, అమాయికపు హృదయంతోనే మనఃస్ఫూర్తిగానే నీవే నా జీవిత సర్వస్వం అని లాలించాడు. ఉద్రిక్త అయింది. కరగిపోయింది. సర్వమూ మరిచిపోయి ఆ క్షణంలోనే జీవించసాగింది. క్షణాలు యుగాలైనాయి. దేహంలో జితంగాని వేదాంతం, జీర్ణవస్త్రంలాగే కాళ్ల జీరాడి వ్రేలపడి పోయింది.

ఒకరొకరి మనస్సులలో భవిష్యత్తువిషయం ఆలోచనలు ఏవీ లేకుండా, మనస్సులలో ఆ తెరలు దించేస్తూన్నట్లుగా, ఒకరొకరు చూసి వేశారు. ఒకరి కౌగిలిలో ఒకరు ఆదమరిచి నిద్రపోయారు.

* * *

ఒక దుస్స్వప్నమధ్యంలో మెలకువ వచ్చినట్లుగా అదిరిపడి రాఘవరావు నిద్ర లేచాడు. ప్రభావతి అక్కడే అల్లాగే నిద్రలో ఉంది. పరిసరజ్ఞానం సరిగా కలిగేటందుకే రెండుమూడు క్షణాలు పట్టినవి. కాంపౌండుగోడతలుపు వేసేఉంది. లోపలి గుమ్మంతలుపు సగం తెరిచే ఉంది. దీపం అల్లాగే వెలుగుతూంది. అతనికి దాహము వేసినట్లయి ప్రభావతిని నిద్రలేపట మెందుకని, ఇంటిలోపలికి పోయాడు. ఇంటి దొడ్డి తలుపులవరకూ తెరిచేఉన్నాయి. అవ్వ మంచంమీద లేదు. దొడ్డి వసారామెట్లకిందదాకా దేహం స్నిడ్చుకొంటూపోయిన చార, అలికిననేలమీద కనుబడుతూంది. దొడ్డిగుమ్మాల చూరు దాటించి, చిరుగడ్డిలో తలపెట్టుకొని, కళ్లు తెరుచుకొని అవ్వ నేలమీదికి వెనుకకు వాలిపడి ఉంది.

దీపంతెచ్చి చూచాడు. అవ్వమొగం ప్రశాంతంగా ఉంది. కన్నుగుడ్లు తేలిపోయి నోరు తెరచుకొని ఉంది. కాని ముగ్గపండిన పండులాగ మృదుత్వమే తప్ప, ఆ మొగంలో మృత్యువులో బిగదీసుకొనిపోయిన కకోరత్వ మేమీ లేదు.

తెల్లబోయి చూస్తూ నిలుచున్నాడు. తన వెనుక వేడినిట్టూర్పువిని వెనక్కు తిరిగాడు. వెనుకనుంచి అతనికి తెలియకుండా ప్రభావతి వచ్చి అతనికి వెనుకగా నిల్చుంది

“అమ్మమ్మా!” అని జీర్ణస్వరం సన్నగా ఆమెకంఠంలోనుంచి వెలువడింది. కన్నుల తడి లేదు. బరువుగా నిట్టూరుస్తూ, “పాపం పండటం ప్రారంభించింది.” అని సన్నగా అంది.

అతని కేమీ తెలియటంలేదు.

“ఇక్కడికి కెల్లా వచ్చింది”

“ఇంట్లో ప్రాణం పోతుందేమోనని దొడ్లో పక్క వెయ్యమని పోరుతూ వచ్చింది. నేను వినలేదు. రాత్రి ప్రాణాంతకమైన బాధ వచ్చి ఉంటుంది. ఆమెకేకలు మనకు వినబడలేదు. ఇంటిచూరు దాటించేదాకా దేకుకొంటూ దొడ్లోకి వచ్చి ఉంటుంది.”

ఎల్లా తెలుసని అతి నడుగలేదు.

ఏదో చెయ్యాలి. ఏమి చెయ్యాలో తెలియదు. లోపలికి పోయి ఒక చాప తెచ్చి దొడ్లో గోడదగ్గిరగా వేశాడు. ఇద్దరూ కలిసి ఆమెను చాపమీదికి చేర్చారు.

ప్రభావతి ఆమెకనురెప్పలు మెల్లిగా చేత్తో మూసింది. కంఠనాదంగాని కంటినీరుగాని బైలుపడనీయకుండా, తల వాల్చుకొని ఆ ప్రక్కనే తల పట్టుకొని కూర్చుండిపోయింది.

అతను దిగాలుపడి అల్లానే నుల్చుండి పోయాడు.

తెల్లగా తెల్లవారిపోయింది.

వీధివాకిలి చప్పుడయింది.

ఇద్దరికీ స్మృతి వచ్చింది.

ఆమె అదాటుగా లేచింది. “రాఘవా దొడ్డితలుపు తీస్తాను ఇటు వెళ్లిపో.”

రాఘవరావు కదలలేదు. అతనిని గుమ్మంవైపుకు కదిలించబోయింది.

“నేను వెళ్లను!”

అతని మొగంలో కలుగుతూన్న వికృతి ఆమెకు వింతగా కనిపించింది. క్షణం ఆ మొగం వంక చూచింది. అతనిలో చలనం లేదు. ఏదో అనబోయి, మాట నిలుపుకొని వీధివాకిలికి కదిలిపోయింది.

చిల్లర బదులుకు వచ్చిన పొరుగమ్మ అవ్వ మృతివార్త విని ప్రభావతితో కలిసి దొడ్లోకి వచ్చింది. రాఘవరావువిషయం యేమి ఆలోచించేందుకు ప్రభావతికి పాలుపోలేదు. విధిమీద భారంవైచి, ఆమెతో కలిసి అల్లాగే దొడ్లోకి వచ్చింది. మృతిసాన్నిహిత్యంలో రాఘవరావు విషయమే అప్పట్లో ఆ పొరుగమ్మకు పట్టలేదు.

గమనిక

పైవారము, హైదరాబాద్ విమోచన దినోత్సవ ప్రత్యేకసంచికను వెలువర్చు సంకల్పముతో మా సచిత్ర వారపత్రికను, సెప్టెంబరు 18, ఆదివారమునాడు ప్రకటించుచున్నాము. మరల 21 వ తారీఖునుండి బుధవారమే వారపత్రిక వెలువడుచుండ గలదు.

సంపాదకుడు.

రాఘవరావు వీధివసారాలోకి కదలి, మంచంమీద కూర్చునిపోయి అట్లేఉన్నాడు.

ఇరుగుపొరుగుజనం అవ్వ కళేబరం చుట్టూ గుమిగూడారు. ప్రభావతికి ఓదార్పుమాటలు చెపుతున్నారు. ప్రభావతి ఏడ్వటం లేదు. నిశ్చలంగా అల్లాగే అవ్వపక్కనే కూలబడి పోయి వుంది. అవ్వ ఊరిలో చాలామందికి సాయపడి వుంది. అందరూ నెమ్మది నెమ్మదిగా అక్కడ చేరారు. గత సాయంత్రం బండిమీద కనబడ్డ ఆసామీ అక్కడ చేరాడు. రాఘవరావును పల్కరిస్తున్నాడు.

“బలే పుణ్యాత్మురాలు! ముగ్గపండినాక కూడా, అత్తమానం ఏరికో ఓరికి ఏదో పని చేసిపెడుతూనే ఉండేది. చాంతమ్మగారిని చెప్పే మరి ఓరిని చెప్పాలి. పాపం మీరు ఏలకే అందుకోగలిగారు!’

ఆ అమాయకుడు, తను అవ్వబంధువు అనీ ఆమెను చూడటానికి వచ్చాడనీ భావిస్తూ ఉపశమనవాక్యాలు చెపుతున్నాడు. ఆ భ్రాంతే అతను వచ్చినవారిలోనూ కల్గిస్తున్నాడు.

అనేకకోటియజ్ఞఫలాలు, అవాంఛితంగా సేకరించుకొన్న ఆ ఊరి బ్రాహ్మణుడే ఒకడు అవ్వకు దహనసంస్కారాదికాలు జరిపాడు. రాఘవరావు దహనాదికాలయేదాకా శ్మశానంలో నిలిచాడు.

ఇంటికి వస్తున్నప్పుడు, ఆ ఆసామే మళ్లీ రాఘవరావుతో తోడుగా వచ్చాడు. ఆ అమాయకునిలో కల్గిన భ్రాంతికి, రాఘవరావుకు ఉక్కిరిబిక్కిరౌతున్నట్లుగా ఉంది. కాని అక్కడివారూ అదే భ్రాంతిలో ఉండటం కొంత ఉపశమనగానే ఉంది.

కాని తా నెందుకు నిలచాడు! తనకే అర్థం కాలేదు. ఆపత్సమయంలో, ఆమెను విడిచిపెట్టి వెళ్లే నీచత్వం మనస్సుకు కలుగలేదు. బలీయంగా సాహసం తెచ్చుకొని నిల్చాడు. కాని ఆ సాహసంవల్ల ప్రయోజన మేమిటో అతనికే అర్థం కావటం లేదు. తను నిలవడం ప్రభావతికి అపాయమే తప్ప రక్ష గాదని ముందు తెలివిడి కాలేదు. కాస్త తెలివి వచ్చేటప్పటికి, ఆ ఆసామీ కొత్తభ్రాంతిలో నిలిపి తాత్కాలికంగా ఉపశమన మిచ్చాడు.

అందరూ వెళ్లిపోయారు. ప్రభావతీ రాఘవరావూ ప్రాణి వదిలి వెళ్లిన ఆ యింటిలో అరుగుమీద కూర్చుని ఎవరి ఆలోచనల్లో వాళ్లు మునిగిపోయారు.

“రాఘవా వెళ్లిపొమ్మంటే పోవే దేం?” అని నీరసంగా అడిగింది.

జవాబు చెప్పలేదు. మొగమెత్తి ఆమెవంక ఒకసారి చూచి తల వాల్చుకొన్నాడు.

ఆ రాత్రి ఇద్దరూ భోజనాల ప్రసక్తి తెచ్చుకోలేదు.

మర్నాడు పదిగంటలకు అకస్మాత్తుగా కరణంగారు ఒక అమీనా, మరెవరో కొందరు పెద్దలూ ఇంటిగుమ్మంలో పోగయారు.

ఆ జరిగిన ఘట్టపు గందరగోళంలో రాఘవరావుకు తెలిసిన దొక విషయం మాత్రమే. నిన్న ఊరివారు తన విషయంలో భ్రాంతి పడ్డారనుకోటం తనదే భ్రాంతి అయింది ఆమెభర్త ఆమెను కాశీలో తనకు అప్పజెప్పవలసిందిగా కోర్టులో వారంటు పుట్టించి కరణాన్ని పంపించి, వెనక నిలచాడు. నిన్నప్రొద్దున్న వచ్చిన పొరుగమ్మ ప్రభావతిఆవలింతలలోనే పేగులన్నీ లెక్కపెట్టుకొని వెళ్లి, తన విజ్ఞానాన్ని ఊరందరికీ ఉచితంగా పంచిపెట్టింది. రెండు విషయాలూ ఒకేఘట్టంలో, గాలీ నిప్పూ మాదిరిగా తోడయాయి. కలలో నిల్చుని చూస్తున్నట్లు నిల్చున్నాడు.

అంతటి ధీరగా ప్రభావతిని అంతకుముం దెప్పుడూ చూడలేదు.

ముందు, ఆమె వారి పలుకులకు ఏమీ మాటాడలేదు. తరువాత ఆమెలో ఆ ధైర్యం ఎక్కడినుంచి వచ్చిందో అతనికి తెలియలేదు. తనకు భర్తకు సంబంధములేదని తెలిపింది. తనకా కాపురం అక్కరలేదని చెప్పింది. తన యింట ఉన్న వ్యక్తినిగురించి ఎవరనుకొనే మాటలకూ తన కేమీ బాధ్యత లేదని చెప్పింది. ఏది ఏమైనా ఇప్పుడు తనను ఎవరూ ఏమీ బాధించకుండా అవతలికి కదలవలసిం దని, ఆజ్ఞాపన కంఠంతో, విజ్ఞప్తిని వెలువరించింది.

కరణంగారు, లోకజ్ఞుడు. “అమ్మాయీ, తొందరపడకు. అయినా మళ్లీ కలుసుకొంటానులే. ఇప్పుడు పాపం నువ్వు కష్టంలో ఉండగా మే మిల్లా రావటం తప్పే లే”అంటూ కపట సానుభూతి చూపిస్తూ అక్కడినుంచి అందర్నీ తప్పించాడు. వారూ వీరూ అన్న పలుగాకిమాటలకు తానే వారిని మందలించి, “ఛీ! తప్పు! ఓడు ఓడని కంచుమంతా ఓ డన్నట్లు అపభ్రంశాలు వాగకండి. ఓ కాపురం కూడదీయటం కష్టంగాని అవాకులు చెవాకులు వాగి పాడు చేయటాని కేం, ఇట్టే చెయ్యవచ్చు! ఆమెభర్త మాయింటి దగ్గరే ఉన్నాడు. ఇల్లాంటి వెవరన్నా అక్కడ వాగారా చెమడా లెక్క తీయిస్తాను. వాళ్లూ వీళ్లూ అన్నమాటలకు నువ్వేం అనుకోకమ్మా. ‘అయినా నే మళ్లీ వచ్చి చెప్తాగా! చిన్నదానివి అర్థం శుభం నీ కేం తెలుస్తుంది. ఏదో అత్తింటి కష్టాలుండకపోతాయా? అంతమాత్రాన కాపురం పాడు చేసికొంటారా! ఆలోచించుకో అమ్మా! బాగా ఆలోచించుకో మళ్లీవస్తా”

తుపానువచ్చి తగ్గిపోయాక ప్రకృతి నిర్జీవమై కనబడినట్లే, మోడువారి నిలబడిపోయారు ఇద్దరూ. ఆ నాటకానికంతకూ ప్రేక్షకుడులాగే నిలబడిపోయాడు రాఘవరావు. రంగంమీద పాత్రలన్నీ తనవంక మిడిగ్రుడ్లు పెట్టుకొని చూశారేతప్ప తన్నెవ్వరూ పల్కరించలేదు. ప్రభావతిచుట్టూనే తుఫానంతా రేగింది.

ఉండిఉండి ప్రభావతి నుల్చున్నది నుల్చున్నట్టే కూలబడిపోయింది. ఆత్రంతో దగ్గిరకుపోయి ఆమెను పొదివిపట్టుకొని, మొగంమీద నీళ్లు చల్లాడు. ఆమె తేరుకొంది.

(21 వ పేజీ చూడుడు)

రష్యానిజం - మానవాభ్యుదయం

శ్రీ భట్టిప్రోలు హనుమంతరావు

రష్యావిప్లవం ప్రపంచాన్ని ఉత్పాత లూగించింది. పీడితప్రజానీకానికి రష్యా ఆశాజ్యోతిలాగా మెరిసింది. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య తాత్విక రాజకీయ వైజ్ఞానిక రంగాలలో మానవజాతికి పురోగామియై అభ్యుదయమార్గంలో నడిపించగలదని ప్రపంచమంతా ఆశించింది. కాని యుద్ధానికి పూర్వం, యుద్ధానంతరం రష్యాలో జరిగిన విపరీతపరిణామాలు ఆ ఆశలను అడియాసలు గావించినై. అన్ని రంగాల్లోనూ రష్యా దిగజారిపోవడంవల్ల మానవ జాతికి నాయకత్వం వహించే యోగ్యత రష్యాకు పోయిందనే చెప్పొచ్చు.

విద్యాధికులు రష్యాపై దృష్టి మరలించడానికి కారణం—తాత్విక రంగంలో విప్లవం కొని తెచ్చిన మార్క్సు సిద్ధాంతాలకు రష్యా విప్లవం ఆచరణరూపం కావటమే. మార్క్సిజం నిత్య చైతన్యయుతమైన పురోగామి జీవితతత్వం. వైదిక సాంప్రదాయాల(*orthodox tradiiton*) పైనా, భావదాశ్యంపైనా, అధికారదౌర్జన్యం పైనా, వ్యక్తిలోని చైతన్యరాహిత్యంపైనా విప్లవధ్వజమెత్తింది మార్క్సిజం. ఒక యుగానికిగాని పార్టీకిగాని చెందని మానవకోటివిజ్ఞాన నిధి మార్క్సుతత్వం. సిద్ధాంత ప్రతిపాదనలతోనే తృప్తిపొందక మార్క్సు తాను దృష్టించిన సమాజనిర్మాణానికి కార్యక్రమం గూడా సూచించాడు. అందుచే మార్క్సిజం సర్వ సంపూర్ణమైన విప్లవతత్వమైంది. కాని నాటి సాంఘిక ఆర్థిక సాంస్కృతిక వాతావరణ ప్రభావంవలన అతని సిద్ధాంతాలలోనూ, కార్యక్రమంలోనూ లోపాలు లేకపోలేదు. కాంటు పండితుని వ్యక్తి స్వాతంత్ర్యాన్ని గుర్తించినప్పటికి హెగెల్ ప్రభావంవల్ల వ్యక్తిని సమాజానికి బలిచేశాడు మార్క్సు. అంతేగాక హెగెల్ ఆలోచనాపద్ధతిలోని ద్వంద్వాలే వర్గపోరాట సిద్ధాంతానికి దారితీసింది. ఐనప్పటికే మానవ విజ్ఞానం సంస్కృతులకు తనదే అంతిమనిర్ణయమనీ, అంతిమ సత్యమనీ మార్క్సు చెప్పలేదు. సాంప్రదాయాలను గౌరవింపరాదన్నాడు. నేటి కమ్యూనిస్టులు మార్క్సు రాజకీయాలకు, అతని తత్వానికి గల భేదాన్ని గుర్తించడం లేదు. మార్క్సిజంలోని ఆంతరంగికమైన తాత్విక విలువను గ్రహింపలేక తమ పార్టీ కార్యక్రమానికి దాన్ని సాధనంగానుపయోగించుకొంటున్నారు. భౌతికరసాయనికరంగాల్లో భావనారంగంలోనూ నాటికీ నేటికీ విపరీతమైన మార్పులు వచ్చినప్పటికీ, నేటికీ మార్క్సు చెప్పినదే వేద వాక్యంగా స్వీకరించి తబ్బిబ్బులౌతున్నారు.

నేటి కమ్యూనిస్టుల దృష్టిలో రష్యా విప్లవం నుండే నిజమైన నాగరికమానవచరిత్ర వెలువడింది! నేటివరకూ స్వేచ్ఛాపిపాసియైన మానవుడు నిర్మించిన నాగరికతా సంస్కృతులు బూర్జువాలసొత్తు! సోక్రటీసు తన ప్రాణాల నర్పించిన వ్యక్తిస్వాతంత్ర్యం, క్రీస్తు ఆత్మత్యాగం చేసిన మానవత్వం - అన్నీ బూర్జువాలవే! ఈ సిద్ధాంతం మానవాభ్యుదయాన్నే ప్రశ్నించడం, ప్రతిఘటించడం. పెట్టుబడిదారీ విధానమే డెమాక్రసీ అనే కమ్యూనిస్టుల పొరపాటువల్ల వచ్చిన దీ తబ్బిబ్బు మార్క్సిజం పూర్వాపరాలు లేకుండా ఊడిపడిందని కాబోలు కమ్యూనిస్టుల భావం. నాటి లిబరల్ ఆశయాల సారాంశానికి నూతనరూపమే మార్క్సిజమని హృదయాల్లోనైనా కనీసం సమ్మతించకపోరు. హృదయంలో సమ్మతించిన నగ్న సత్యాన్ని కూడా వెలిబుచ్చడం వారి సాధన క్రమానికి విరుద్ధంపై బూర్జువానాగరికత అంతా కమ్యూనిస్టు ఆధిపత్యంతో రాగల మహాప్రళయంలో నాశనమైతేగాని మానవజాతి పునర్నిర్మాణం సాధ్యం కాదని కమ్యూనిస్టుల వాదన. వారిది ప్రళయవాదమేగాని పరిణామవాదం కాదని తేలుతుంది. అందుకనే వీరిది '*Militano philosophy*' అంటారు. మానవాభ్యుదయం కాంక్షించే ఏ ఆలోచనాపరుడీ సిద్ధాంతాన్ని అంగీకరిస్తాడు ?

కమ్యూనిస్టుసిద్ధాంతానికి మూలసూత్రంగా నున్నది "ఎకనమిక్ డిటర్మినిజం." ఈ సూత్రం ప్రకారం మానవభావాలకు ప్రత్యేక స్వతంత్ర స్థితి లేదు. భావాలు, సంస్థలూ అన్నీ ఆర్థిక వ్యవస్థయొక్క ఫలితాలే నని, ఉత్పత్తిశక్తుల సంబంధాల ననుసరించియుంటై అనే వీరి వాదన చారిత్రకంగా విపరీతం. భావాలు హ్యూమన్ బయాలజీపరిణామంలో ఏర్పడిన అమూల్యధనం. వానికీ ఆర్థికశక్తులకూ సంబంధం లేదు. సాంఘిక రాజకీయాలతో సంబంధం లేకుండా భావాలు అభివృద్ధిపొందగల వనే విషయాన్ని చరిత్ర ఋజువు చేస్తుంది. బౌద్ధం ఆర్థికశక్తుల ఫలితం కాదు. ఐరోపాలో రినైజాన్సు బూర్జువాలు తయారుచేసిన విప్లవం కాదు. న్యూటన్ మహాశయుని ఏ ఉత్పత్తి శక్తులూ పుట్టింపలేదు. కాని భావాలు సాంఘికపరిణామంలో ప్రభావం కలిగియుంటై. అందుచే సంఘపరిణామం ఆర్థిక రాజకీయభావసమీకరణవల్లనే జరుగుతుంది. ఈ విషయాన్ని కమ్యూనిస్టులు గుర్తించరు. ఆర్థికపరిణామం, భావాలతో సంబంధం లేకుండానే జరుగతుందంటారు. ఈ సిద్ధాంతానికి కర్మవాదులు చెప్పే భగవన్నిర్ణయానికి, విక్టోరియా యుగంలో 'లిబరలిజం' సూచించిన తప్పనిసరి పురోగమన సూత్రానికి (*Inevitable progress*) ఏమాత్రం తేడాలేదు. ఇవన్నీ కూడా సాంఘిక చక్రంలో మానవుని ఒక నిష్ప్రయోజనమైన 'అణు'గా పరిగణించుతై. భౌతికశాస్త్రాభివృద్ధివల్ల మానసికశక్తులవిజృంభణవల్ల కూడా మానవుడు తన భవిష్యత్తును తాను నిర్ణయించుకోలేక కాలప్రవాహంలో పడి కొట్టుకుపోయే నిస్సహాయస్థితిలో నుంటాడన్నమాట, ఈ సిద్ధాంతం ప్రకారం. వ్యక్తిని శాశ్వతంగా ఈ నీచదశలో నుంచే తత్వంవల్ల ప్రయోజనం శూన్యం. ఆ సిద్ధాంతాన్నే పట్టుకు కూర్చోవడం మొండితనం.


'ఎకనమిక్ డిటర్మినిజా'నికీ, వర్గవిభజనకూ సంబంధం ఉంది. వర్గవిభజనకు చెందినదే-"సంఘర్షణే అభివృద్ధికి సాధన" మనే విశ్వాసం. ఇదంతా వాదప్రతివాదనలవల్లే సత్యం బయట పడుతుందనే హెగెల్ ఆలోచనాక్రమంలోని ద్వంద్వాలవల్ల నేర్పడిన విపరీతవాదం. 'మానవ జాతికి మానవుడే మూలం' అని గుర్తించినా మార్క్సు సమాజాన్ని రెండువిరోధవర్గాల కూటమిగా విభజించడం ఈ హెగెల్ ఆలోచనాక్రమప్రభావమే. "ఎకనమిక్ డిటర్మినిజం" పదార్థవాదానికి దారితీస్తుంది. కాని పదార్థవాదానికి (*Maetrialism*) ఎకనమిక్ డిటర్మినిజానికి చేరువయైన వర్గవిభాగానికి పడదు. పదార్థవాదం కేవలం అద్వైతసిద్ధాంతం. వర్గవిభాగం ద్వైతం మీద ఆధారపడియున్నది. పదార్థవాదం, మానవుని జీవితాన్ని సమస్తం భౌతికవిశ్వంతోడి సంబంధాలలో నిర్వచిస్తుంది. మానసిక తత్వశాస్త్రంలో గ్రహింపజాలని విషయాలను భౌతిక రసాయనికశాస్త్రాలు నిర్వచిస్తున్నై. విశ్వములో తరంగరూపంలోనున్న విద్యుత్ప్రవాహాల నుండి, మానవుని మేధస్సులోని ఆలోచనాపరంపరలవరకు తెగిపోని ఒక పరిణామసూత్రం ఉందని శాస్త్రం ఋజువు చేస్తోంది. అందుచేత క్రమబద్ధమైన భౌతికవిశ్వపరిణామక్రమంలో మానవుని జీవితం, భావాలు భాగాలని తేలుతుంది. ఒకే నేపథ్యంలో అవతరించిన మానవులందరిలో ఏదో ఒక లక్షణం సమానంగా ఉండటం ప్రకృతిధర్మం. కార్యకారణ సంబంధంతో నున్న విశ్వంలోనుండి పుట్టిన మానవునిలో ఆ ధర్మమే గోచరించాలి. అదే హేతువాదం. హేతువాదమే ప్రాథమికదశలో జీవితపోరాటమనబడే స్వేచ్ఛాన్వేషణకు మానవుని పురికొల్పినది. మానవులందరిలోనూ హేతువాదం సమాన సహజలక్షణం; స్వేచ్ఛాసాధన సమాశాశయం. 'స్పినోజా' చెప్పినట్లు ఇక సంఘర్షణకుతావేది? కమ్యూనిస్టులు దీని నంగీకరించరు. స్వభావ స్వరూపాన్ని దిద్దటంలో పరిసరాల ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాదించే రష్యన్ మార్క్సిస్టువ్యాఖ్యాతలు వర్గస్వభావానికేప్రాధాన్యత నిచ్చి మానవజాతికంతకూ సమానలక్షణమైన మానవత్వాన్ని ఎందుకు విస్మరిస్తున్నారో తెలియదు. మార్క్సు చెప్పియుండలేదని కాబోలు! మానవుని సహజలక్షణం హేతువాదం. కార్యకారణ సంబంధాలతో కూడిన హేతువాదం సహజలక్షణమైన మానవుడు నీతిబాహ్యుడు కాజాలడు. సాంఘికవాతావరణంవలన, సాంప్రదాయక విద్యాప్రభావంవలన నిద్రాణమైయున్న హేతువాదాన్ని మేలుకొల్పినచో వర్గవైమనస్యం కృత్రిమమని తేలిపోతుంది. వర్గ విభాగంతోనే—సంఘర్షణయే అభివృద్ధికి సాధన మనే సిద్ధాంతంలోని అసత్యం కూడా విశదమై అంతరిస్తుంది వినాశాత్మకమైన సంఘర్షణ అభివృద్ధికి సాధనమని హేతువాదంకి అంగీకరించదు. సామరస్యమే పురోగమనాని లక్షణం. హేతువాదం నీతి బాహ్యతను సమ్మతించదు. కమ్యూనిస్టుసిద్ధాంతం ప్రకారం ఆ... యం సాధనలను సమర్థిస్తుంది. హేతువా... దృష్టిలో ఇది అసత్యం. సాధనాల స్వభావ... ఆశయస్వరూపాన్ని నిర్ణయిస్తుంది. స్వాతం... త్ర్యాన్ని అరికట్టడంద్వారా సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని సాధించగలమనే నమ్మకం ఆత్మవంచన.

వర్గవిభాగంతో కూడిన సంఘర్షణసిద్ధాంతం మార్క్సిజానికే విరుద్ధం. మార్క్సు తన ప్రణాళికకు ఆదర్శం వర్గరహితమైన సమాజం అని సూచించాడు. వర్గరహితమైనసమాజంలో సంఘర్షణకు తావు లేదు. అందుచే మానవాభివృద్ధి నిలిచిపోవలసి వస్తుంది. చరిత్ర నిలిచిపోతుంది. జాతిపురోగమనం ఆగిపోతుంది. మార్క్సు ఉద్దేశించిన సమాజం స్తబ్ధమైనది కాదు. సజీవమైనది. కాబట్టి వర్గవిభాగం, దానిపై నాధారపడిన సంఘర్షణసిద్ధాంతం కేవలం అగరహితములైనవి. ఆ సత్యాన్ని ఇంకా కమ్యూనిస్టులు గ్రహించకపోటం ఆశ్చర్యం, కాదు శోచనీయం.

మార్క్సు దృష్టించిన వర్గరహిత సమాజ సృష్టికి తాత్కాలికమైన నియంతృత్వం సాధనమన్నాడు. ఇది ప్రకృతివిరుద్ధమే యైనప్పటికీ ప్లేటో సూచించిన "ఫిలాసఫర్ కింగ్" న దృష్టిలో నుంచుకొని అట్టి స్వేచ్ఛాపిపాసి స్వార్థానికి అతీతుడే నియంతృత్వం నిర్వహించాలని ఉద్దేశించియుంటాడు. కాని నేటి రష్యాలో నియంతృత్వం శాశ్వతమైపోయింది. సాధనమే ఆశయమైంది. దేశ పౌరులంతా "ఫిలాసఫర్సు" ఐననాడుగదా వ్య... నియంతృత్వం తొలగిపోయేది! నేటి రష్యాలో "ఫిలాసఫర్సు"కు బదులు యంత్రాలు తయారవుతున్నై. నియంతృత్వానికి సహజలక్షణం ఎదిరించిన వానిని తొలగించడమే ఐనప్పుడ దేశంలో మానసికపురోగమనానికి ఆధార మేది!

స్పానిష్‌తత్వవేత్త చెప్పినట్లు "ప్రశ్నాపూర్వకమై, సత్యాన్వేషణాత్మకమైన జిజ్ఞాసనశించిన దేశంలో ఒక క్రొత్త మార్క్సు, ఒక క్రొత్త తత్వవేత్త, ఒక క్రొత్త మహాకవి ఉండటానికి హక్కు లేదు. ఇట్టి సమాజం మార్క్సు కలలు గన్న సమాజానికి కేవలం విరుద్ధం." అంతేగాక నేడు రష్యాలో సమానత్వాన్ని సాధించాలనే

(22-వ పేజీ చూడుడు)



కాశ్మీర్ రంగంలో స్వాతంత్ర్యోత్సవం—కాశ్మీర్ ప్రాంతంలోని భారతసైనికులు స్వాతంత్ర్యోత్సవాన్ని మహోత్సాహంతో జరిపారు. కాశ్మీర్ ఉపప్రధాని బక్షి 'గాంధీభవన్'కు శంఖుస్థాపనచేసి గాంధీజీ విగ్రహానికి పూలమాలను వేస్తున్నారు.

దేశంలో వస్త్రోత్పత్తి తరగడానికి బాధ్యులెవరు?

[ఇంద్రసేన్]

వ్యాపారరంగంలో కొనుగోలుదార్లు ధరల్ని గురించి కొంచెం పూర్వాపరాలాలోచించడం ప్రారంభమైనందువల్ల వర్తకుల ప్రాబల్యం క్రమంగా క్షీణిస్తున్నకొద్దీ వస్తువుల అమ్మకం కొంచెం వెనకబడుతోంది. ధరల సమస్యనుగురించి అందరూ చింతలో పడ్డారు. పారిశ్రామికయజమానుల దృష్టికి వెంటనే కనపడుతున్నది కార్మికుల పనితనం. అంటే దామాషాని ఒక్కొక్క కార్మికుడు ఎంత వస్తుసామగ్రిని ఉత్పత్తి చెయ్యగలుగుతున్నాడు అనేది ప్రశ్న. దీనితో మళ్లీ పాతపాట - అంటే భారతదేశంలో కార్మికుల్లో పనితనం బొత్తిగా లోటనే నింద - ప్రారంభమయింది. యుద్ధకాలంజోరులో ఈమాట ఎవరికీ జ్ఞాపకమే లేకపోయింది. కొందరు దీన్నే నాజూగ్గా చెప్తూ, కార్మికులు చేతనయికూడా ఇష్టం లేక పనిలో మందగిస్తున్నారంటున్నారు. దీనివల్ల వస్త్రోత్పత్తి మనిషి ఒక్కంటికి తగ్గిపోయిందట. పారిశ్రామిక యజమానులు పదేపదే పనిచేతగానితనం, పనిమందం అంటోంటే, కార్మికులు ఇదంతా వొట్టిదనీ, తమ నెత్తిమీద ఇంకా బరువెత్తడానికీ, తమలో కొందర్ని పనిలోనుంచి తీసివెయ్యడానికీ యజమానులీ ఎత్తువేశారనీ అంటున్నారు. ఇంక వస్తువులు కొని వాడుకోవలసినవారు ఎటూ నిర్ధారణ చెయ్యలేని స్థితిలో ఉన్నారు. లెక్కలూ వివరాలూ లేని లోపం మరింత అనుభవమౌతోంది. ఈ పరిస్థితి ప్రభుత్వానికిగాని, పారిశ్రామిక యజమానులికిగాని, కార్మికసంఘాలకిగాని మంచిమాట తేలేదు. అందరికీ సంబంధించిన వస్త్రోత్పత్తిగతివివరాలు సేకరించవలసిన అవసరం ఎవరికీ పట్టలేదు.

ఇటీవలమాత్రం కేంద్రప్రభుత్వపు పారిశ్రామిక సలహాసంఘం ఏవో కొన్ని వివరాలు సంతరించింది. అవైనా ఒక్క పరిశ్రమకి సంబంధించినవిమాత్రమే. ఈవిషయమై సర్ అర్దేశర్ దలాల్‌గారు ఇటీవల పై సలహాసంఘసమావేశంలో ఏవో కొన్ని వివరాలు ఇచ్చారు. భారతదేశంలో ఇటువంటివి సంతరించడానికిదే మొదలు. ఆయనలెక్కలప్రకారం 1938-39 లో ఉక్కుఉత్పత్తి కార్మికుని ఒక్కంటికి 24 టన్నులు. ఇప్పుడు 16 టన్నులే. అంటే ఉత్పత్తి ప్రమాణం నూరింట 33 వంతులు తగ్గిపోయిందన్నమాట. బ్రిటన్‌లో కార్మికుల ఉత్పత్తిప్రమాణం నూరింట నాలుగున్నర వంతులు పెరిగింది. వాస్తవానికి మార్షల్ ఆర్థిక సహాయ ప్రణాళికలో సూచించబడినప్రకారం బ్రిటన్‌లో ఉత్పత్తిప్రమాణం పెరుగుదల నూరింట రెండున్నరవంతులే. దీనివల్ల ఒక్కటే విషయం బోధపడుతుంది. మన జాతీయార్థిక వ్యవస్థలో ఏదో పెద్దలోపం ఉంది. ఈ వస్త్రోత్పత్తితరుగుదలకి బాధ్యులెవరు? పెట్టుబడిదారా? కార్మికుడా?

కార్మికులు చెయ్యాలని పని తగ్గిస్తున్నారని నిందిస్తున్నారు సర్ అర్దేశర్ దలాల్. ఈ వాదాన్ని మనం వివరంగా పరిశీలించాలి. అసలు ఉత్పత్తిప్రమాణం దేనిపైన ఆధారపడి ఉంటుంది? కేవలం కార్మికుల పనిచెయ్యాలనే కోరికపైనా సమ్మతిపైనా ఆధారపడి ఉంటుందా? లేక ఇంకేవైనా ఇతర హేతువులున్నాయా? యంత్రపరికరాల బలంపైనగాని లేక వాని సౌలభ్యంపైనగాని ఆధారపడి ఉంటుందా? ఏ పరిస్థితుల్లో ఏ షరతులపైన కార్మికులు పనిచేస్తున్నారో వానిపైన ఆధారపడి ఉంటుందా? యజమానుల దక్షతపైనా, ఈ కాలంలో సంభవించే ముడిపదార్థాల కొరతపైనా ఆధారపడి ఉంటుందా? సర్ అర్దేశర్ గారు కార్మికుల్ని నిందించేముందు మిగతా విషయాలన్నీ తృప్తికరంగా ఉన్నాయని నిరూపించాలి. ఆయన ఆ విషయాలు చర్చించలేదు కాబట్టి మనమే పరిశీలించాలి.

పై చర్చనీయాంశాల్లో మొదటిది యంత్రపరికరాల బలం, సౌలభ్యం. తాతాకంపెనీవారి ఇనుము, ఉక్కుఫాక్టరీలో కార్మికుల ఉత్పత్తిప్రమాణంవివరాల్ని వారిచ్చారు కాబట్టి, ఆ ఫాక్టరీలోనే ఈ అంశాన్ని పరిశీలిద్దాం. ఆ కంపెనీ ఇటీవల ప్రచురించిన వార్షికనివేదికలో ఇలా ఉంది: "మా ఇంజనీరింగుసలహాదార్ల సూచనలప్రకారం యంత్రపరికరాలకు పెద్ద మరమ్మతులు చేయించాం. అవసరమైనచోట్ల పాతవి తీసేసి కొత్తవి నెలకొల్పాం. అయితే ఈ మరమ్మతుల కార్యక్రమం పూర్తిఅయేసరికి కొన్ని సంవత్సరాలు పట్టుతుంది." ఈ మరమ్మతులు మార్పుల కార్యక్రమం ఏమిటి? ఇవెంత పెద్ద మరమ్మతులు? యంత్రసామగ్రిలో ఎన్నోవంతు పాతబడి నిరుపయోగమైనాయి? ఈ యంత్రసామగ్రి చేసే పనికి ప్రమాణమెంత? ఈ వివరాల్ని ఆ వార్షికనివేదికా తెలపలేదు. ఆ కంపెనీ డైరెక్టర్లబోర్డుఉపాధ్యక్షులైన సర్ అర్దేశర్ దలాల్‌గారూ తెలపలేదు.

అయితే యంత్రసామగ్రికార్యప్రమాణాన్ని లెక్కగట్టడానికి ఉజ్జాయింపుపద్ధతి ఒకటుంది. 1938-39 వార్షికనివేదికా, 1948-49 వార్షికనివేదికా దగ్గర పెట్టుకు చూస్తే అవసరమైన వివరాలు దొరుకుతాయి. 1938-39 లో మొత్తం రు 26 కోట్ల 69 లక్షల పెట్టుబడి ఖర్చులో, యంత్రసామగ్రినిమిత్తం రు 19 కోట్ల 92 లక్షలు ఖర్చుపెట్టారు. డిప్రీసియేషన్ ఫండు రు 12 కోట్ల 56 లక్షలుంది. అంటే యంత్రసామగ్రిలో వాడుకవల్ల నిరుపయోగమైనది ఎంతంటే, రు 12 కోట్ల 56 లక్షల్నీ రు 19 కోట్ల 92 లక్షలతో హెచ్చవేసి రు 26.69 లక్షలు పెట్టి భాగిస్తే వచ్చేది రు 9 కోట్ల 38 లక్షలు. ఇది యంత్రసామగ్రినిమిత్తం ఖర్చుపెట్టిన పెట్టుబడిధనంలో నూరింట 35 వంతులు. అందువల్ల 1938-39 లో యంత్రసామగ్రిపనితనం నూరింట 35 వంతులు తగ్గిందన్నమాట. మొదటిదాంట్లో మిగిలిన పనితనం నూరింట 65 వంతులు. 1948-49 లో కూడా పైరీతిగా గుణిస్తే వచ్చే తరుగు నూరింట 60 వంతులు. అంటే మిగిలిన పనితనం నూరింట 40 వంతులే. అంటే పదేళ్లలో ఆయంత్రసామగ్రి పనితనం నూరింట 60 నుంచి నూరింట 40 కి దిగిందన్నమాట. ఈ తరుగుని ఖాతానికి కట్టితే నూరింట 38 వంతులు.


పదేళ్లలో ఆ యంత్రసామగ్రి ఉత్పత్తిప్రమాణం నూరింట 38 వంతులు తగ్గిపోయిందన్నమాట. ఇప్పుడు ఉత్పత్తిప్రమాణం తగ్గిపోవడానికి కార్మికులే బాధ్యులని నిందించడం సర్ అర్దేశర్ గారికి న్యాయమేనా?

యంత్రసామగ్రిని మరమ్మతు చెయ్యకుండా పాతవానిబదులు కొత్తవి నెలకొల్పకుండా ఉంచివేసినది ఉక్కుపరిశ్రమలోనే కాదు. అన్నిపరిశ్రమల్లోనూ యంత్రసామగ్రి పాతబడిపోయింది. యుద్ధకాలంలో ఈ యంత్రాల్ని రాపాడి విడిచిపెట్టారు. వానిని బాగుచెయ్యలేదు. మార్చలేదు.

తాతా కంపెనీవారి క్వార్టర్లీపత్రిక 1948 అక్టోబరుసంచికలో ఈ విధంగా వ్రాయబడింది: "నూలు, వస్త్రపరిశ్రమల్లో నూరింట 40 వంతులు యంత్రసామగ్రిని మార్చివెయ్యవలసిన అవసరం ఉంది. మిగతా పరిశ్రమల్లో పూర్తిగా అంత ఉండకపోయినా మార్చివెయ్యవలసిన యంత్రాల 40 వంతుల దరిదాపుల్లోనే ఉంటుంది. ఉక్కుపరిశ్రమలో వీని ఖర్చు రు 137 కోట్లని అంచనా వేశారు. ఇదైనా పొదుపుగా ఉండదలిస్తే. మిగతా పరిశ్రమలకి ఎంత ఖర్చు అవసరం ఉంటుందో వివరంగా తెలియదుగాని యంత్రాలు పాతబడిపోవడం సర్వత్రా సామాన్యవిషయం. యుద్ధానంతరం వస్త్రోత్పత్తి తరుగుదలకి ఇదే హేతువనేది నిస్సంశయం." కొద్దిమాసాలక్రిందట ఈ కంపెనీ పత్రిక నొక్కిచెప్పిన మాటల్ని, ఈ కంపెనీ ఉపాధ్యక్షులీనాడు కాదంటున్నారు.

ఇది చాలదన్నట్లు తాతాకంపెనీ ఉత్పత్తి తరుగుదలకి రవాణాకష్టాలు తోడైనాయి. 1948-49 వార్షికనివేదికలో ఇలా ఉంది: రవాణాచిక్కుల మూలంగా ఈసంవత్సరం కార్యకలాపానికి కొంత ఆటంకం కలిగింది. ముడిఇనుము, రాయిసున్నం, మొదలైన సరుకుల సప్లైకి ముఖ్యంగా రవాణాచిక్కులవల్ల కొరతయింది." ముడిసరుకులసప్లైకి ఆటంకాలు కలిగినప్పుడూ, యంత్రపరికరాలు పాతబడినప్పుడూ, కార్మికుల్ని నిందించడం న్యాయమేనా? బ్రిటన్‌లో కార్మికుల వేతనాలు తగ్గించడంకోసం లండన్ "ఎకానమిస్టు" పత్రిక ఎత్తువేసినట్లే ఇదీ ఉంది.

ఉత్పత్తి వృద్ధికావాలంటే ముందు యంత్రపరికరాలు చక్కగా పనిచెయ్యవలసిన అవసరం ఉంది. బాగా పాతబడిపోయిఉన్న రైలు ఇంజన్లు, వేగన్లు మార్చి కొత్తవి తెస్తేగాని రవాణాచిక్కులు పోవు. ఇటీవల పారిశ్రామిక శాఖా మంత్రిగారు వేసిన అంచనాప్రకారం, పరిశ్రమలకీ, రవాణాకీ, యంత్రపరికరాల మార్పుకీ దాదాపు రు 400 కోట్లు ఖర్చు అవుతుంది. ఇంత ఖర్చుకి పెట్టుబడి పెట్టడానికి పెట్టుబడిదార్లు సిద్ధంగా ఉన్నారా? సిద్ధంగా లేరని మా సంకోచం. డబ్బు నిలవలేదంటున్నారు. కాని అది నిజంకాదు. నిజానికి 1947 లో లియాఖత్ ఆలీబడ్జట్ ప్రవేశించేనాటికే పెట్టుబడిదారులు కొత్తగా తేగలిగిన నిలవడబ్బు పెట్టుబడికి రాకుండా అంతర్ధానమైపోయింది. పెట్టుబడిదారులు ఆర్థికమాంద్యంకోసం ఎదురుచూస్తున్నారు. వచ్చినతరవాత చవకలో యంత్రపరికరాలు కొని పాతవి తీసెయ్యాలని కనిపెట్టుకున్నారు. కలకత్తా భారతవాణిజ్యసభాధ్యక్షులు కె. యం. నాయక్ ఇలా అన్నారు: "పాశ్చాత్యదేశాల్లో ఆర్థికమాంద్యం రావడం పరిశ్రమల్లో వెనకబడిన దేశాలకు ఒకవిధంగా మంచిదే. ఎందువల్లనంటే ఆర్థిక మాంద్యం వచ్చినప్పుడే పరిశ్రమల్లో చాలా వృద్ధిపొందిన దేశాలు తదితరదేశాలగతిని గురించి ఆలోచిస్తాయి. అప్పుడు ఆ (పాశ్చాత్య) దేశాలమధ్య పోటీ వస్తుంది. తమ పరిశ్రమల్లో ఉత్పత్తిఅయ్యే యంత్రపరికరాలు అమ్మడానికి తొందరపడతారు. వెనుకపడిన దేశాల్లో సిసలైన ఖర్చులికి పరిశ్రమలు స్థాపించడానికి బేరంలో దిగివస్తారు. యుద్ధకాలంలోనూ ఆతరవాతనూ పదేళ్లపాటు "న్యాయమైన లాభాలు" ఆర్జించిన ఈ పెట్టుబడిదారులు ఆర్థికమాంద్యంకోసం కనిపెట్టికూర్చుని, అప్పుడు "సిసలైన ధరలకి" యంత్రపరికరాలు కొనాలని ఆశిస్తున్నారు. వీరీ విధంగా ఎంతకాలం మొండికెత్తి కూర్చుంటే ఉత్పత్తి ప్రమాణం ఇంకా తగ్గిపోవడం తథ్యం.



యలమట్టి పాఠశాలలో స్వాతంత్ర్యోత్సవదినమున "పతాకవందన" దృశ్యము.

పూర్వకాలంలో మన ప్రజాస్వామ్యసంస్థలు:

సమితి

శ్రీ ద్వివేది సత్యకవి

ఒకమారు మానవజీవితచరిత్రలో మన దృష్టిని బాగా వెనుకకు మగిడించి చూచినట్లయితే మనకు ఒక దివ్యమైన జ్యోతి గోచరిస్తుంది. అది ప్రజాప్రభుత్వాలు తలయెత్తిన ఈ రోజులలో ఈ శుభదివసాలలో ముఖ్యంగా అన్వేషించి తెలుసుకోదగ్గ ఒక ప్రముఖసంస్థ.

ఆనాటి భారతీయులు దానిని "సమితి"అని వ్యవహరించేవారు. సమితి అనగా ప్రజల యొక్క కూడిక. ఆ సమితి సర్వతంత్రస్వతంత్రత గల ప్రజాసంస్థ. అంటే ప్రజలపక్షమున ప్రాతినిధ్యం వహించిన ఒక ప్రభుత్వసంస్థ.

ఆరోజులలో మానవజీవితానికి పరమావధియైన విజ్ఞానానికి రాజకీయాలకూ సంబంధించిన అంశాలన్నీ అట్టి సంస్థలద్వారానే ప్రజాసామాన్యానికి అందుబాటులో ఉంటూ ఉండేవి. ఇది వేదకాలంనాటి ముచ్చట.

ఈ సమితి మూడుసంవత్సరములకొక పర్యాయం తమపాలకుని (రాజును) ఎన్నుకొంటూ ఉండేది. ఇందుకు దాఖలాగా అథర్వవేదంలోని—"త్వాం విశో వృణతాం". iii. 4. 2. ఈపంక్తి కనిపిస్తోంది. "నిన్ను ప్రజ ఎన్నుకొనవలయును." ఇది అర్థము.

ఋగ్వేదంలో ఈ—"విశస్త్వాం సర్వా వాంఛంతు." 10. 173. I. పంక్తి గోచరిస్తోంది. అర్థం ఒకటే. ఇట్టివి ఇంకా ఉన్నవి.

ఆ ప్రజాపరిషత్తునకు ప్రవాసశిక్షను అనుభవించినరాజును తిరిగి ఎన్నుకొనే హక్కు కూడా ఉంది. ఈవిషయాన్ని ముందటివ్యాసాలలో విశదీకరిస్తాను.

"సమానో మంత్ర స్సమితి స్సమానీ" అథ. 6.44. "సమానంవ్రతం సహచిత్తమేషాం. ఋ. వే. 10. 191.3. సమితి ఉండవలసినపద్ధతిని ఈమంత్రాలు ఇల్లా ఆదేశిస్తున్నాయి. "సమితిలో ఉన్న ప్రజలందరూ ఏకాభిప్రాయంతో ఉండాలి. అక్కడ చర్చకువచ్చి ఏదో ఒక నిశ్చయమైన ఆకృతిని వహింపబోయే అంశాలు సమితి కంతకూ అనుకూలంగా ఉండాలి" ఇది ఆపంక్తులసారాంశం. ఇప్పుడు రాజకీయాలన్నీ సమితిలో చర్చింపబడుతూ ఉండేవనే పరమార్థం ఒకటి వ్యక్తమయింది.

రాజు నిర్ణీతకాలాలలో సమితియందు హాజరుగా ఉంటూ ఉండేవాడు. అది అతని విధ్యుక్త ధర్మము. అల్లా హాజరు కాకపోతే ఆ రాజు అయోగ్యుడుగా పరిగణింపబడుతాడు.

ఋగ్వేదములోని ఈ—"రాజానసత్యస్స—మితీరియానః." 9. 92. 6. పంక్తి ఆ విషయాన్నే ఉద్ఘాటిస్తోంది. రాజుగారు సమితి యందల్లా నిర్ణీతకాలాలలో సన్నిహితుడై ఉండడం ఎందుకో ముందు వివరింపబడుతుంది వేదకాలం నాటి పట్టాభిషేకఘట్టంలో. ఇందుకు ఛాందోగ్య ఉపనిషత్తు ఒక దాఖలా. శ్వేతకేతు అరుణేయ గౌతముడు తాను పాంచాల సమితిని దర్శింపబోయినప్పుడు ప్రవాహన జైవలుడనే అక్కడి రాజు ఆ సమితిలో ఉన్నట్లుగా పై గ్రంథము వ్యక్తీకరిస్తోంది.

ఈ రోజులలోవలెనే అప్పుడు కూడా సమితులలో వక్తలు (*Speakers*) ఉండేవారు. సమయం వచ్చినప్పుడెల్లా సమితులకు ఒప్పేటట్లుగా ఉపన్యసిస్తూ ఉండేవారు. అయితే ఆ ఉపన్యాసకులు ఎవరిచేతా ఓడింప బడనంత అలివిగల ఘటాలుగా ఋజువుకావాలి. అప్పుడే వారికి ఆపదవి లభిస్తుంది.

అథర్వవేదంలోని—"యే సంగ్రామాస్సమితిర్యస్తేషు చారువదేమ తే" 7. 12. 1.: 12. 1.56. ఈ పంక్తి అదే విషయాన్ని నొక్కాణిస్తోంది. పైన ఉదాహృతిమైన శ్వేతకేతునికథవల్ల ఆ సమితులలో కేవలము రాజకీయాలే కాక తదితర చర్చలుకూడా జరుగుతూ ఉన్నట్లు స్పష్టమవుతోంది.

నిజానికి శ్వేతకేతుడు గొప్ప పండితుడు. ఇరువది నాలుగు సంవత్సరాల వయస్సు చొరబడేటప్పటికే వేదాంతశాస్త్రంలో గొప్పవిద్వాంసుడయేడు. ఇతడు విద్య పూర్తికాగానే పాంచాల పరిషత్తునకు, (బహుశా అది యోగ్యతా పత్రికలను ఇచ్చేస్థానమేమో) వస్తాడు. అప్పుడు పాంచాలరాజైన ప్రవాహనజైవలుడు శ్వేతకేతునకు కొన్ని ప్రశ్నలు ఇచ్చాడు. పాపం, శ్వేతకేతుడు ఉత్తీర్ణుడు కాలేకపోయాడు.

అపుడు రాజు—"ఈ మాత్రంకూడా తెలియనప్పుడు నువ్వు పండితుడ వెల్లా అవుతావు ?" అని ఎత్తిపొడుస్తాడు. ఇపుడు బాగాఆలోచించి చూస్తే ఆ సమితులు విద్యార్థులకు వారి వారి యోగ్యతా యోగ్యతలను అరసి పట్టాలను ఇచ్చే నేటి విశ్వ విద్యాలయాలవంటి జాతీయ సాహితీ పరిషత్తులుగా కూడా వినియోగింపబడుతూ ఉండేవనీ ఇప్పటి మాదిరిగానే వాటికి అధ్యక్షుడు (ఛాన్సలర్) రాజే ఉండేవాడనీ ప్రధాన పరీక్షాధికారత్వము కూడా అతనికే ఉండేదనీ వ్యక్తమవుతోంది.

కొందరు పాశ్చాత్యపండితులు ఈ సమితిని పూర్వకాలంలో యూరపుఖండంలో ఉన్న సమితులతో పోలుస్తారు, కాని అది అనుచితం. వేదకాలంనాటి సమితులు దివ్యమైన నాగరకతతో తులతూగుతూ మంచి అభ్యుదయవంతాలుగా ఉండేవి.

యూరపుఖండంలోని జర్మానిక్ ప్రజాపరిషత్తులు భారతీయపరిషత్తుల మాదిరిగా విద్యావంతాలు కావు. ఏ కొద్దిమందో విద్యావంతులు ఉండేవారు. ఇక్కడ, అల్లా కాదు. అందరు ఆరితేరిన విద్యావంతులు, రాజకార్య దురంధరులూ అయినప్పుడు రెండిటికి పోలిక ఎల్లా సరిపడుతుంది ? నక్కెక్కడ ? దేవలోక మెక్కడ ?

ఇంకో విషయం ఏమిటంటే, ఆ సమితులకు అధ్యక్షులు కూడా ఉండేవారు. ఈ విషయాన్ని ఈ 111,13.4.పారస్కర గృహ్యసూత్రము తేటతెల్లముగా వివరించింది. ఆ సభాపతికి ఎవరూ కాదనలేనంత శక్తి లభిస్తుందట.

ఆ కాలంలో గ్రామాధికారులకు గ్రామణి అనే పారిభాషికపదం వ్యవహృతిలో ఉంటూ ఉండేది. వారు గ్రామాలకు చాలా ముఖ్యులు. రాజుగారి పట్టాభిషేకసమయములో గ్రామాల తరఫున ప్రతినిధులుగా ఆ గ్రామణులే హాజరవడం ఆ రోజులలో ఒక ఆచారము. అల్లా వాణిజ్యవర్గ ప్రతినిధులు కూడా హాజరవుతూ ఉండడం కూడా కలదు. ఇపుడు ప్రపంచమంతటా అమలులోఉన్న ప్రాతినిధ్య పద్ధతిని మన మాతృభూమి ఆ వేదయుగంనాడే అవలంబించుకోగలిగిందన్నమాట. అంటే, దానికి జన్మస్థానము గోరూపధారిణియగు భరతభూమి.

వేదకాలంనాటి రాజకీయశాస్త్రజ్ఞులు గ్రామాల ఉనికికి ఎంత ప్రాముఖ్యం ఇచ్చేరో మరొక విషయంవల్ల మనము ఇంకా బాగా తెలుసుకోగలుగుతాం.

ఆ రోజులలో ప్రతి గ్రామంలోను ఒక్కొక్క పరిషత్తు ఉండేది. స్థానికవివాదాలు ఆ పరిషత్తులలో పరిష్కరింపబడుతూ ఉండేవి. అవే ఈనాటి పంచాయితీ సభలు. ఇవి ఈనాటివి కావు. ఆనాటివనే చెప్పాలి.

సాధారణముగా గ్రామస్థులు ఆ గ్రామానికి తలమానికమైన గ్రామణినామముతో వ్యవహరింపబడుతూ ఉండడం కూడా ఆనాటి ఆచారం. అంటే, ఆ గ్రామానికి గ్రామణిగా నియమింపబడిన వ్యక్తిపేరు దేవదత్తుడైతే ఆ గ్రామస్థులందరూ దేవదత్తకులని పిలువబడేవారు. ఈ విష

(21 వ-పేజీ చూడుడు)

బ్రిటన్ లో పశుసంపద్వృద్ధి

బ్రిటన్ లో రాయల్ అగ్రికల్చరల్ సొసైటీ ఆధ్వర్యంకింద 1949 జూలైలో ష్రూస్ బరీలో పశుప్రదర్శనం జరిగింది. బ్రిటన్ లో నలుమూలల్నించీ రైతుజనం వచ్చి చూశారు. పరదేశాలనుంచి కూడా వచ్చారు. మూడువేల పశువులు ప్రదర్శించబడినాయి. రకరకాల వ్యవసాయపరికరాలు ప్రదర్శింపబడినాయి.

ఇటువంటి ప్రదర్శనాలు బ్రిటన్ లో ఈ సొసైటీఆధ్వర్యంక్రింద ప్రతిసంవత్సరం జరుగుతాయి. కాని ఎప్పుడూ ఒకేచోట జరపడం సొసైటీ కిష్టంలేదు. సాలు కొకప్రాంతం ఎన్నుకుంటుంది. జాగా దొరకడం దుర్ఘటమయ్యే ప్రాంతాల్లో కొంత భూమి కొనాలని సొసైటీ తలపెట్టుతోంది. మూడునాలుగుచోట్ల కొని, ప్రదర్శనాలు లేనప్పుడు వ్యవసాయంకోసం రైతులకు అద్దె కివ్వదలిచారు.


ఈ సొసైటీఆధ్వర్యంకింద జరిగే ప్రదర్శనాలు సాలుసాలుకీ కొత్తదనం చూపుతాయి. ఇవిగాక కొన్నికొన్ని మండలాల్లో చిన్న ప్రదర్శనాలు కూడా ఏర్పాటవుతాయి.

డెవన్ ప్రదర్శనంలో 20 రకాల ఎద్దులు, ఆవులు, 30 రకాల గొర్రెలు, 12 రకాల పందులు ఉన్నాయి. ఆహారం దొరకడం ఈ రోజుల్లో దుర్ఘటంగా ఉన్నా, పశువుల పెంపకంలో బ్రిటన్ లోటు రానివ్వడం లేదు. గొర్రెల పెంపకంలో క్రమాభివృద్ధి కనిపిస్తోంది. గుర్రాలు కూడా మేలైనవి ప్రతి ప్రదర్శనంలోనూ కానవస్తాయి.


యంత్రపరకరాల ఉత్పత్తి వృద్ధి అయింది. ప్రదర్శనాల్లో కొత్తరకాలు కనిపిస్తున్నాయి. దీని వ్యాపారంలో రైతు వేచిఉండవలసిన కాలం తీరిపోయింది. కావలసినప్పుడు, కావలసిన వస్తువు దొరుకుతోంది. గడ్డికోతకి కొత్తరకాల పరికరాలు తయారైనాయి. మంచి రకానికి మూడువేలపౌనులు బహుమానం ఇవ్వగలరని ప్రకటించారు. గడ్డినిలవకి కూడా అనేక యత్నాలు జరుగుతున్నాయి. చిన్నచిన్న కమతాలకి అవసరమైన పరికరాల్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ రోజుల్లో బ్రిటన్ లో పశుప్రదర్శనాలంటే రైతులోకానికి పండగలైనాయి.

[బ్రిటిష్ సమాచారశాఖాపత్రం ఆధారం.

—కాపీరైట్




1949 జూన్ లో డండీలో (బ్రిటన్ పర్వతప్రాంతంలో) జరిగిన ప్రదర్శనం. చిత్రంలోఉన్నవి. అబర్డీన్ అంగస్ పశువులు.



—, ఆవు: బ్రిటన్ లో జరిగిన పశుప్రదర్శనాలలో చాల బహుమతులు, పతకాలు పొందినది.

మన రాష్ట్రం మన దేశం



★ రాయలసీమ కళాశాలల్ని ఆంధ్రకళాపరిషత్తులో చేర్చాలి

రాయలసీమకళాశాలలు ఆంధ్రవిశ్వకళాపరిషత్తులో ఇంతవరకూ చేరకపోవడం చాలా ఆశ్చర్యంగా ఉందన్నారు ఆర్థికశాఖామంత్రి శ్రీ గోపాలరెడ్డిగారు ప్రెసిడెన్సీ కాలేజీలో ఉపన్యసిస్తూ. శ్రీ గోపాలరెడ్డిగారు చెప్పినట్లు, రాయలసీమనీ సర్కారుజిల్లాల్నీ చేర్చి, ఆంధ్ర రాష్ట్రంగా నిర్మించాలని ఆందోళన చేస్తూ, పై విషయమై మిన్నకుండడం నిజంగా అందరికీ వింతగానే ఉంది. అయితే ఎవరు మిన్నకున్నారు అనేది ప్రశ్న.

రాయలసీమనాయకులు సుముఖంగా లేరని శ్రీ రెడ్డిగారు చెప్పారు. "విద్యాధికులు, ప్రజాభిప్రాయం తెలిసినవారనుకునే న్యాయవాదులు కొన్ని అనుమానాలూ, సందేహాలూ వెల్లడిస్తూ" అలా చేరడానికి విముఖత చూపుతున్నారని చెప్పారు.

రాయలసీమ కళాశాలల్ని ఆంధ్రవిశ్వ కళాపరిషత్తులో చేర్చాలా చేర్చరాదా అనే విషయమై శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారి అధ్యక్షత క్రింద ఒక విచారణసంఘం పరిశీలన చేసింది. చేర్చాలని సూచిస్తూ ప్రభుత్వానికి ఆ కమిటీ నివేదించింది. ఆ నివేదికను చెన్నరాష్ట్ర ప్రభుత్వం మన్నించింది కాదు. ఒక్క అవినాశిలింగంగారే ఇందుకు కారకులనేవార్త ఆ రోజుల్లో ప్రచారమయింది. దానిపైన కొందరు తెలుగుమంత్రులే కారకులని శ్రీ అవినాశిలింగంగారన్నారు. ఏది నిజమైనా అప్పుడు తెలుగుమంత్రులు తమకు కానట్లు పట్టించుకోలేదని, చెప్తే నమ్మదగిన ట్లున్నాయి అప్పటి పరిస్థితులు. అసెంబ్లీలో ఈవిషయమై ప్రశ్నలకు మంత్రులు సమాధానాలిచ్చినప్పుడు ఈవిషయం స్పష్టమయింది.

రాయలసీమ శాసనసభ్యుల్ని, మంత్రుల్ని అప్పుడు సంప్రదించారనీ వారు సుముఖంగా లేనందువల్ల అప్పుడు ప్రభుత్వం ఆరీతిగా చేసిందనీ అన్నారు శ్రీ గోపాలరెడ్డిగారు.

సంకుచిత రాజకీయాలలో అవసరాలు, ప్రజాహితం, న్యాయాన్యాయాలు ,అంతగా గణనకి రాకపోవడం అప్పుడప్పుడు జరుగుతున్నదే. ప్రస్తుత విషయం విద్యావ్యాప్తికి సంబంధించినదైనా రాజకీయాలతో ముడిపడి ఈరీతిగా భంగపడిందంటే ఆశ్చర్యం లేదు. కాని అదే ప్రజల అభిప్రాయమని నిర్ధారణ చెయ్యడం పొరపాటు.

మంత్రివర్గం ఇప్పుడు రాయలసీమకళాశాలల్ని ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో చేర్చడానికి వెంటనే పూనుకోవలసిన అవసరం ఉంది. ఇది ఎప్పుడో జరిగి ఉండవలసింది. జాప్యం అయిన మాట నిజమే. కాని ఇప్పుడైనా త్వరపడి ప్రభుత్వం చర్య తీసుకోవాలి.

శ్రీ గోపాలరెడ్డిగారు చెప్పినట్లు రాష్ట్రం రావడానికి ముందు ఇది అవసరం. తెలుగువారికి ఒక సంస్కృతి, ఒక చరిత్ర, ఒకవిజ్ఞానం, ఒక సారస్వతం, సమకూర్చుకోడం అవసరం. రాజకీయంగా ఆర్థికంగా కొన్ని ప్రత్యేక హంగులు కావాలని కోరడంలో తప్పు లేదు. కాని రాజకీయాలకు సంబంధం లేని ఈ విషయంలో షరతులు విధించడం అనవసరం. సబబు కాదు. అయితే ఆ షరతులు తీరిస్తేనే రాయలసీమ కళాశాలల్ని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చేరాలి అంటున్నారు కదా అని, అవసరమైన కార్యాన్ని నిలిపివెయ్యడం మంచిది కాదు. అసలు అలా అభ్యంతరపెట్టేవారున్నారో లేదో, అభ్యంతర పెట్టేవారెవరో గమనించడం అవసరం. ఆ అభ్యంతరాల్లో అర్థం లేదని, అన్యకారణాలవల్లనే ఈ అభ్యంతరాలు కొద్దిమంది నాయకులు విద్యాధికుల నోటనే వినవస్తుందని గ్రహించినప్పుడు ప్రభుత్వం వానిని తోసిపుచ్చి కార్యాచరణకు పూనుకోవాలి.

నిజానికి ఈ అభ్యంతరాలేవీ అర్థం లేనివి. శ్రీ గోపాలరెడ్డిగారు తమ ఉపన్యాసంలో ఇలా అన్నారు: "రాయలసీమవారికి కొన్ని అనుమానాలున్నవి. అవి తీర్చవలసిన అవసరమున్నది. రాజకీయ నాయకులవరకూ ఎందుకు? ఆంధ్ర విశ్వవిద్యాలయములో చేరతారా అని రాయలసీమ విద్యార్థుల్నే అడిగిచూడండి. చేరమని నిరాకరిస్తారు" అని చెప్పి ఇది యథార్థమవునా కాదా అని విద్యార్థుల్ని ప్రశ్నించారు.

రాయలసీమనుంచివచ్చి ప్రెసిడెన్సీ కళాశాలలో చదువుతున్న ఒక విద్యార్థి ఇలా అన్నాడు: "అది సరి కాదు. మేము ఆంధ్రవిశ్వవిద్యాలయంలో చేరాలని కోరుతున్నాము" అన్నాడు. దీనికి ఇతర విద్యార్థులు అభ్యంతరం తెలపలేదుకూడా. విషయాలు తెలియనివారికి ఇది కన్ను విప్పుకోవాలి. వాస్తవానికి రాయలసీమ ప్రజల్లో విముఖత లేనేలేదు. వారి కళాశాలల్ని విశ్వవిద్యాలయంలో చేర్చడానికిగాని, ఆంధ్రరాష్ట్రంలో చేరడానికిగాని రాయలసీమ ప్రజలకు ఎటువంటి ఆక్షేపణా లేదు. కాని ఆక్షేపణలు తెలిపే నాయకుల ప్రచారంమాత్రం అధికంగా ఉంది. ఇటువంటివారు శ్రీ గోపాలరెడ్డిగారి సమాధానం గమనించవలసిన అవసరం ఉంది.

అభ్యంతరం చెప్పేవారి వాదంలో బలం ఉందని కాదు. కాని వారిని తృప్తి పరచడం అవసరం. సులువు కూడా. శ్రీ గోపాలరెడ్డిగారు అన్నారు:

"ఆంధ్రరాష్ట్రము అనే సరికే ఇటీవల అనుకోకపోయినా, కొంతకాలము కిందటివరకూ రాయలసీమవారు కొందరు మా హక్కులు కొన్ని కొన్ని గుర్తించిన గాని ఆంధ్ర రాష్ట్రములో చేరము అంటూ వచ్చారు. నేను రాయలసీమలో చూచినంతవరకూ విద్యాధికులు, ప్రజాభిప్రాయవేదులు అని చెప్పే న్యాయవాదులు, తోడనే ఆంధ్రరాష్ట్రములో చేరుటకు సుముఖంగా లేక కొన్ని అనుమానాలు, సందేహాలు వెల్లడిస్తూ వచ్చారు.

రాయలసీమను ప్రత్యేకప్రాంతంగా ఉంచి, కృష్ణదేవరాయలు రాజ్యమేలిన భాగము లన్నిటినీ చేర్చి ప్రత్యేక రాష్ట్రము కావలెననీ, ప్రత్యేక విశ్వవిద్యాలయము కావలెననీ ఒక ఆందోళన ఉన్నది. ఇది నాకు ఆశ్చర్యముగా ఉన్నది. అందువల్ల మద్రాసుప్రభుత్వంలో ఆ యా జిల్లాలలో వివిధ హంశాల క్రింద వచ్చే ఆదాయమూ, ఖర్చూ ఏ విధంగా జరుగుతోందో నేను పరిశీలించాను. దిగువ ఇవ్వబడిన చిత్తూరు, కడప మున్నగు రాయలసీమజిల్లాలలో ఆదాయం కన్నా ఇప్పుడు ఖర్చు హెచ్చుగా వున్నది. ఇవి లోటుజిల్లాలు. సర్కారుజిల్లాల ఆదాయంతో పోల్చి చూస్తే అక్కడ పెట్టే ఖర్చు తక్కువగా ఉన్నది. ఇప్పటికన్నా రాష్ట్రం విడిపోయినపుడు వ్యయం ఎక్కువ అవుతుంది. అందువల్ల రాయలసీమవారు ప్రత్యేకరాష్ట్రము కావాలనడము న్యాయము కాదు. ఆర్థికంగా వారికే నష్టము. రాయలసీమ విడిపోతానంటే సర్కార్లకేమీ నష్టం లేదు సరిగదా వారికి లాభదాయకమే. ఆర్థికంగాను, సాంస్కృతికంగానూ, రాజకీయంగాను, రాయలసీమ సర్కార్లు కలసి, ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలు, అభ్యుదయం గాంచిన ప్రాంతాలు ఏకరాష్ట్రముగా ఉండటం అందరూ కోరదగినది.

ఆర్థిక సంపత్తి

ప్రపంచంలో వ్యక్తికి గాని, ప్రభుత్వానికి గాని అర్థబలం ఉండాలి. రేపు రాష్ట్రము వచ్చినపుడు గ్రామాలలో పాఠశాలలు, రోడ్లు, వైద్యాలయములు, కావలెనంటే ఎన్నో కోట్ల ద్రవ్యము కావలసివున్నది. ప్రభుత్వము నడవాలంటే డబ్బు అవసరము. దేశంలో ఆర్థిక దుస్థితి ఏర్పడింది. అందువల్ల కేంద్రప్రభుత్వం అప్పుడే వ్యయము తగ్గించుకొనేందుకు అనేక మార్గాలు అన్వేషిస్తోంది. చెన్నరాష్ట్రం విషయంలో కానీండి, ఆంధ్రరాష్ట్రం విషయంలో కానీండి, మనదేశ పునర్నిర్మాణానికి ఆర్థికసంపద ఏవిధంగా పెంపొందించుకోవడమా అని ప్రతి ఆంధ్రుడూ ఆలోచించవలెను. క్రిందటేడూ ఆ క్రిందటేడూ ఏదోవిధంగా మన ఆదాయాన్ని,వ్యయాన్ని,సమాళించుకుంటూ వచ్చాము. ఒకయేడు 5 కోట్ల పదిలక్షలూ క్రిందటేడు 36 లక్షలూ మిగులు చూపించాము. 17 కోట్లు మద్యనిషేధంవల్ల పోగొట్టుకున్నాము. ఈసాలు నాల్గుకోట్లు నష్టంవస్తుందని కొన్నిశిస్తులు వేయజూచాము. కొన్ని వేసేసరికి పెద్దఆందోళన బయలుదేరింది. కొత్తపన్నులవల్ల ఒకకోటి ఆదాయంవస్తే రావచ్చుకాని ఆందోళన ప్రబలిపోయింది. ఆంధ్రరాష్ట్రములోగాని, చెన్నరాష్ట్రములోగాని ఆర్థికబలం లేనిదే ప్రజలకు, రైతులకు ఏమీచేయడానికి ప్రభుత్వమునకు వీలు ఉండదు. ఎన్నో అవసరకార్యాలను అట్టే ఉంచినా పరిస్థితి ఇటుల ఉంది.

"33 కోట్లు మనకు రెవెన్యూ రిజర్వునిధి ఉన్నది. ఈ సందర్భంలో నానాటికి రాష్ట్రాలకు వచ్చే ఆదాయమార్గాలను కేంద్రప్రభుత్వం వారు అరికడుతున్నారు. కొత్తరాజ్యాంగం ప్రకారం అదివరకు రాష్ట్రాలకు ఉండే పన్ను అధికారాలు కొన్ని తగ్గుతున్నవి. పరాయి దండయాత్రలను ఎదుర్కొనడానికి, దేశంలో అంతఃకలహాలను అదుపులో ఉంచడానికి, రైళ్లను, రహదార్లను, తంతి తపాలామార్గాలను నిర్వహించడానికి, విదేశాలతో సంబంధాలను సాగించడానికి, ఎగుమతి దిగుమతుల వ్యాపారమును నడిపించడానికి, కేంద్రప్రభుత్వానికి ఆర్థికసంపద ఉండాలి. దేశవిభజనానంతరం శక్తివంతమైన బలవంతమైన కేంద్రప్రభుత్వం ఉండాలని దేశములో అభిప్రాయం ప్రబలినది. కాని రాష్ట్రాల్లో ప్రజల ఆరోగ్యానికి, నీటివసతికి, విద్యకు బాధ్యతవహించే రాష్ట్రప్రభుత్వాలకు బాధ్యతకు తగిన ఆర్థికసహాయము లేకపోతే నిజాయితీకి చాలాభంగకరము. పైవారి దయాదాక్షిణ్యాబిచ్చానికి, క్రీగంటిచూపులకు ఆతురులై ఉండటం సబబు కాదు.

"ఇప్పుడు రాష్ట్రంలో విద్యకు తొమ్మిది కోట్లు ఖర్చుచేస్తున్నాము. ఇంత హెచ్చుఖర్చు చేసే రాష్ట్రం మరొకటి లేదు. 5 ఇంజనీరింగు కళాశాలలున్నవి. అయినా ప్రతిభావంతులైన ఎందరో విద్యార్థులకు వారు కోరిన రంగంలో ప్రవేశము దొరకకున్నది. వచ్చే దఫ ఖాస్తులలో అయిదోవంతో ఆరోవంతో ప్రవేశము ఇవ్వగలుగుచున్నాము. రెండు వేలవరకూ దరఖాస్తులు వస్తే ఏ మూడువందలమందికో స్థానములు లభించుచున్నవి. విద్యకు, వైద్యానికి రస్తాలకు గ్రామాల్లో ఇంకా ఎన్నోకోట్లు వెచ్చిస్తేనేగాని పరిపాలన 'పరిపాలన' అనిపించుకొనదు. మన రాష్ట్రంలో వ్యవసాయానికి ఒక కోటిదాకా ఖర్చు పెడుతున్నాము. ఇంత తక్కువ ఖర్చు చేసే రాష్ట్రము మరొకటి లేదని మరోరాష్ట్ర గవర్నరుగారు మనకు వ్రాశారు. అందువల్ల మన వ్యవసాయమంత్రి వ్యవసాయాభివృద్ధికి అధికధనము కోరుచున్నారు. గ్రామస్వరాజ్యమునిమిత్తము పంచాయతీలకు 1/8 వంతు శిస్తు అట్టే ఉంచవలెనని గ్రామపంచాయితీమంత్రి చంద్రమౌళిగారు అనుచున్నారు. ఎన్నో గ్రామాలకు నీటివసతి, మురుగుసౌకర్యాలు కలిగించవలసి ఉన్నది. ఆంధ్రదేశంలో గోదావరి,కృష్ణామున్నగు పెద్దపెద్ద నదులపై ఆనకట్టలను కట్టి నదీజలాలను సద్వినియోగంచేసి సస్యాభివృద్ధి చేయవలసి ఉన్నది. ఇట్టి పరిస్థితులలో రాష్ట్రప్రభుత్వాలు బాధ్యతకు తగినట్లు ఆర్థిక సంపద వకాశాల్లు ఉండాలని చెబుతే దేశంలో ఇప్పుడు ఉన్న పరిస్థితులను బట్టి గోపాలస్వామి అయ్యంగారు అంబేద్కరుగారలు వినేట్లు లేదు. చైనా, బర్మా దేశాల విప్లవాలు, ఇతరమైన అనేక కారణాలవల్ల కేంద్రప్రభుత్వం ఎట్టి అవసర పరిస్థితినైనా ఎదుర్కొనడానికి వారు ప్రత్యేకాధికారాలు తీసుకున్నారు. ఆంధ్రరాష్ట్రం వస్తే ప్రత్యేక గవర్నరు, సెక్రేటేరియట్ కావాలి. గవర్నరుబృందానికి ఆరేడు లక్షల ఖర్చు ఉంటుంది. ఇట్టి పరిస్థితులలో ప్రజలకు నూతనమైన భావాన్ని కలుగజెయ్యాలి. ప్రజాప్రభుత్వము అని నోటితో చెప్పి, పన్నులు చెల్లించవలసివచ్చేసరికి ఆందోళనచేస్తే లాభము లేదు. రాజ్యాంగచక్రం నడవటానికి తైలం కావాలి. ఆంధ్రులము రాష్ట్రంకోసం ఉవ్విళ్లూరుచున్నాము, రాష్ట్రం వస్తే ఈచిక్కులు అన్నీ ఉన్నాయి. అయితే హిందూ, ముస్లింతగాదాలు ఉన్నాయని స్వరాజ్యం వద్దనలేదు. బాధ్యతను చూచి భయపడి రాష్ట్రంవద్దని గాదు. మనపైపడే పెద్దబాధ్యత మనము గుర్తెరిగి వర్తించాలని చెబుతున్నాను. రాష్ట్రాలఆదాయవ్యయాలను పరిశీలించడానికి నవంబరులో పండిత నెహ్రూ ఒక విచారణసంఘాన్ని వేస్తామన్నారు. ఆంధ్రులకు రాష్ట్రం రేపు రావచ్చు. 5 ఏళ్లకు రావచ్చు; పదే

(21 వ పేజీ చూడుడు)

ప్రాచీనగ్రామసభల న్యాయపరిపాలనము

శ్రీ కోన వేంకటరాయశర్మ

౨

సరిహద్దునిర్ణయము :

సరిహద్దులవిషయమై కలుగు వివాదములలో సాక్షులులేనియపుడు సరిహద్దు గ్రామముల చెంటియొక్క నాల్గుప్రక్కల నుండువారిలో నలుగురు మనుష్యులు వివాదను బరిష్కరింప వచ్చునని "సాక్ష్యభావే తు చత్వారో గ్రామాః సామంతవాసినః, సీమావినిర్ణయం కుర్యుః ప్రయతా రాజసన్నిధౌ" అను మనువచనముం బట్టి తెలియుచున్నది. పొలముల, నూతుల, జెలువుల, దోటల, నిండ్ల సరిహద్దులగుతుల నిరూపణము తత్ప్రాంతీయుల సాక్ష్యము మీదనే యాధారపడునని మనుస్మృతియందు వ్రాయబడినది. అట్టి ప్రాంతీయుల సాక్ష్యము లేనియపుడు వివాదస్థలమునకు దగ్గఱగా నుండు నరణ్యమునగల వేటకాండ్రు, బోయవాండ్రు, గొల్లవాండ్రు, పల్లెవాండ్రు, పాములబట్టువారు, – లోనగువారు సాక్ష్యమీదగునట! సాగుబడి భూములకు సంబంధించిన వివాదములయందు సమీపగ్రామవాసులును, వృద్ధులును, గొల్లలును ఆ భూములను సాగుజేయు రైతులును, – పరిష్కారమునకు దలపడి సరిహద్దును నిర్ణయింపవలెనని యాజ్ఞవల్క్యమహర్షి వచించినాడు. సమీపగ్రామప్రజలు నలుగురుగాని, యెనమండ్రుగాని పదిమందిగాని చేరి సరిహద్దుల నిర్ణయించవలయును. కౌటిల్యుడుసైత మీ యభిప్రాయమునే జెలిబుచ్చినాడు. సమీపగ్రామవృద్ధులు వివాదను బరిష్కరించి యుభయపక్షములవారికి తృప్తికరముగా నుండునట్లు గార్యనిర్ణయ మొనర్పవలయును. ఇట్టి న్యాయసభలో సాబాలుకంటె నెక్కువమంది యెట్లు నిర్ణయించెదరో యట్లు జెల్లుచుండెనని కౌటిల్యునభిప్రాయము. స్మృతికర్తలందఱును బ్రాంతీయుల సాక్ష్యమే యధికముగ గార్యనిర్ణయమున నుపయోగింపవలెనని చెప్పుచున్నారు.

సరిహద్దువిషయమై వివాద ఘటించినపుడు సాక్ష్యము సరియైనదిగాదని తోచినచో రాజు తన యిష్టమువచ్చినట్లు నిర్ణయము సేయవచ్చును. వసిష్ఠమహర్షి "గృహక్షేత్రవిరోధే సామంతప్రత్యయః సామంతవిరోధేపి లేఖ్య, ప్రత్యయః" అని చెప్పియుండుటవలన నొక గృహమును గుఱించికాని, క్షేత్రములగూర్చికాని, వివాదము ఘటిల్లించినపుడు తత్ప్రాంతీయుల యభిప్రాయములననుసరించియే వ్యవహార నిర్ణయ మాధారపడియుండునని తెలియుచున్నది. ఈ నిర్ణయమునకే యాంగ్లభాషలో "*Jury System*" అని యందురు.

"యథా నయత్యసృక్పాతై
ర్మృగస్య మృగయుః పదమ్
నయే త్తథానుమానేన
ధర్మస్య నృపతిః పదమ్.
"సత్య మర్థంచ సంపశ్యే
దాత్మాన మథ సాక్షిణః
దేశం రూపంచ కాలంచ
వ్యవహారవిధౌ స్థితః."

అని మనువు చెప్పియుండుటవలన మృగయుండు పాదజాడలను బట్టియు, రక్తపు జిహ్నములననుసరించియు మృగముండు తావును దెలిసికొనునట్లు లను మానము స్వయంనిరూపణము (*Self proof*) నుచే బృథ్వీపతి న్యాయనిరూపణ మొనర్పవలెననియు, సాక్షిస్వరూపమును, దేశకాలములను గమనించి యోజించి యథార్థనిర్ణయము సేయవలెననియు, దెలిసికోదగును. ఏ న్యాయాధిపతియైన గలహప్రియుండు గాకుండ నుండవలయును. అన్యులవలన నీజడిన ద్రవ్యాదిలంచములను గ్రహియింపగూడదను నియమముకూడ గలదు. ద్రవ్యముమొదలగు లోపము లేకుండ గార్యము పేతు సేయరాదు. ఇట్లు జేయు న్యాయాధిపతి లోకప్రియుండని పరిగణింపబడుచుండెను.

వివిధజాతుల, వివిధవర్ణముల, నియమములను ధర్మములను బాటించి, మన్నించి తీర్పు జెప్పచుండవలెనని మనువు చెప్పియున్నాడు. ఉద్రేకపూరితులు, దురాగ్రహవివశులు, నగు వాదులుగాని ప్రతివాదులుగాని సాక్షులుగాని మనఃపూర్వకముగానైనను బొరపాటుచేనైనను బరుష వాక్యముల నాడిన న్యాయమూర్తియగు ప్రభువు ఓరిమి వహించియుండవలెననియు, ధర్మాతిరక్తముగా దీర్పుల నీగూడదనియు వ్రాయబడియున్నది. న్యాయనిర్ణయమున న్యాయాధిపతులు (*Judges*), సాహాయ్యకులు (*Assessors*), ఇతరోద్యోగులుసైత ముండుచుండిరి. వీరిలో లెక్కలవ్రాయువారును లేఖకులును ముఖ్యులు. ఈ లేఖకులు వ్యాకరణసూత్రముల నకారాదినిఘంటువుల బరిశీలించినవారై ఋజువర్తనము గలిగి వివిధశాస్త్రపరిజ్ఞానము గలిగియుండవలెనని "వ్యవహారమయూఖము"న గాన్పించుచున్నది. లెక్కలు వ్రాయువారు (*Accountants or Auditors*) నైశ్యులై యుండవలెనని కాత్యాయనుడు నొడివినాడు. గణకుడు (*Accountant*) జ్యోతిశ్శాస్త్రమున గూలంకషప్రజ్ఞ గలిగి వేదముల నభ్యసించినవాడయి యుండవలెననియు, లేఖకుడు సత్యవ్రతుండై, దురాశయు దురాగ్రము లేనివాడై, లంచములబట్టక ముత్యములపగిది నక్కరముల వ్రాయు నేర్పుగలవాడై, భాషాభినివేశము గల్గియుండవలెననియు వ్యాసభగవానుడు వచించినట్లు 'వీరమిత్రోదయ' మను గ్రంథమున గలదు. ఈ యుద్యోగులేగాక న్యాయాధిపతులకు లోపకి సాక్షులను వాదప్రతివాదులను బిలచుట కొకడు నియమింపబడవలెనని బృహస్పతి చెప్పినాడు. ఇప్పనికి శూద్రుడే యుండవలెనని వ్యాసమహర్షి యభిప్రాయము.

న్యాయవినిర్ణయము

తగవును విచారించినపిదప బ్రతిజ్ఞాపత్రమును (*plaint*) దత్ప్రత్యుత్తరమును (*Answer*) జూచుటచేతనే చేయునట్టి తీర్పు సాక్షిసాధనముల నవలోకించి చేయు తీర్పువలన రద్దుసేయబడును. మొదటి తీర్పునకు దీరితమనియు, రెండవ తీర్పునకు ననుశిష్టమనియు, పేర్లు. ఈ తీర్పులు పునర్విమర్శాపూర్వకన్యాయము (*Review or Appeal*) వలన మార్పుగానిచో నీ తీర్పులే స్థిరమగును. తీర్పు జేసిన న్యాయాధిపతియొద్దనే పునర్న్యాయ్య మభిలషించుట 'రివ్యూ' అందురు. తీర్పు జేసిన సభకంటె పైసభను బునర్న్యాయ్య మభిలషించిన యెడల నది 'అప్పీలు' ,అని యందురు. గ్రామసభనుండి రాజకృతసంవిత్తువఱకును బునర్న్యాయాధికారము గలదు. కావున గులమునుండి శ్రేణికిని, శ్రేణినుండి పూగమునకును, —నిట్లే రాజకృతసంవిత్తువఱకును బునర్న్యాయ మభిలషింప వచ్చును.

ప్రతివాదికి నాహ్వాన మంపి యెట్లు బిలపించెదరో యట్లె సాక్షినిగూడ బిలువనంపవలయును. అట్టు లాహూతుడయిన సాక్షికగు భోజనమజ్జనాదుల ప్రయాణభృతి యనగా బురుషభృతి (*Batta and Travelling allowance*) నీయవలయును. ఈ పురుషభృతికి బరిమితి దావామొత్తములో నెన్మిదవవంతుకు మించగూడదు. ఈ వ్యయమంతయు నోటువడిన వానివలన జయమందినవాని కిప్పింపబడును. సాక్షులు వచ్చిన వెంటనే వారు పై బద్ధతి ననుసరించి యోగ్యులో అయోగ్యులో నిర్ధారించినపిదప వారిని విచారించవలయును. ఏ సాక్షినైనను విశ్వసింపరాదని యకారణముగ బ్రయత్నించువాడు శిక్షార్హుడగును. అవ్విధముగ సాక్షియొక్క యోగ్యతాయోగ్యతల బరికించిన తరువాత వాని సాక్ష్యమును లిఖించవలయును. సాక్ష్యమును వ్రాసికొనుటకుముందు సాక్షికి బ్రాడ్వివాకుడు.

"సభాన్తః సాక్షిణః ప్రాప్తార్థిప్రత్యర్థిసన్నిధౌ, ప్రాడ్వివాకో నుయుంజీత విధినానేన సాన్త్వయన్, యద్ద్వయో రనయో ర్వేత్థ కార్యేస్మి స్చేష్టితం మిథః తద్బ్రూత సర్వం సత్యేన యుష్మాకం హ్యత్ర సాక్షితా." అను మనుసూక్తప్రకారము సెప్పవలయును. మనువుయొక్క యభిప్రాయమునుబట్టి పుణ్యలోకావాప్తి యగునని ధర్మోపన్యాసము గావించి సాక్షులచే యథార్థము వలుకుదు నని ప్రమాణము సేయింపవలెననియు, జాతుర్వర్ణ్యముల వారికి నాల్గువిధములగు ప్రమాణము లేర్పడియున్నవనియు, సాక్షి జన్మముచే బ్రాహ్మణుడయి పశుపాలకుడుగాని, వర్తకుడుగాని, సంగీతమే వృత్తిగా గలవాడుగాని, సేవకుడుగాని, యయ్యెనేని నట్టిడు ప్రమాణ విషయమున శూద్రుడుగా బరిగణింపబడవలెననియు, దెలియుచున్నది.

సాక్ష్యమును వృథా కాలహరణముగాకుండ నుభయవాదులయెదుట దీసికొనవలయును. ఈ సాక్ష్యమును సభామధ్యమునగాని, స్థిరాస్థివ్యవహారములందు ఆ యాస్థి సరిహద్దులలో పలగాని, వివాదవిషయకమగు వస్తుసమీపమునంగాని, ప్రాణాపహరణవివాదల (ఖూనీ కేసుల)లో శవమురొక్క శరీరమంతయు నగపడనిచో దదవయవములలో నెద్దానిసమక్షమునసైనంగాని, – సాక్ష్యమును గైకొనవలయును. సాక్ష్యము భావప్రపూరితముగ, ధారాళముగ, జెప్పదానిని జెప్పినట్లుగనే వ్రాసికొనవలయును. ఒక విషయమునే పదింబదిగ బ్రశ్నించియొత్తరాదు. సాక్ష్యములో ముఖ్యములగు దేశకాలములగుఱించికాని, మానవప్రమాణ – వయసు – వర్ణముల గుఱించికాని, ద్రవ్యముయొక్క మొత్తమునుగూర్చికాని, – పొరపాటులున్నయెడల, ఆ సాక్ష్యమును గైకొనుటలో శంకించవలయును. సామాన్యముగ వాదిప్రతివాదుల సాక్షు లెక్కువమందియైనయెడల వారి సాక్ష్యము నొప్పికోవలయును. ఉభయవాదుల సాక్షులు సమమైనయెడల నందెవ్వరి సాక్ష్యము విశ్వసనీయమో వారి సాక్ష్యముల గైకొనవలయును. కాని సంఖ్య యధికమైనంతమాత్రన వారి సాక్ష్య మంగీకరింపరాదు. విశ్వసనీయుండగు సాక్షి యొకరుండయ్యును వాని సాక్ష్యమునే యొప్పికొనవలయును. ఆహూతులైన సాక్షు లయోగ్యులనిగాని యబద్ధము సెప్పినారనిగాని తెలియుచో నితరసాక్షుల రావింపవచ్చును. ఆహూతుడైన సాక్షి సాక్ష్యమీయనని నలుబదియైదు దినములవఱకు నిరాకరించునెడల దావా మొత్తమంతయువృద్ధి(*Interest*)తో గూడ వాది కిచ్చునట్లును, రాజునకు జుర్మానక్రింద దావామొత్తములో బదియవవంతు నొసంగునట్లును, – ఆ సాక్షిమీద దీర్పు నీబడుమ.

ఏ సాక్షియైన దైవవశమునగాని, రాజాధికారమువలనగాని, సాక్ష్య మొసంగుటకు రావీలులేనిచో వానికి నలుబదియైదుదినముల వ్యవధి (వాయిదా) నీయవచ్చును. ఈబడిన వ్యవధిలోగా నతడు రానియెడల నాతడు దండనార్హుడగును. ఏదేనొకవ్యవహారములో నిజము దెలిసిన వాడయ్యు సాక్ష్య మిచ్చుటకు రాక నిరాకరించువాడు కూటసాక్ష్య (*False evidence*) మిచ్చినవారి పాపమును బొందుటయేగాక శిక్షార్హుండగును. నేర్పబడిన సాక్ష్యముచే నెవని వాదము జయించినను ఆ విషయము దెలిసినచో నట్టి తీర్పు పునర్విమర్శ (*Review or Appeal*) లో రద్దు సేయబడును. సాక్ష్యములలో అసాక్షిప్రత్యయ (*Circumstantial evidence*) మను మఱియొక సాక్ష్య మంగీకరింపబడినది. కాని యీ సాక్ష్యము నంగీకరించుటలో బహుజాగరూకత యుండవలయును. సాధ్యమైనంతవఱకు అసాక్షిప్రత్యయమును బలపఱుచు విషయములు గొన్ని ఋజువై యుండుట మంచిది.

సామాన్యముగ ఫిర్యాది ధన – దోషవివాదల (*Civil and Criminal cases*) ను 'మూజీవాణీ' గానే మనవి చేయబడుచుండెను. ఫిర్యాది వాఙ్మూలమును న్యాయాధిపతి వ్రాసికొనుచుండెడివాడు. యథార్థముగ వివాద సంభవించినదని యతనికి దోచినపుడు ముద్దయికి ధృవపత్రము (*Notice*) నంపుదురు. ప్రత్యేక సందర్భములలో గొందఱు న్యాయస్థానమునకు రాకుండునట్లు నిర్ణయము గలదు. ఫిర్యాదిగాని ముద్దయిగాని తను పక్షమున బనిసేయుటకు బంధువునుగాని, స్నేహితునిగాని, యేర్పాటు సేసికొనవచ్చు నను నిర్ణయము గలదు. కక్షిదారుల పక్షమున బనిచేసినవారికి దావా మొత్తమున 1/15 మొదలు 2/5 వఱకు రుసుము (*Fees*) ఈయవచ్చును.

స్థిర-చరాస్తుల పరిహారములకై వచ్చిన దావాలు దాఖలుసేయగూడ దను నియమము గలదు. ధన-దోషవివాదలకు సంబంధించిన విచారణ వానివానికి సంబంధించిన ప్రదేశములందె జరపబడెడిది. భూమికి సంబంధించిన దావావిచారణ ఆ భూమియందె జరపబడుచుండెను.

ఋణదాత ఋణగ్రస్తునివలన నన సొమ్ము రాబట్టికొనుటకు గొన్ని నియమములలోనయి ప్రయత్నింపవచ్చునని కలదు. ఈ విధాన మిప్పటికిని స్వదేశసంస్థానములలో నడచుచుండుట గలదని చరిత్రకారులు వాకొనుచున్నారు. ఋణగ్రస్తు నొక గదియందుంచి తాళము వేసి, భోజనమజ్జనాదులు లేకయే యొకటి రెండు దినమ్ములవఱకు నుంచుట జరుగుచుండెడిది. ఋణదాత వృద్ధి (*Interest*) గాంక్షింపవచ్చునుగాని సక్రమముగ వృద్ధితో గూడ దన కీవలసిన మొత్తము వసూలుకానియెడల న్యాయస్థానముద్వారమున రాబట్టికొనవచ్చునని నిర్ణయము గలదు. వర్తకముకొఱకు సముద్రయానముకొఱకు, ఋణము గైకొనినప్పుడందులకు దగు నియమములు గలవు. మోసముతో గూడిన యొడంబడికలు, అన్యాయవృత్తులకై చేయబడిన యొడంబడికలు,-చెల్లుటలేదు. యజమాని గ్రామాంతరమునగాని ఖండాంతరమునగాని యున్నయపు డాతని భృత్యు డతని కుటుంబ సంరక్షణమునకయి యొనర్చు ఋణమునకు యజమాని బాధ్యతవహించి తీర్చుకోవలయును. వాగ్దానము సేసి యందులకు బద్ధుడుగాని వర్తకుడు జుర్మానాకు నర్హుడగును. ఏవస్తువైనను విక్రయింపబడినప్పు డా విక్రయము సరియైనదిగాదని నిరూపించుటకు కక్షిదారులు పదిదినములలో బ్రయత్నముల జేసికొనవలయునను నియమము గలదు.

వృద్ధి యేర్పాటులు :

సాంక్రామికవ్యాధులు, కఱవులు, అగ్నిప్రమాదములు, వఱదలు లోనగువాని వలన బంటలు నశించినపుడు వ్యవసాయకుని పని కష్టముగ ననగా దుర్భరముగ నుండెడిది. ఆ సందర్భమున ప్రభుత్వమువా రాతని సంక్లిష్టస్థితిని దొలగించి రక్షించుట ప్రభుత్వధర్మముగ నుండెడిది. కర్షకులకు ఋణముల నిచ్చుటను గుఱించి యొక యితిహాసము జూపుదును. నారదమహర్షి యుధిష్ఠిరచక్రవర్తియొద్దకు వచ్చి "మహారాజా! పెట్టుబడిదారులు తమ పెట్టుబడి ద్రవ్యమున కగు వృద్ధి (*Interest*) లో నాలవవంతుమాత్రము ఋణగ్రస్తులనుండి గైకొను పద్ధతిని ఋణముల నిచ్చుచుండుటను బరిశీలించుచుంటివా ?" యని ప్రశ్నించినట్లు సభాపర్వమున గలదు. కౌటిల్య నర్థశాస్త్రమునందును, ఇతర ధర్మశాస్త్రములందును ఋణముల పై వృద్ధి నాశించి జరుగు పనులెన్నియో కలవు.

యూరపుఖండములో మధ్యయుగములందు అధికవడ్డీ గైకొనుట యవినీతికార్యమని చర్చిఫాదరీలు విమర్శించిరి, ఇక్కాలమున వర్తకమునకుం దగు సౌకర్యములు లేకుండుటచే దద్బంధము లావల సడలింపబడినవి. ప్రొఫెసరు రైస్ డేవిడ్సు చెప్పినట్లు వృద్ధికయి ద్రవ్యము దీసికొనుట వర్తక కేంద్రములలో సర్వసామాన్యముగ నుండెను.

లాభము నాశించి యన్యాయమైన వడ్డీకి ఋణముల నిచ్చువాడు పాపి యని మనుస్మృతి వాకొనుచున్నది. ఇయ్యభిప్రాయము ప్రబలముగ నీ దేశమున నుండెనని మెగస్థనీసు చెప్పుచున్నాడు. కావుననే యతడు "హిందువు అధికవడ్డీకి దను ద్రవ్యము నిచ్చుట, అప్పు దెచ్చికొనుట,-ఎఱుంగుదురు. కంట్రాక్టుల జేయుట,

(18-వ పేజీ చూడుడు)

కథానిక :

కూలీ

రచన : శ్రీ బలివాడ కాంతరావు

పాతికేళ్ళ క్రిందటి విషయం :—

మరుచటి యేడు పింఛను పుచ్చుకోడాని సిద్ధంగా వున్న ఓళ్ళబంట్రోతు అప్పన్నకుకి లేక లేక కొడుకు పుట్టాడు. ఆ సంతోషం యెన్నాళ్ళూ లేదు. పిల్లాడికి నెలరోజులు నిండందే తల్లి చనిపోయింది.

చీకటిరాత్రులు. వాకిట వేసిన శెనందగ్గర తల మొత్తుకుంటుంటే యిరుగుపొరుగువాళ్లు గుమిగూడారు. అప్పుడే ఆ త్రోవన పోతున్న బంగారయ్య 'యీ శేతిరికాడ యేటిగోల' అని క్రర ఆడిస్తూ మీసాలు త్రిప్పుకుంటూ వచ్చాడు. ఉన్న విషయం ఒకడు చెప్పాడు. కాస్త త్రాగి వున్నాడేమో—'ఒరే ఆశిదాని నాగ యేడస్తావేందిరా? యిదంతా బెమ్మరాత. మా అయ్య నాకు ఆకాసం యెక్కించినాడురా...అలాంటోడు సస్తే నాను యేడిసినానా...దానికి కొడుకిని నూసుకొనే అదుస్టం సేకపోనాడు...నేరా...నే...' అప్పన్నమీద చెయ్యి వేసి లాలించాడు.

అప్పన్నగోల తగ్గలేదు. గుడిసెనుంచి 'క్రీ' మన్న రోదనం వినిపిస్తోంది. చిరాకుగా లేచిపోయి గుడిసెలోనికి వెళ్ళాడు బంగారయ్య. కొడికట్టిన దీపపు దీనపు వెలుగులో నులక మంచంమీద నెలరోజులు నిండని గంగయ్య గోల పెట్టున్నాడు. కడుపు అంటుకొనిపోయుంది. జేనెడు పొడవుచుట్ట ముట్టించి గబగబ బయటికి వచ్చి 'సా యేం పని. యెదవ పని...ఆడికి నోరుందిరా సెప్పడానికి...' గంభీరంగా అనకుంటూనే తన యింటివేపు వెళ్ళిపోయాడు.

'తాగినోడి సందవేఁ అది...' పెదిమలు విరుచుకున్నారు కొందరు. కొద్దిసేపట్లో పెళ్లాం చెయ్యి పట్టుకొని గుడిసెలోనికి పోయాడు. బంగారయ్య. చేతిలోని పసిపిల్లని తీసుకుంటూ అన్నాడు 'ఇది సస్తే సచ్చినాది. మనకి పుట్టారునే...ఆడికి నేక నేక పుట్టాడు...యీడి కడుపు మాడిసి పావం టే నిన్నేంసేస్తానో...వరి కెత్తాను.'

ఆ మరుచటి రోజునుంచి 'ఒరే అప్పిగా' 'ఒరే బంగారం' అని ఒకరి నొకరుపిలుచుకొనేవారు. గంగయ్యకు రెండోయేడు నిండందే అప్పన్న పింఛను పుచ్చుకున్నాడు. అప్పుడే యింకో జిల్లాకి బదిలీమీద వెళ్లిపోతున్న సబుజడ్జి రాఘవేంద్రరావుగారు అప్పన్నను పట్టుబట్టి తీసుకపోయారు. నమ్మకమైన సేవకునిమీద పైకి కనుపించని భక్తి చూపించిన మహానుభావుడు యెదురుగా ఆ సేవకుడు కాదనలేకపోయాడు. ప్రపంచంలో చాలామంది కాలంతోపాటు గిరగిర తిరిగి పాతని యెలా మరచిపోతారో అలాగే అప్పన్నకూడా రాను రాను బంగారయ్యని మరిచేపోయాడు.

ఇప్పుడు పాతికేళ్లు దాటాక తిరిగి తిరిగి మళ్లీ ఆ వూర్లో కాలుపెట్టాడు అప్పన్న. తన శరీరం కుష్కించిందకానీ తన కళ్లకి మేడలూ మిద్దెలూ హెచ్చుగా కనిపించాయ్. అక్కడ వీచే గాలి, కాచే యెండ పడే వర్షం యేమార్పు జెందలేదు. అవే మళ్లీ పాతని జ్ఞాపకానికి తెచ్చాయ్-యీ అందంగా వున్న మేడలు కావు. కర్ర వూతతో ఆ వీధిలోనికి వెళ్లాడు. తిరిగి వచ్చాడు. పని కుర్రవాడి సహాయంతో మరుచటిరోజు వెళ్ళాడు. బంగారయ్య బ్రతికే వున్నాడు—ఆ గుడిసె అలాగనే వుంది—మనిషి కొస్త బింకంగా వున్నా విచారంగా వున్నాడు. 'కడుపికి సాలక రేతిరీ పగులు కష్టపడ్డాదిరా...జబ్బుతో సచ్చినాది...మీసాలుండి దానికి అన్నాయం సేసినానురా అప్పిగా. నాను కసాయోడ్నిరా. 'అని గోలపెట్టాడు.' సేతకానోలు, కోపం వున్నోలంతా కసాయోలురా? దానికి కాలంవచ్చి అది యెలిపోనాది. వూరుకోరా అని దార్చాడు అప్పన్న.

౨

అప్పన్న ఆ వూరు వచ్చి రెండు నెలలు కావచ్చింది. రోజూ సాయంత్రం బంగారయ్య యింటికి వెళ్లటం మానలేదు. గుడిసెకు యెదురుగా వున్న కొనుచెట్టుదగర యిద్దరూ కూర్చొని మాట్లాడుకొంటుంటే హాయిని పొందేది అప్పన్నే. ఆ వేళ కొడుకు సాయంత్రంవరకు యింట్లో వుంచబట్టి ఆలస్యంగా బంగారయ్య యింటికి వెళ్లాడు. ఎవరి మనసులోయైతే యీ పాతికేళ్లలో మార్పు లేదనుకున్నాడో వాడే కళ్లు నులుపుకుంటుంటే అప్పన్న స్తబ్ధుడయ్యాడు.

'ఏంరా బంగారం అలాగ ?'

'కూతురు నేసురా...సిన్నప్పుడు ఏడిసేడిసే సచ్చినాదా...మరి దేవుడిచ్చు నేసురా...కూతురుంతే...' కళ్లు ఒత్తుకుంటూ అన్నాడు బంగారయ్య.

'నీ కేం నోటురా...కోడలు పక్కగా...'

'రావఁ రావఁ ఆలని అనలేంరా...ఆలు యిటూ అనలేరు...అటు అనలేరు...ఆడు యిలాంటి సిచ్చలు యేసినందుకు సావేన రాదురా...'

'తప్పురా...సావుని కోరతావా...పాపం!'

'పాపం! ఎవుడేసవాలరా—నా కొడు కేసుస్తాడురా...నా కూతురై తేనో'.

'అప్పన్న గుటకలు మ్రింగుతున్నాడు. కొంత సేపటివరకు యెవరూ మాట్లాడలేదు 'కాల్చరా' అని అప్పన్న బంగారయ్య చేతికి చుట్ట యిచ్చాడు. ఇద్దరూ అప్పగ బెట్టారు. నిశీథం వాళ్లు విడచిన పొగనే కాదు వాళ్ళ మనసులను కూడ కప్పి వేసినట్లుంది!

చుట్టపీక పారేస్తూ 'అప్పిగా యీ యేళ్ళె ఆకర్రోజు. నాకొడుకు రేపట్నుంచి నిన్నింటికి రానియ్యొద్దన్నాడు.నన్నిల్లు కదలొద్దని సెచ్చేసినాడు. యీ కూలోడింటికి రామాకురా'

'బంగారం నిబ్బగా సెపతన్నావా ?' ముడతలు పడ్డ ముసలిచర్మం మీది వెంట్రుకలు నిటారుగా నిలుచున్నయ్.

'నాను సచ్చినట్టు...'

'నాను కూకలేస్తాను.మనకి సిచ్చేసినోడు ఎంతటోడు...అంతా బగమంతుడి సేతిలో వుంతే'

'అప్పిగా' అని ఆగాడు బంగారయ్య. ముఖం ప్రక్కకు త్రిప్పి కాగు చెట్టు వేపు చూస్తూ 'పెపంచకంసంగతి నీకు తెలీదురా. ఆగవుర్నమెంటోలు నీకు నౌకిరీ ఏం నూసి యిచ్చినారో...ఏడమంతే ఏడస్తావు...అంతే' అని వూరుకున్నాడు.

ఆత్రుతతో యింకేం చెప్తాడో అని అప్పన్న చూస్తున్నాడు. నిమ్మళంగా మళ్ళీ చెప్పక పోతున్నాడు బంగారయ్య—' నివ్విప్పుడు నాకు అప్పిగాడివిగానీ పెపంచకానికి అప్పిగాడివిరా? నివ్వు అప్పుడు అద్దికుండిని గుడిసి యిప్పుడు మేడయినాదా? ఆ తిలంలోను నీ కొడుకుగోల యీ వూరోలెవరయినా యిన్నారా? యిప్పుడో—నీకొడుకు పోలీసోల మీదికి యినసపెక్టేరు. ఆ గంగడంటే యీ వూరోలే కాదు తాలూకా అంతా గజగజ లాడతావుంటే...గంగడు గొప్పోడవబట్టి వూరోలకి అనుకోడానికి మనమే దొరికినాంరా. యీ కూలోడు నిన్ను 'ఒరే అప్పిగా' అని పిలస్తంటే ఆడికి సిన్నతనం కాదరా...'

అప్పన్న నోరు ఆవులించాడు.

'అప్పిగా—నీ కొడుకు నీకంతో నాకొడుకు నాకంతేరా...నిజంసెపతన్నాను...నీకొడుక్కి జడిసి యిదంతా సేసినాడురా...!

అప్పన్న యీ మాటలతో చలించిపోయి మెల్లిగా లేచాడు. కర్ర వూతచేసుకొని నిలపడి 'యీలందరికీ ఆలగొడబలొదిలేసి మన గొడ వెందుకో. నోకంనోటిలో శనుందిరా'

'అప్పనా నివు గొప్పోడివిరా యిప్పుడు. గొప్పగా వుండటం నేర్సుకోవాల. ఒంటిలో బాగు నేకపోయినా యెందు కొస్తావు...పాతికేళ్లు మరిసిపోయినోడివి యిప్పుడు మరిసిపోనేవా? సానా రాత్రయినాది...యెలిపోరా—సుకంగా వుండు'

అప్పన్న ప్రక్కకు తిరిగాడు. 'సుకం సుకం' అంటూ వెకిలించాడు. రెండడుగులు ముందుకు వేసి 'సుకం. నా కొడుకుదగ్గర నాకు సుకం. యింటిలో కుక్కకంటే అద్దానంరా దాన్ని ముద్దుగా పిలిసి ప్రక్కన పడుకోబెట్టుకుంటాడు. ఆడి యేసం, సెలాయింపు, గడింపు అయనీ్న...బంగారం యెలిపోతన్నానురా...' నడుస్తూనే 'రావఁ రావఁ యీ రోగం నన్ను యేగంగా తినేనా పోదు' మూలుక్కుంటూనే ముందుకు సాగిపోయాడు.

3

అప్పన్న యింట్లో కాలుపెట్టేసరికి సబిన్స్పెక్టరు గంగయ్య వురఫ్ గంగాధర్రావ్ వుగ్రరూపంలో తాండవిస్తున్నాడు. ఏమన్నా జబాబీయలేదు. చివరకు

'ఓళ్ళబంట్రోతై యెప్పుడో హీనంగా బ్రతికావని యిప్పుడూ హీనంగా బ్రతకాలా? ఆ వెధవ 'ఒరే అప్పిగా' అంటే సంతోషంగా నవ్వుతావ్' కొడుకన్న యీ మాటలకు జబాబీయకుండా వుండలేకపోయాడు.

'యీ యేళనించి మమ్మల్ని నవ్వనిచ్చావా? ఆడూ యేడ్సినాడు...నాయేడుపుకేం నే...!

హఠాత్తుగా మన్యను వెక్కిరింపుతో అడ్డొచ్చి 'యీయేళా ఆయేళా ఆడూ యీడూ—తిని ఒక మూల పడుకోక' హుంకరించాడు కొడుకు. ఆ గదంతా గిర్రున తిరుగుతున్నట్లు భ్రమపడ్డ అప్పన్న అలా కూర్చుండిపోయాడు.

గంగాధర్రావ్ పెళ్లాంవేపు చూసి చేతిని ఆడిస్తూ'యింకెందుకు ఆలస్యం! తిండి మానడు లే. కడుపు నిండంది నీతు లెలా చెప్తాడు—బ్రతికే వాళ్లలా గడిస్తే చచ్చేవాళ్ళ కెందుకో' చిరాకు యీర్ష్యను వ్యక్తపరచే విసంగా వెళ్ళిపోయాడు వాకిటనున్న వాలుకుర్చీమీదకు.

కోడలు భోజనానికి పిలిచింది. అన్నం తింటున్నాడేగాని కళ్ళలో నీరు పొంగుతుంటే ఆ రాత్రి యేడవటానికి చాలదని కామోసు ముద్ద ముద్దకు నీరు త్రాగుతున్నాడు!

ఆ రాత్రి జడ్జీగారు జ్ఞాపకం వచ్చారు. కొడుకునకు తనలాగే ఒక బంట్రోతుపని యిప్పించమంటే అలా పనికిరాదని చదివించారు. తన కొడుకు పెద్దవుద్యోగం చేస్తే జడ్జిగారి తండ్రిలా తను సుఖించవచ్చునని చెప్పారు. 'నిజవేఁ బాబో సదువులు మనిషిని సెరుపుతాయా? సెరపవు' అని ధీమాగా ఆనాడు తను అన్న మాటలు పచ్చి అబద్ధంగా తోచాయ్. ఇద్దరూ ఒక చన్నపాలు త్రాగినా తన కొడుకుకంటే బంగారయ్య కొడుకు చాలా నయం. ఇంత భరించలేని మాటలు అనడు.

యీ యేడుపు ఆ రాత్రిమొదలుకొని అలా తనలో మూలుగుతోనే వుంది. ఇల్లు కదలలేదు. కొడుకన్నట్లు ఒక మూల మంచంమీద పడుకుంటున్నాడుగాని తినలేకపోతున్నాడు. తను బంట్రోతుపని చేసుకున్న రోజుల్లో త్రాగిన గంజీ, జడ్జీగారికింద సేవకుడనిపించుకొని తిన్న తిండీ జ్ఞాపకానికి వచ్చి కోడలు యెదురుగా పెట్టిన అన్నం విషం అనిపిస్తోంది!

ఇప్పుడు మనిషి మనిషనుకొని గడించాలరా అని కొడుకునకు నీతులు చెప్పే పరిస్థితిలో లేడు. మనుమరాలి క్రొత్తమాటలతో పొంగిపోలేదు. కోడలి ఆదరణలో సౌఖ్యం లేదు. అశాంతిలో భ్రాంతి, అలసటలో ఆవేశం. కన్నీటితో సంతృప్తి లేదు. మంచంపట్టిన అప్పన్న, కొడుకు కనిపించగానే గుండెపట్టుకొని 'పోలీసు......పోలీసుపేచీయే యేసినాడు...! అనుకొనే వాడు.

౪

క్లబ్బునుంచి వచ్చిన గంగాధర్రావు దుస్తులు మార్చుకుంటుంటే భార్య వీధితలుపుల అనుకొని వీధిలోనికి చూస్తోంది. ప్రక్కగదిలో నించి మూలుగు స్పష్టంగా వినిపిస్తోంది.

'రాములూ' అని కేక వేసాడు సబిన్స్పెక్టరు.

'కాస్త పనిమీద పంపించాను. వస్తాడు డాక్టరుగారు వచ్చి వెళ్లారు. మీ రొకసారి...' భార్య సమాధానం చెప్తుంటే రాములు గబగ వస్తూనే అన్నాడు. 'అమ్మా అమ్మా! 'యినప పెట్టెగాని తే నాకెచ్చురా...ఆడితో రానన్నానని సెప్పురా'...గసురుతూనే సెప్పాడమ్మా. ఆడి తలతిరుగుడు...బాబుగార్ని సీపురుపుల్లలా సూసాడు'


'ఎవఱ్ఱా వాడు' హుంకరించాడు సబిన్స్పెక్టరు. రాములు గతుకుమని 'ఆ ముసలి కూలోడు బాబూ. పెద్దబాబుగారు యిల్లేనోరు'

ముక్కుమీద కోపం ముంచుకొచ్చింది. చేతిలో లాటీ పట్టుకొని గుమ్మందగ్గరకు నడచాడు.

'వాడికోసం పలవరిస్తుంటే పంపించాను. మీ రెలాగైనా తీసుకొస్తే బాగుంటుంది.' భార్య అన్నమాటలు సరిగ్గా వినిపించుకోనట్లే వెళ్ళిపోయాడు.

వాకిట చుట్ట కాలుస్తూ బంగారయ్య కూర్చొనివున్నాడు. ముగ్గురుపోలీసులసహా

(21-వ పేజీ చూడుడు)




‘లీజియన్ ఆఫ్ మెరిట్’ బహూకరించే ముందు ఇండియాలోని రాయబారి లాయ్ హెండర్సన్
అమెరికా సభాపతి పంపిన సందేశం చదువుతున్నారు.

అమెరికా ‘లీజియన్-ఆఫ్’ ఆ
గౌరవపతకాన్ని
జనరల్ కరియప్పక
బహూకరించినప్పటి దృ



‘లీజియన్ ఆఫ్ మెరిట్’ను కరియప్పకు అలంకరి



ద్వితీయ ప్రపంచంలో స్వతంత్ర ఫ్రెంచివిమానానికి చేసినసేవకు మెచ్చికోలుగా, భారత విమానదళ సర్వాధిపతి సర్ థామస్ ఎయ్‌హెర్స్ట్‌కు భారతదేశంలోని ఫ్రెంచి రాయబారి మష్యూర్ డేనియల్ లివీ కమాండర్ ఆఫ్ ది లీజియన్ గౌరవపతకం ఇస్తున్న దృశ్యం.





నిజాం నవాబుపై బాంబు విసిరిన నారాయణరావు, గ
నప్పుడు ప్రజలు వారిని ఊరేగించిన దృ



సంగమేశ్వరం ప్రాజెక్టు: కృష్ణా తుంగభద్రానదులు ఈ చిత్రంలో కనపడుతున్న రెండు కొండలనూ కలుపుతూ దాదాపు 100 అడుగుల ఎత్తూ, 4500

లు







భారత సర్వసేనాని జనరల్ కరియప్పకు అమెరికా సభాపతి ట్రూమన్ తరఫున రాయబారి హెండెర్సన్ మొన్న ఢిల్లీలో 'లీజియన్ ఆఫ్ మెరిట్'
పతకాన్ని బహూకరించిన సభకు గవర్నర్ జనరల్ అంగరక్షకదళం విన్యాసం జరుపుతున్న దృశ్యం

న్నారు.






ఆగష్టు 15 వ తేదీని వరంగల్లులో కీ॥ శే॥ పుల్లెల శ్యాంబాబుగారి శిలావిగ్రహ
ఆవిష్కరణమును శ్రీ ఆచార్య రంగాగారు, గావించినప్పటి చిత్రము.




స్వాతంత్ర్య దినోత్సవం నాడు వరంగల్లు యువజన కాంగ్రెస్ కార్యాలయం పై పతాకోత్సవ దృశ్యం

వరంగల్లు వచ్చి

వార్తా విశేషాలు



ఐదుగుల పొడుగూ గల ఆనకట్టను నిర్మిస్తున్న దృశ్యం.



శ్రీకాకుళంజిల్లాలో సింహాద్రి అప్పల నరసింహస్వామి ఆలయద్వారం వెనుక గర్భగుడి శిఖరము,
ధ్వజస్తంభము, ఆవెనుక సంపెంగతోటలు కనబడుచున్నవి.



"తప్పెవరిది?"

మూలం : మపాసా

అనువాదం : "శ్రీ నేమాని వీరభద్రరావు"

ఆ ప్రదేశంలో వున్న రెండు పూరి గుడిసెలు, ఒకదాని ప్రక్క నొకటి చాలా ఏళ్లనుంచి వున్నాయి. ఎన్నో గాలివానలు పెద్ద పెద్ద భవనాలనైనా కూపుమాపాయిగాని, యీ రెండు గుడిసెలుమాత్రం చెక్కు చెదరలేదు వాటి ధాటీకి. ఆ రెండింటిలోనూ ఉన్న కుటుంబాలు కూడా, అటువంటి స్నేహభావాన్ని, సహకారాన్ని కలిగి వుంటున్నాయి.

ఒక్కొక్క కుటుంబంలో నలుగురున్నారు. వారు ఒకరి ప్రక్కన మరొకరు నివసించడమే గాకుండా, పని కూడా ఒకే పొలంలో చేస్తూ, ఒకరే పదార్థం తినడానికి ఏర్పరచుకుంటే రెండోవారు అదే సమకూర్చుకొనేవారు. కుటుంబయజమానురాళ్లు కూడా స్త్రీలకు సాధారణంగా వుండే అసహనం మరిచిపోయి, ఎక్కువ ఐకమత్యం, సోదరీప్రేమ కలిగి మెలుగుతూ వుండేవారు. అంత సుముఖంగా కాలం గడుపుతూవున్న ఆ సంసారాల మధ్య ఏ అమాంతరాలు వచ్చిపడతాయని, ఎవరుమాత్రం వూహించగలరు ?

ఆ రెండు కుటుంబాలవారూ కష్టపడి పనిచేయవలసిన బీదవారే. చాలమందికి జీవితం బరువై పోతూ వుంటుంది. దానికి తోడు అసంతృప్తి కూడా వుందంటే జీవితం బరువేగాక ప్రత్యక్షనరకమై వూరుకుంటుంది. కాని యీ రెండు కుటుంబాలలోనూ, అసంతృప్తికి తావే లేదు. దొరికినది చాలదనిగాని, లేనిది కావాలనిగాని ఎప్పుడూ వారని ఎరుగరు.

ఒక కుటుంబయజమానియైన జాలయ్య, తన యింటికి కావలసిన బుట్టలు అల్లుతున్నాడు. పిల్లలు ఇంట్లోనుంచి బయటికి పరుగుపరుగున వచ్చి యింటిముందున్న యిసకలో పడి ఆడుతున్నారు. రోడ్డు వెంట ఒక గుఱ్ఱపుబగ్గీ పోతూంది. బగ్గీలోపల ఒక జమీందారు, జమీందారిణీ వున్నారు.

జమీందారిణి జాలయ్యపిల్లల్ని చూడగానే "చూడండీ, ఆపిల్లలకేసి .....ఏం వాళ్లు ముద్దుగా లేరూ!...... అలాంటివాడు ఒక్కడు మన కుండకూడదూ" అని నిట్టూర్చింది. జమీందారుముఖంమీద వెంటనే విషాదరేఖలు గోచరించాయి. యిటువంటి సంఘటనలు యింకా ఎన్ని దాటాలో అనుకున్నాడు.

జాలయ్యభార్య ఎందుకో వీధిగుమ్మంలోకి రావటం తటస్థించింది. ఈ సంఘటన ఆమె కూడా చూసి 'భాగ్యవంతులకు దేనికీ లోటు లేదుగాని, వారి భాగ్యాన్నంతను సులభంగా పొందలేని ఒకదాన్ని లభింపజేసుకోడానికి, వ్యయపర్చడానికి సిద్ధపడుతారు ఒక్కొక్కప్పుడు" అని గొణుక్కుంటూ లోపలికి పోయింది.

మరుసటివారం జమీందారిణి తిరిగి వచ్చింది. ఈసారి పిల్లలికి తినడానికి మిఠాయి పట్టుకువచ్చింది. వారితో సంభాషించింది. రెండవవారం ఆమె పిల్లలికి రూపాయిలు కూడా యిచ్చింది. మూడవ వారం ఆమె వీధిలో వున్న పిల్లలతో మాట్లాడకుండానే జాలయ్యయింట్లోకి సరాసరి వెళ్లిపోయింది. ఆ రైతుభార్య పొయిలోకి స్వయంగా కర్రలు కొడుతూంది. రైతు తన పనిముట్లను శుభ్రపరుస్తున్నాడు. పిల్లి బంగాళాదుంపలు తరుగుతూంది. ఆ రైతుకుటుంబం ఆమెను చూడగానే ఆశ్చర్యపోయింది. జాలయ్య కంగారుగా ఒక చెయ్యి లేని కుర్చీలోని బూడిద దులుపుతూ, ఆమెను ఆహ్వానించేడు. ఆమెకు ఒక గ్లాసుతో మజ్జిగ బల్లమీద పెట్టి శ్రద్ధతో ఆమె ఏమంటుందో అని ఆతృతతో చూస్తున్నాడు.

మొదట జమీందారిణి సందేహించింది. తరువాత గొంతు సవరించుకుంది. యింతలో జమీందారు విసుక్కుంటున్నాడు. కడకు ఆమె, విషయానికి వచ్చి "నేను మీ చిన్న బిడ్డను ప్రేమిస్తున్నాను. నాకు పిల్లలు లేరు. ఆ కారణంచేత నాకు చాలా అశాంతిగా వుంది. మీ బాలుణ్ణి పెంచుకోవాలని వుంది. మీరు దానికి అవకాశం కలగనియ్యాలి" అంది.

రైతుదంపతుల నోటివెంట మాట రాలేదు. ఆశ్చర్యానికి మేర లేదు! జమీందారిణి తిరిగి చెప్పింది. రైతు తన పనిముట్లను క్రింద పెట్టి తన ఏవగింపును తెలియజేయడానికేమో అన్నట్లు కాండ్రించి వుమ్మేశాడు.

"మేము ఎప్పుడూ ఆ పని చెయ్యము." అన్నాడు జాలయ్య. అతని భార్యకు కోపంచేత కళ్ళెర్రబడిపోయేయి.

"గొడ్రాళ్లకు తప్ప దుగాని బిడ్డలుండి మా కేం కర్మం? యికముందు ఆ విధంగా అడక్కండి, అమ్మా." అంది, జాలయ్య భార్య. జమీందారు ఈ విషయంలో కలగజేసుకోక తప్పింది గాదు.

"అది విషయాన్ని మీకు అర్థం అయేటట్లు చెప్పలేక పోయింది. మీ అబ్బాయిని మీ అనుమతిపైనే పెంచుకుంటామనిగాని, మీ దగ్గర నుండి శాశ్వతంగా మీ సంబంధం వదల్చి తీసుకుపోతామని మా వుద్దేశం గాదు. మీ బాలుడికి చక్కగా చదువు చెప్పించి అతనికి మైనారిటీ తీరిన వెంటనే మీకు వప్పగిస్తాము. అప్పటికీ మాకు సంతానం కలుగదూ మా ఆస్తికంతకూ హక్కుదారు డవుతాడు. మాకు యీ లోపున సంతానమే కలిగిందీ, వారితో సమానమైన భాగం పొందుతాడు. అంతకూ మాతో వుండడానికి అతనికి యిష్టం వుండదూ అతనికి ఒక పెద్ద మొత్తం యిచ్చి అతనిచే వ్యాపారం, తగిన సలహా యిచ్చి చేయిస్తాము. ఆపైన మీఅభిప్రాయం చెప్పండి." అన్నాడు జాలయ్య భార్య పెద్ద కంఠంతో రెండే ముక్కలు చెప్పింది. "మీ రనేది చాలా విడ్డూరమైన. విషయం. మా బాలుణ్ణి మేము ఎంతమాత్రం అమ్ముకోము" అనగానే జమీందారిణి జాలిగా చూస్తూ, జీవితంలో ఎన్నడూ తిరస్కారసహనం లేదుగనుక దాన్ని బలవంతంగా అణచుకొని, "ఏవండీ, వాళ్లు యివ్వరేమో నండీ" అంది భర్తతో. ఆమె కళ్ల వెంబడి నీళ్లు జల జలా రాలాయి.

ఆమెను చూచి జాలయ్యరాతి గుండె కూడా చెమర్చింది. కాని జాలయ్యభార్యకు మాత్రం అణుమాత్రమైనా జాలి కలగలేదు. భాగ్యవంతులికి ఏదో లోపం దేవుడు కల్పిస్తా డని సూత్రీకరించింది. బీదవాళ్ల బిడ్డల్ని కూడా తీసుకొని వారిని మరింత దుఃఖభాజనులనుగా చేద్దామన్న గొప్పవాళ్ల వుద్దేశాలు కడు నింద్య మంది.

"కాని, మీ బిడ్డ భావిజీవితం చాలా బాగుంటుంది. దానికి తగ్గ అవకాశాలు మేము మా శక్తి నుపయోగించి కల్పిస్తాం. మీకు ప్రతిమాసం రు 100లు ఖర్చుక్రింద యివ్వగలం. ముందుగా యిప్పుడు......" అన్నాడు జమీందారు.

వెంటనే జాలయ్య పిడికిలితో బల్ల గుద్ది "అలా ఎన్నటికీ జరగదు. మా బిడ్డను మేము అమ్ముకోము" అని గట్టిగా అన్నాడు.

జమీందారిణి భర్తపాదాలమీద పడింది.

"ఏవండీ, మీరు ఎన్నడూ నే కోరిన వస్తువు లేదనలేదు. ఆ చిన్ని బిడ్డణ్ణి వారు నాకు యిచ్చేటట్లు ఎలాగైన చెయ్యండి" అని ఏడ్చింది. ఈఏడ్పులతో జాలయ్య భార్యకు మరింత కోపం ఎక్కువైంది.


"ఎంత అన్యాయంగా వుంది కాలం. వాళ్ల సుఖంకోసం ఆనందంకోసం మా బిడ్డణ్ణి వాళ్లకి యివ్వాలట. బజార్లో ఏ వస్తువైనా ధనం వున్నంతమాత్రంచేత కొనగలిగినట్లు బిడ్డల్ని కూడా కొనగల మనుకుంటున్నారు యీ ధనవంతులు."

"ఏవమ్మోయ్, మీరు అనే మాటలు, మా బీదతనాన్ని అవకాశంగా చేసుకొని నీ యిష్టం వచ్చినట్లు వదరుతూన్నట్లు తోస్తూంది. నీ భర్తహానం చూస్తే, నన్ను అర్థంచేసుకొన్నట్లుగా తోస్తూంది. నా గుడిశలో యిక ఎంతమాత్రం వుండకూడదు మీరు...... ...."

మనం విఫలుల మయ్యాం పదండి పోదాం అంది జమీందారిణి భర్తతో.

"సరే, యిక వెళ్లవచ్చును. తిరిగి ఎప్పుడును కనపడవద్దని నా ప్రార్థన.

నమోనాలతో ప్రకృతివిజ్ఞానవ్యాప్తి



జంఘీమృగాల నమూనాల తయారు

మనుష్యులను అమ్ముకొనేటట్లు చేసే యీ పనులు నిజంగా మానవులు చేసేవి కావని నాకు తోస్తూంది" అన్నాడు జాలయ్య.

వారు బయటికి వస్తూంటే ఒక చిన్న బాలుడు అప్పుడే అన్నం తిని బయటికి వచ్చేడు. నల్లగా వున్నాడు. కాని కళ్లు మిలునరేకుల్లా వున్నాయి. వింతకాంతిని వెలిగ్రక్కుతున్నాయి.

"అత నెవరు" అంది జమీందారిణి.

"మా పొరుగువారబ్బాయి. జయంతు డని పిలుస్తారు. మీకు యిష్టముంటే వారినికూడా అడగవచ్చును కాని అక్కడకూడా మీ ప్రయత్నాలు ఫలిస్తా యని నాకు నమ్మకం లేదు. ఎందుకంటే యీప్రాంతంలో అంత నీచానికి పాల్పడే వా రెవరూ లేరు. అన్నాడు జాలయ్య.

జయంతుని విషయంలోమాత్రం జమీందారిణి ఎక్కువ ఆతృత చూపలేదు. అనుభవం వారికి ప్రవర్తన నేర్పింది. జయంతుని భావిజీవితం బాగు పడుతుందనిమాత్రం చెప్పేరు. ఈ అవకాశం పోగొట్టుకుంటే వారికి జీవితంలో యిక యింత భాగ్యంపట్టే సూచనలు వుండవని చెప్పేరు. జయంతునికి సరియైన చదువు లేకపోతే అతనిలో యిమిడి యున్న శక్తులన్నీ వికసించడానికి అవకాశం వుండదని జయంతుని తల్లిని హెచ్చరించింది జమీందారిణి.

గిన్నెలు తుడుస్తూన్న గుడ్డ క్రింద పెట్టి "ఏమంటారు" అంది జయంతుని తల్లి, భర్త వియ్యన్నతో.

వియ్యన్నకూడా స్నేహితుడుజాలయ్యలాగే కాండ్రించి వుమ్మి "సిగ్గు లేదా నీకు,అడగటానికి? ఆ పని ఎన్నటికీ చెయ్యను" అన్నాడు.

"వందరూపాయిలు నెలనెలకు యిస్తాం. వందరూపాయిలు ముందుగా యిప్పుడే యిస్తాం" అంది హుందాతో జమీందారిణి.

ఎంత సహనం చూపినప్పటికీ, రైతు ముఖంమాత్రం ఎఱ్ఱబడింది. మౌనం దాల్చి చూస్తున్నాడు.

"ఏమంటారు" అంది వియ్యన్న భార్య.

వియ్యన్న నెమ్మదిగా "పన్నెండు వందల రూపాయి [illegible] పెద్దమొత్తం కాదు. పైగా చాలదు" అన్నాడు.

"పదిహేనువందలిస్తాను" అని తొందరగా అంది జమీందారిణి.


వియ్యన్న అర్థాంగీకారంగా "అయ్యా, యీవ్యవహారం ఒక వకీలుని మధ్యవర్తిగా వుంచుకొని జరుపుకుంటే" అన్నాడు.

"ఓ రేపే జరుగుతుంది ఆ పని" అని భర్తకేసి బరువు వదలిన చూపు చూసింది జమీందారిణి.

మరుచటిదినమే అన్నివిధములైన షరతులతోనూ ఒక పత్రం వ్రాసుకొని రిజిష్టరీ చేయించుకున్నారు. కుమారుణ్ణి ఎవరో పరాయివాళ్లు తీసుకుపోతూంటే ఆ తల్లిదండ్రుల మనస్సులు ఎంత వ్యథ చెందాయోగాని వారి ముఖకవళికలలో మాత్రం మార్పు లేదు. జమీందారిణి బాలుణ్ణి స్వయంగా ఎత్తుకొని బగ్గీలో యిద్దరిమధ్య కూర్చుండబెట్టుకుంటూంటే భావరహితమైన దృక్కులను నిగిడిస్తూ ఆ తల్లిదండ్రులు అలాగే నిలబడ్డారు. ఖరీదైన వస్తువు కొని జమీందారిణి యీవిధంగానే బగ్గీలో పెట్టేడిదేమో! జాలయ్య, భార్య వీధిలోకి వచ్చి యీదృశ్యం చూచి మూగవోయారు. బహుశా వియ్యన్నకు తాము నిరాకరించిన ధనం వస్తూందని యీర్ష్యయేమో? జరిగిన సంఘటన వారికి యించుక బాధ కలగజేసింది. యింతకూ వారు కలలోగూడా అనుకోని విషయం జరిగింది. యిక ఆ రెండు కుటుంబాలమధ్యను విరోధం బయలుదేరింది. వియ్యన్నకుటుంబం అంతా ఒక్క బాలుడుమినహా తిరిగి యింట్లో ప్రవేశించింది. వారికి వినపడేటట్లు "ఎంత క్రూరులమ్మా, ఎంత అస్వభావికత్వం తల్లీ, ఎంత కఠినులైనా కుమారుణ్ణి అమ్ముకుంటారా! ఎంత సిగ్గుపడవలసిన విషయం, నిజంగా యీ ప్రదేశానికే అగౌరవం. తల్లిదండ్రులమంటే మేము మా చంద్రుణ్ణి ఎంతమాత్రం అమ్మమన్నాం" అని జాలయ్యభార్య పెద్దగొంతుతో అరిచింది.

జాలయ్య, వియ్యన్నల కుటుంబాల

సమోనాలతో ప్రకృతివిజ్ఞానవ్యాప్తి



పక్షిజాతుల కృత్రిమ వృక్షములను తయారుచేస్తున్న దృశ్యం.

సమోనాలతో ప్రకృతివిజ్ఞానవ్యాప్తి



బీవర్లనే ఉత్తర అమెరికా జంతువులు నీటి సౌకర్యాలను కలిగించుకోవటానికి చిన్న చిన్న సెలయేళ్లకు ఆనకట్టలు కట్టి జలాశయాలను నిర్మించుతూ వుంటై. అలాటి జలాశయం దృశ్యానికి నమూనా తయారుచేస్తున్నారు.

మధ్య విరోధం నానాటికీ ఎక్కువౌతూంది. అంత చేరువలో వుండి అంత విరోధాన్ని సహిస్తూన్న కుటుంబాలు ఆ రెండేకాని మరెక్కడా లేవనిపిస్తూంది. వియ్యన్న కుటుంబం యింకో ప్రదేశానికి పోదామంటే ప్రక్క వారికి చులకనైపోతామేమో అన్న భయం. "యిరుగో, వీరే, క్రూరులు తమ బిడ్డను అమ్ముకున్న అభాగ్యులు. సంఘంలో వారికి తావు లేదు. పిల్లి కన్న రాకుసులు నయం" అంటున్నారు.

వియ్యాన్నకుమాత్రం మధ్యవర్తివకీలుద్వారా నెలకు రావలసినది సక్రమంగా వస్తూంది. వారు తాము చేసిన పనికి ఎంతమాత్రం విచారించలేదు. అథవా విచారించినా పదిమందితో వెళ్లబోసుకోలేదు. వియ్యన్న భార్యకుమాత్రం అప్రయత్నంగా ఏదో బాధ కలుగుతూ వుండేది గాని రోజులు గడిచినకొద్దీ మొండిదేరిపోయింది హృదయం.

జాలయ్యభార్యమాత్రం పదహారణాల తృప్తితో వుంది. ఎందు చేత? తాను కుమారుణ్ణి అమ్మలేదు. యీ విషయం అందరితోనూ ఏకరువు పెడుతూవుండేది. "నిజంగా సంఘంలో అగ్రస్థానం ఎవరిదంటే, నాదే. నాకు లాభం ఎంతో కనిపిస్తున్నా నా కుర్రాణ్ణి అమ్మడానికి నిరాకరించాను. నావిషయంలో ధనంకన్న గౌరవమే బరువనిపించింది." అనేది. చంద్రుడు కూడా సహాధ్యాయులతో తెగచెప్పేవాడు. "మాఅమ్మ నన్ను అమ్మలేదు. ఎప్పుడూ అలా చెయ్యదు. నన్నే గనక అమ్మివుంటే మా నాన్న యీ సరికి పెద్దమేడ కట్టేవాడు. కాని మేం అలా చెయ్యలేదు. మాకు యీ గుడిసే బాగుందని వూరుకున్నాం. తల్లివలెనే చంద్రుడికికూడా గొప్పలు కావాలి. వియ్యన్నకుటుంబాన్ని ఎంతో కిన్నడపర్చేవాడు.

ఏళ్లు గడిచేయి. వియ్యన్నకుటుంబం వృద్ధి అయింది. జాలయ్యకుటుంబం తిసికట్టులోనికి వచ్చింది. చంద్రుడి పెద్దన్న యుద్ధంలోకి పోయాడు. రెండో అన్న చచ్చిపోయాడు. చంద్రుడు గొడ్డులా కష్టపడితేగాని దినం గడవకుండా వుంది. ముసలి తల్లిని, తండ్రిని సంరక్షించే భారం చంద్రుడు వహించవలసివచ్చింది. జాలయ్య చంద్రుణ్ణి అమ్మడంవిషయంలో తాను చేసిన నిశ్చయం మంచిదో కాదో అన్న విమర్శన యిప్పటికి భార్యాభర్తల మధ్యనుగాని యితరులతోగాని రాలేదు. కాని వియ్యన్నకుటుంబంతో మాత్రం యిక స్నేహం పొసగదు. ఎందుచేతంటే వారు అంత హాయిగా చూస్తున్నారు. చంద్రుడు యిరవైఏళ్ల వయస్సుగలవాడై యున్న కాలంలో ఒకరోజున అందమైన గుర్రపుబగ్గీ ఒకటి వచ్చి వియ్యన్నయింటిముందు ఆగింది. యిరవైసంవత్సరాలక్రిందట జమీందారిణి వచ్చిన బగ్గీయేకాని, తోలేవాడు మాత్రం వేరు.

ఒక ముసలామెకు, దిగడానికి సహాయం చేస్తూ, అందమైన దుస్తులు ధరించిన యువకుడు బగ్గీలోనుంచి దిగాడు. ఆమె అతని భుజాలమీద చేతులు వేసి మెల్లిగా నడుస్తూ యింట్లో ప్రవేశించింది. యింట్లో వీరు వచ్చే సరికి వియ్యన్న కర్రలు నరుకుతున్నాడు. భార్య పులుసు కాస్తూంది. జయంతుడు తండ్రికి ప్రేమపూర్వకంగా చేయి నందించేడు.

"ఈ దినం మిమ్మల్నిద్దర్నీ చూడటంచేత సుదినంగా భావిస్తున్నాను." అన్నాడు. వియ్యన్న గొడ్డలి పారేసి, నోరు తెరిచి యువకునివైపు తేరిపార చూస్తున్నాడు. ఆశ్చర్యంతో "జయంతా ...నాతండ్రే" అంటూ వియ్యన్నభార్య మరుగుతూన్న పులుసు వదలివచ్చి కౌగలించుకుంది కుమారుణ్ణి. జమీందారిణి బయటికి నడిచింది. జయంతుణ్ణి ప్రతీయింటికి తీసుకువెళ్లి ఎంతో ఆర్భాటం చేశారు ఆ తల్లిదండ్రులు. అతడు వారి కొడుకంటే ఎవరూ నమ్మకుండా వున్నారు. అతనిలో ఎంత సంస్కృతి. జయంతుడు పైఅంతస్తులో వున్నా పేర్లతో వరుసగా అందర్నీ పలకరించి తన నిరాడంబరత్వాన్ని

చూపుకున్నాడు. "నిజంగా యింత భాగ్యానికి మేము అర్హులము కామమ్మా" అంది వియ్యన్న భార్య.
వియ్యన్నకు సంఘంలోగల గౌరవాన్ని చూసి, ధనం చూసి, జాలయ్యకుటుంబం తిరిగి వారితో సఖ్యం ఏర్పరచుకుందామన్న ప్రయత్నాలు చేస్తూన్నట్లు కనపడుతూంది. కాని ఎన్నడూ ఏపరిస్థితులలోనూ రాజీకి రాని ఒక్కడే ఒక వ్యక్తి వున్నాడు. అతడే చంద్రుడు. వియ్యన్న కుటుంబంలోవారి గర్వం, జయంతుని నడకలో కనబడుతూన్న గొప్ప చంద్రుడికి ఏవగింపయ్యాయి. యిరుగుపొరుగువారు వారికి నమస్కారం చేస్తూన్నప్పుడు తను ముఖం ప్రక్కకు త్రిప్పుకొనేవాడు. గణింపదగిన గొప్పవారిలో వియ్యన్న కుటుంబం ఒకటైపోయింది; ఎవ రేం చెయ్యగలరు?

కుక్కకి కూడా అనుభవింపదగిన మంచి రోజు ఒకటి వుంటుంది. ఆ సమయం యిప్పుడు వియ్యన్న కుటుంబానిది. సాయంకాలం కాగానే ఒకరోజున చంద్రుడు తన కోపాన్ని పట్టలేక పోయాడు.

"మీరు నన్ను అమ్మేవుండవలసింది" అని అరిచేడు తల్లిదండ్రుల ఎదుట.


"నన్ను మీరు అమ్మవలసింది. యీ సరికి నేనుకూడా ఒక పెద్దమనిషినైయుండేవాణ్ణి" అన్నాడు.

మా కర్తవ్యం మేము నెరవేర్చినందుకా యీ నింద మాకు?" అన్నాడు జాలయ్య. "అవును. నా జీవితం అంతా పాడైపోయింది. నా ఆశలన్నీ అడుగంటాయి. మీ వంటి తల్లిదండ్రులు వుండిమాత్రం ఏం లాభం నాకు, మీ కుమారుని బాగు మీకు తెలియదు." అన్నాడు చంద్రుడు. చంద్రునితల్లి వలవల ఏడ్చింది. "నాయనా నిన్ను కని బాధలన్నీపడి పెంచినందుకా ఈ శిక్ష? యీ సంగతి నాకు ముందే తెలిసివుండవలసింది. నిన్ను అమ్మేయవలసింది. వందరూపాయలకు గాదు, కనీసం ఏభై రూపాయిలకైనా అమ్మవలసిందే" అంది.

చంద్రుడు కూర్చున్నదగ్గరనుండి లేచి, "యిదిగో, నే పోతున్నాను. యిక్కడ మీతో నేను వున్నట్లయితే, మీ జీవితం యింకా దుఃఖమయంగా మారుతుంది. అమ్మా, శలవు." అని తలుపు తెరచి బయటపడ్డాడు. వియ్యన్న కుటుంబం మహదానందంలో వుంది. ఆ నవ్వులు వీధిలోనికికూడా వినబడుతున్నాయి. జయంతుడు వచ్చినందుకు ఆనందోత్సవం చేసుకుంటున్నారేమో!

జాలయ్య మానవస్వభావం తరిచినవాడు గాడు. యిప్పుడు స్వయంగా చూసేడు. తల్లిచేసిన స్వార్థత్యాగానికి ఫలితం. కాని ఆమెను ఓదార్చే నేర్పు అతనిలో లేదు. అందుకు అతను అసమర్థుడు.

చంద్రుడుమాత్రం చీకట్లో మాయమయ్యేడు.



తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

30

(అన్నమాచార్యరచన. చరిత్ర పీఠికలో నుదాహృతము పు. ౨౦)

లలితరాగం - రూపకతాళం

[పల్లవి]

(౧) సా మా గా , గ మ మ గ రి స రి ని
నీ వే కా చె ప్పు జా ప

(౨) స రి స స మా మ గా , గ మ ధ మ గ మ గ రి స ని
నీ వే కా చె ప్పు జా ప

(3) స రి స స స మా గ గ మ ధా , నీ ధ ని ధ మ గ రి స ని
నీ వే కా చెప్పు జా ప

(౪) స రి స స గ మ ధ ని సా రి స ని ధ స ని ధ ని ధ మ గ మ స రి స ని
నీ వే కా చె ప్పు జా ప

(౫) స రి స రి స ని ధ ని సా , , , , , ,
నీ వే కా

[అనుపల్లవి]

(౧) సా , స సా ని ని స రి సా
శ్రీ వి భు ప్ర తి ని ధి వి

(౨) స రి నీ ధా ధ ధా ధ మ ధ ని సా
శ్రీ వి భు ప్ర తి ని ధి వి

(3) స ని స రి స ని ధ మ ధా గ గ మ మ ధ ధ ని ని సా । స ని ధ ని ధ మ ధ ధ మ గ రి ని
శ్రీ వి భు ప్ర తి ని ధి వి సే న మొ ద లా రి

(౪) ,, ,, ,, స గ । గా రి గ రీ స ని ధ మ ధ ని సా రి ని ధ మ గ రి స ని (నీవే)
,, ,, ,, వి సే న మొ ద లా రి

[చరణం]

మా గ రి రి స రి స గ గ గ । మ మ గ మ ధ మ గ రి స గ రి స ని రి స
నీ వే కా క కై దు ర ని లు చుం డి హ రి వ ద్ద

ని స గ రి స ని ధ మ ధా నీ సా , ని స రి సా , , , , , ,
దే వ త ల గ ని పిం చే ధీ రు డ వు

సా నీ ధ ధ ధ మ ధ ని ధ ధ । గా మ ధ మ ధ ని ని ని రి సా
ఏ వం క వి చ్చే సి న సు ఇం ది రా ప తి కి ని జ

(౧) నీ స గ గ గ గ రీ , గ మా గ రి స సా । స ని ధ ని ధ మ ధ ధ మ గ రి సి
సే వ కు డ వు నీ వే సే న మొ ద లా రి

,, ,, । గా రి గ రీ స ని ధ మ ధ ని సా రి ని ధ మ గ రి స ని (నీవే)
,, ,, సే న మొ ద లా రి

ఇట్లే క్రింది చరణాలు:—

(౨) పసిడిబద్దలవారు - పదికోట్లు గొలువ
దెసల బంపులు పంపే - ధీరుడవు;
వసముగా ముజ్జగాల - వారినిందఱిని నీ
సిసువులగా నేలిన - సేన మొదలారి. (నీవే)

(3) దొరలైన యసురుల - దుత్తుమురు సేసి జగ
మిరవుగా నేలితి - వేకరాజ్యమై;
పరగు సూత్రవతి - పతివై వెంకటవిభు
సిరుల పెన్నిధి నీవె - సేనమొదలారి! (నీవే)

లఘుటీక: ఇది విష్వక్సేనప్రార్థనము. శ్రీవైష్ణవసంప్రదాయంలో పరతత్త్వమైన లక్ష్మీనారాయణులు ప్రథమాచార్యులు. వారి తరువాతి ఆచార్యపరంపరలో మొదటివాడు విష్వక్సేనదేవత. ఆ పరదంపతుల విశ్వసామ్రాజ్యంలో సేనాపతి యితడు. 'సేనై మొదలియార్' అనే అరవపేరుకు 'సేన మొదలారి' ఆంధ్రీకరణము. ఇతని దేవేరి సూత్రవతి. ఇతరహిందూమతములలో గణపతికివలె శ్రీవైష్ణవులు సర్వకర్మములందు ఇతనికి అగ్రపూజ చేయుదురు. గణపతి ఇతని పరిశ్కృతపారిషదులలో నొక్కడని వారి మతం.
చెప్పజూప=భగవంతునితో భక్తులవిషయమై మనవిచేయుటకును దర్శనము చేయించుటకును; పసిడిబద్దలవారు=బంగారు బెత్తముల వారు. దర్భశబ్దము ద్రబ్బ, దబ్బగాను, వర్ణవ్యత్యయం చేత బ్రద్ద, బద్దగాను మారినది. చీలిక, చేతికఱ్ఱ, దండము ఇత్యాది ఛాయార్థములను సంపాదించుకొన్నది; పంపులు=ఆజ్ఞలు; ఇరవుగా=స్థిరముగా. ఇందిరాపతి అని పాఠ ముండునేమో.

విజ్ఞాన విశేషాలు:

సూక్ష్మక్రిములు - బాక్టీరియా

శ్రీ భైరవభొట్ల రామబ్రహ్మశాస్త్రి

మనవాళ్లలో చాలా ఆచారా లున్నాయి. వాటిలో చాలావరకు మన ఆరోగ్యాభివృద్ధికై పెట్టబడినవే. ఒకళ్లకేదైనా జబ్బు చేస్తే వాళ్లకి ఆ నీళ్లు పడలేదని, గాలిలో మార్పు కలగాలని ఇంకో ఊళ్లో నిద్ర చేయించాలని మనం అంటూ ఉంటాము. అట్లాగే శ్వాసేంద్రియవ్యాధిపీడితులను చెమ్మస్థలాలనుండి వచ్చని స్థలాలకు పంపే ఆచారం కలదు. చెడుగాలుల వల్ల కొన్ని రోగాలు కలుగుతూ ఉంటాయి. అంటే వ్యాధిని కలిగించే సూక్ష్మజీవులు ఈ గాలుల ద్వారా ప్రయాణం చేస్తూ ఉంటాయి. కొందరికి కొన్ని సూక్ష్మజీవులు దేహంలో ప్రవేశించి ఊపిరితిత్తులను తినేస్తూ ఉంటాయి. ఈ వ్యాధిని కలిగించే క్రిములు సాధారణంగా దుమ్ములో నివసిస్తూ ఉంటాయి. ఈ వ్యాధులలో కొన్ని అంటువ్యాధులు గూడా ఉన్నాయి. అందుకని అట్టివారిని చాలదూరంగా ఉంచుతూ ఉండాలి. వాళ్ళు ఉంటూఉండే గదులను స్థలాలను దుమ్ము ధూళి లేకుండా చాల పరిశుభ్రం చేస్తూ ఉండాలి. దీనినే "క్రిమినిర్మూలనము" (*Disinfection*) చేయటం అంటారు. ఈ క్రిములలో రెండు రకా లున్నాయి. ఒకటి లాభకరమైనవి, రెండు వ్యాధికరములైనవి. అందుకని వీటినిగురించి మనం ముఖ్యముగా తెలిసికోవాలి.

"కాన్సరు" మున్నగు వ్యాధులు తప్ప మిగతా వ్యాధులన్నీ అత్యంత సూక్ష్మమైన జీవముల వలన కలుగుతూ ఉంటాయి. ఈసూక్ష్మజీవములనే "సూక్ష్మక్రిము" లందాము. (*Bacteria*) ఈ సూక్ష్మక్రిము లెంత చిన్నవంటే ఒక మామూలు నీటిబిందువులో కొన్ని కోట్లు ఉంటాయి. దీన్ని బట్టి అవి మన కంటికి కన్పించనంతటి చిన్నవని తెలిసికోవచ్చు. అందుకని వీటిని "సూక్ష్మదర్శిని" (*Microcope*) ద్వారా చూస్తారు. వీటిలో "వైరస్" అనబడే సూక్ష్మక్రిములు సూక్ష్మదర్శినివల్ల గూడా కన్పించవు. ఈ సూక్ష్మక్రిములను ఆకార పరిమాణాలనుబట్టి మూడు తెగలుగా విభజించారు. ఈ సూక్ష్మక్రిము లన్నిటికి వ్యాధిని కలిగించే శక్తి లేదు. వ్యాధికరములైన సూక్ష్మక్రిములు చాలా కొద్దిరకాలే ఉన్నాయి. అయితే వీటివల్ల నష్టాలు అపరిమితంగా ఉన్నాయి కాబట్టి వీటిని గురించి మనం ఎక్కువ చెప్పుకోవాలి.

ఈ సూక్ష్మక్రిములు సామాన్యంగా ముక్కుద్వారాను, నోటి ద్వారాను దేహంలోకి ప్రవేశిస్తాయి. మనం పీల్చే గాలిద్వారా గాని, మనం తినే ఆహారంద్వారాగాని ఇవి మన శరీరంలో దూరుతాయి. తఱచుగా మన ముక్కు దగ్గరకు, నోటిదగ్గరకు చేతులద్వారా తీసికొని రాబడుతాయి. అందుకని మన ముఖాన్ని, చేతులను ఎప్పుడు తోముకొని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. తర్వాత మన అవయవ విజృంభితమైన శరీరంలోకి అభేద్యచర్మము ద్వారా ప్రవేశించే సూక్ష్మక్రిములు చాలా తక్కువ. ఒక్కొక్కప్పుడు మన చర్మంలోని సూక్ష్మరంధ్రాల పొరలలో అవి నివసిస్తూ ఉంటాయి. వీటివల్ల వేడన్లు, పడిశెము కలుగుతూ ఉంటాయి. ఇవే కాకుండా ఈ సూక్ష్మక్రిముల వల్ల శీతపైత్య జ్వరము, నెమోనియా, ఇన్ఫ్లుయెంజా మున్నగురోగాలుగూడా వస్తూ ఉంటాయి.

దేహం బలహీనంగా ఉన్నప్పుడుగాని ఈ వ్యాధికరక్రిములు మనకు ప్రమాదాన్ని కలిగించలేవు. వీటిలో కొన్ని మన దేహాన్ని బలహీనం చేసి విషాణువులను తయారు చేసి రోగాల్ని తెచ్చిపెట్టగలవు. క్షయవ్యాధిని కలిగించే సూక్ష్మక్రిములు దేహంలోని జీవకణాలను తినివేస్తూ ఉంటాయి. అందుకనే తఱచుగా క్షయవ్యాధపీడితులకు ఊపిరితిత్తులు కొంతభాగము తినివేయబడి ఉంటాయి.

ఇంత చిన్న క్రిములు అంత పెద్ద మనిషిని రోగంతో పడవేసిన వంటే చాలా ఆశ్చర్యంగానే ఉంటుంది.

దీనికి రెండు కారణా లున్నాయి. 1 సూక్ష్మక్రిములు క్షణాలమీద వందలు, వేలు, లక్షలుగా పెరిగిపోతూఉంటాయి. 2 అవి తయారుచేసే విషాణువులు అత్యంత ప్రమాదకరమై విపరీత విపత్కర పరిస్థితులు తెచ్చి పెట్టుతూ ఉంటాయి.

ఈ సూక్ష్మక్రిములు వృద్ధిపొందటం చాల తమాషాగా ఉంటుంది. ఒక్క సూక్ష్మక్రిమి రెండుభాగా లవుతుంది. అనుకూలపరిస్థితులలో ఒక్కొక్క భాగము ఒక్కొక్క పెద్దక్రిమి అంత అవుతుంది. అట్లాగా ఒక్కొక్కభాగము మళ్ళీ రెండు భాగాలుగా చీలుతుంది. ఆ రెండు నాలుగవుతూ ఉంటాయి. కాని యీ అనుకూలపరిస్థితు లనేవి మనకువలె వాటికిగూడ చాలకాల ముండవు. ఇది కూడ ఒక మంచికే! అనుకూలపరిస్థితులే గనుక చాల కాల మున్నట్లయితే, ప్రపంచమంతా క్రిమిమయమై యుండేదే! ఒక్కొక్కప్పుడు ఈ సూక్ష్మక్రిమి వృద్ధిఆగిపోతుంది. దీనికిరెండు కారణాలున్నాయి. అవి తయారుచేసే విషాణువులు వాటినే చంపి వెయ్యాలి. లేకపోతే వాటికి తగినంత ఆహారము లభ్యము కాకుండానన్నా ఉండాలి. ఒకరోజుకు ఒక సూక్ష్మక్రిమిలోంచి ఎన్ని పుట్టుతాయో లెక్కగట్టుదాము. గంటకొకసారి విభాగమయే జాతి అయితే 1 గంటకు ఒకటి అల్లా రెండు, 2 నాలుగు, 4 ఎనిమిది అట్లా 24 గం. లతర్వాత 16, 777, 216 సూక్ష్మక్రిములు తయా రవుతాయి. అనేక సూక్ష్మక్రిములు ఇంతకన్నా తొందరగా గూడా వృద్ధిచెందుతాయి.

ఇంత త్వరగా సూక్ష్మక్రిములు వృద్ధిచెందుతూంటే, ఇంత ప్రమాదకరమైన విషాణువుల నవి తయారుచేస్తూంటే, మనము ఇంతకాలమెట్లా బ్రతుకగలిగి ఉన్నాము? అనే ప్రశ్న ఉదయిస్తుంది. ప్రకృతిమాత మనయం దనుగ్రహించి రెండువిధాలైన రక్షణలను మనకిచ్చింది. (1) బాహ్యరక్షణలు (2) ఆంతర్యరక్షణలు.

I. బాహ్యరక్షణలు:—(1) మనం శ్వాస పీల్చేటప్పుడు గాలి, గాలిగొట్టముద్వారా ఊపిరితిత్తులలోకి పోవును. ఈ గాలిగొట్టము లో పేరుకొనబడు దుమ్ముఅంతయు ముక్కుద్వారా పోయినదే. కాని యీ ధూళిని గాలిగొట్టములోనికి పోనీయకుండా ముక్కులోని వెంట్రుక లడ్డుపడును.

2. ముక్కు రంధ్రాలను దాటి ఎట్లాగో గాలిగొట్టములోకి చేరిన ధూళి ఊపిరితిత్తులలోకి పోలేక చాల అవస్థలు పడును. గాలిగొట్టములో అల్లికగానుండు చిన్న నాళములు ఈ ధూళిని ఆపివేసి లోపలికి పోకుండ జేయును. సూక్ష్మదర్శినిద్వారా చూచినచో ఈ నాళములు వలతాళ్ళవలె నుండును. ఇవి జీవనాళములు. వీటినే "సీలియా" అంటారు. ఈ సీలియాకు కదలెడు శక్తి గలదు. క్రిందుకు దుముకుటకన్న పైకి అవి చాల త్వరగా ఎగురగలవు. ఈ చలనశక్తివలన గాలిగొట్టములోకి చేరిన దుమ్ము, ధూళి అంతయు తుమ్ములద్వారా దగ్గుల ద్వారా గాని, బయటకు పోగలదు. ఈ సీలియాకు ఈ శక్తి లేకపోతే ఊపిరితిత్తులు ధూళితోనుండి మనకు శ్వాసపీల్చుట కష్టమై యుండెడిదే!

3. నోరుగూడ ఈ సూక్ష్మక్రిములను లోనికి పోనీయకుండ ఆటంకపఱుచును. ఇందు మన నోటిలోని లాలాజలము మన కెంతో ఉపయోగముగా నున్నది. లాలాజలము సూక్ష్మక్రిములను చంపలేదు. కాని సూక్ష్మక్రిములు పెరిగేందుకు కావలసిన పరిస్థితులు లేకుండా చేస్తుంది. అందుకని ఉమ్మిని విసర్జించరాదు. లాలాజలము సూక్ష్మక్రిములను బలహీనముగా చేయును.

4. ముక్కులోను, నోటిలోను, ఊపిరితిత్తులను కలుపు ప్రతి గొట్టములోను ఒక పొర యుండును. ఈ పొర సూక్ష్మక్రిములను సంహరించుటలో మన కుపయోగపడుచున్నది. ఆరోగ్యస్థితిలో మానవు డున్నప్పుడు ఈ పొరలో సూక్ష్మక్రిములు పెరుగలేవు. కాని బలహీనముగా నున్నప్పుడు ఈ పొర సూక్ష్మక్రిములకు కేళీమందిర మగును. అప్పుడే పడిశెము, నెమోనియా, క్షయ మున్నగు వ్యాధులు కలుగును.

ఆంతర్య రక్షణలు:

ఆంతర్యరక్షణలు: ఆంతర్య రక్షణలద్వారా గూడా మనము సూక్ష్మక్రిముల దండయాత్రల నుండి రక్షింపబడుచున్నాము. బాహ్యరక్షణలను ధిక్కరించి ఈ సూక్ష్మక్రిములు మనదేహంలో నివసించుచున్నను అవి తఱచు చంపబడుతూంటాయి. మనదేహంలో రెండురకాల ఆంతర్య రక్షణసాధనా లున్నాయి. అవి అనేక విధాల సూక్ష్మక్రిములను నాశనంచేస్తూ ఉంటాయి. (1) తెల్లకణాలనబడు జీవాణువులు. (2) దేహంలోని కొన్ని ద్రవాలు.

1. తెల్లకణములు: రక్తంలోని యీ తెల్ల కణాలు మనకు రణరంగవేదికపైనున్న సైన్యవాహినివలె రక్షణ నిచ్చుచున్నవి. చర్మము తెగినప్పుడుగాని, పుండ్లు, కురుపులు లేచినప్పుడుగాని ఆస్థలాల కివి పరుగెత్తుకొనివస్తాయి ఒక చిన్న రక్తబిందువులో 7000 తెల్ల కణా లుంటాయి. సూక్ష్మక్రిము లా ప్రదేశాలకు వచ్చినప్పుడు శరీరంలోనికి పోనీయకుండా తెల్ల కణాలు అడ్డు తగులుతాయి. సూక్ష్మక్రిములమీద నాలుగువైపులనుండి విజృంభిస్తాయి. సూక్ష్మక్రిములు ఎక్కువ సంఖ్యలో లేకపోతే వాటిని ఆహారంగా గూడా వినియోగించుకొంటాయి. అయితే సూక్ష్మక్రిములు తయారుచేసే విషాణువులు విశేషప్రమాదకరములు కానప్పుడు మాత్రమే ఇది జరుగుతుంది. ఈ లడాయిలో ఒక్కొక్కప్పుడు సూక్ష్మక్రిములదే పై చెయ్యి కావచ్చుకూడా. అప్పు డవి వాటి విషాణువులతో తెల్లకణాలను చంపుతూ ఉంటాయి. క్షయరోగస్తుని చీము, నెత్తురు సూక్ష్మదర్శిని ద్వారాచూస్తే తెల్లకణాలకు సూక్ష్మక్రిములకు జరిగేయుద్ధమంతా కనిపిస్తుంది.

2. ద్రవాలు: ఒక్కొక్కప్పుడు సూక్ష్మక్రిములు గొంతులో నివాస మేర్పఱుచుకొంటాయి. ఇవి "డిఫ్తీరియా" రోగాన్ని కలిగిస్తాయి. ఇవి వాటి విషాణువులను రక్తంలోకి పంపి యీ రోగాన్ని దానం చేస్తాయి. ఈ విషాణువులను "టాక్సిను" అంటారు. ఈ రోగాన్నించి ఎవరైనా విముక్తులైనారంటే యీ "టాక్సిను" మన దేహంలోని ద్రవపదార్థాలతో సమవిలీనమై (*Newtralise*) పోయినదన్నమాటే.

ఈ డిఫ్తీరియా రోగస్తులకు "టాక్సిను విరుగుడు" అనే మందును డాక్టర్లు వాడుతుంటారు. దీనిని గుఱ్ఱాలనుండి తీస్తారు. ఈ డిఫ్తీరియా క్రిమిసమూహము మాంసముమీద ఎక్కువగా ఉంటుంది. దానిమీద "టాక్సిను"ను విసర్జించుతుంటాయి. వీటిని శాస్త్రజ్ఞులు దాచిపెట్టుతారు. ఇందులో కొంత గుఱ్ఱరక్తంలోకి ఎక్కించుతారు. సమానకాలపరిమితిలో మోతాదును హెచ్చిస్తూ గుఱ్ఱంలోకి ఎక్కిస్తారు. గుఱ్ఱానికి మోసం కలిగేటంత ఎక్కించరు. కొంతకాలమయినతర్వాత గుఱ్ఱం దీని కలవాటుపడిపోతుంది. అంటే గుఱ్ఱం రక్తం "టాక్సిను విరుగుడు"ను తయారుచేసి టాక్సినును సమవిలీనము చేస్తూ ఉంటుంది. దీనిని జాగ్రత్తగాతీసి డాక్టర్లు డిఫ్తీరియా రోగస్తులకు వాడతారు. అవసరాన్నిబట్టి టాక్సిను, టాక్సినువిరుగుడు కలిసిన మిశ్రమాన్ని డాక్టర్లు వాడతారు.

ఎంత ఆరోగ్యవంతులైనా వాళ్ల నోళ్లల్లో ప్రమాదకర క్రిములను కలిగియుంటారు. కాబట్టి ఎవ్వరి యెంగిలినికూడ ముట్టకూడదు. జలుబు లేనప్పుడుకూడా జలుబును కలిగించే క్రిములను ధరించియుంటారు. దేహం ఏమాత్రము అనారోగ్యంగానున్నా యీ క్రిములు తమ పరాక్రమమును ప్రదర్శిస్తాయి. 30 ఏండ్ల వయస్సులో ప్రతివాళ్లకి క్షయ, ఉబ్బసక్రిములవల్ల బాధ యెక్కువ కలుగుతుంది. వారా వయస్సులో విశేషారోగ్యంలో ఉంటే ఫరవాలేదు. లేకపోతే ప్రమాదమే.

క్షయరోగ క్రిములుతప్ప ఇతర రోగక్రిములు ఊపిరితిత్తుల నేమియు చేయలేవు. క్షయరోగం వంశపారంపర్యముగా వచ్చే రోగం కాదు కాని అది తండ్రికుంటే కొడుకు దేహంలో దాన్ని నిరోధించే జీవాణువులు చాలా తక్కువగా ఉంటాయి. సాధారణంగా ఉబ్బసము క్షయ ఏకారణాలవల్ల వస్తుందంటే (1) ఎప్పుడు తడి కాళ్లతో ఉండటం, (2) నిద్ర తక్కువవటం (3) ఎక్కువగా తినటం, (4) అజీర్ణము (5) పరిశుభ్రమైనగాలి లేకపోవటం, (6) ఎక్కువగా పనిచేయటం. 7. టాన్సిల్సు పెద్దవిగా నుండటం

జలుబు అనేది తఱచుగావచ్చే వ్యాధి. ఇది "వైరస్" అనే అత్యంత సూక్ష్మక్రిమిద్వారా కలుగుతుంది. ఈ క్రిమి సూక్ష్మదర్శిని ద్వారా చూచినను కన్పించదు. జలుబుగల వానిని తాకటం వలన గాని, జలుబుగలవాడు దగ్గినప్పుడు తుమ్మినప్పుడు, చీదినప్పుడు దగ్గరగా నుండటం వల్ల కాని, ఆరోగి వాడిన పదార్థాలను వాడటం వల్లగాని యీ జలుబు వ్యాధి కలుగుతుంది. ఈ "వైరస్" దేహంలో నున్నప్పటికి ఆరోగ్యంగా ఉంటే జలుబు రాదు.

జలుబుకు మంచి మందు విశ్రాంతి తీసికోవటం. బాగా గాలి వీచే స్థలంలో కావలసినంతసేపు నిద్రపోవటం. వంట సోడా కలిసిన నీటిని వాడటం, జలుబుకు చికిత్సలు.

క్షయరోగి ఉమ్మివేస్తే అది ఎండి గాలికి దానిమీద ఉండే సూక్ష్మక్రిములు ఎగిరి ప్రక్కనున్న వాళ్ళను వ్యాపించటం కలుగుతుంది. క్షయరోగక్రిములు తమంతట తాము ఎగురలేవు. నెమోనియా, పడిశెము, ఇన్ఫ్లుయెంజా, డిఫ్తీరియా మున్నగు వ్యాధులు, అవి యున్న వారు వాడిన పదార్థాలను వాడినందువల్ల కలుగుతుంటాయి. డిఫ్తీరియాను కలిగించే క్రిములు పాత్రలపై అంచులమీద నివసిస్తాయి. అందుకని కాఫీ హోటలుకప్పులకన్న మనకు పరమశత్రువు లింకెవ్వరూ లేరు. క్షయ, డిఫ్తీరియా ఈ రెండు వ్యాధులు చెడిన పాలద్వారా వ్యాపిస్తూ ఉంటాయి. అందుకని చంటి పిల్లలకు శ్రేష్ఠమైన ఆవుపాలనే వాడాలి. లేకపోతే క్షయ కలుగవచ్చును. శిశిరఋతువు, వసంతఋతువులలో క్షయ, నిమోనియా, డిఫ్తీరియా మున్నగు వ్యాధు లెక్కువగా కలుగుతూంటాయి. ఈ ఋతువులలో పాదాలను తడిగాఉంచితే ప్రమాదము.

పొగపీల్చటం, త్రాగుడువలన ఊపిరితిత్తుల పొర కంది, పటుత్వము తగ్గి క్షయరోగక్రిముల విలాసనిలయముగా మారుతుంది. జీవిత భీమ కంపెనీవారి పట్టికలలో చూస్తే "ఆల్కహాలు వాడటం వలన మామూలుమనిషివయస్సు 2 సంవత్సరాలపాటు తగ్గిపోతుందని తెలుస్తోంది. ఈ సూక్ష్మక్రిములవలన ఇన్ని నష్టా లున్నాయి. కాబట్టి మనం ఆరోగ్యాన్నిగురించి చాల జాగ్రత్తగా ఉండాలి.

ప్రాచీనగ్రామసభల న్యాయపరిపాలనము

(10-వ పేజీ తరువాయి)

సెక్యూరిటీల బడయుట,-హిందువుకు ఒరిపాటిగా నుండెడి" దని వ్రాయుచున్నాడు. ఎట్లు లయిన నేమి? ఈపద్ధతి దేశమందంతట నెలకొని యుండె ననుటకు వలనుపడదు. న్యాయమైన వృద్ధి (*Interest*) మాత్రము సాధారణముగ నంగీకరింపబడి యుండెను.

విద్వాంసుడైన బ్రాహ్మణుని జంపె నను నేరమును, అన్యాయ్యపు వృద్ధి నాశించె నను నేరమును,-త్రాసులయందునిచి తూచినయెడల మొదటివాని నేరము పైకిని, రెండవవాని నేరము క్రిందికిని, బోవునని బోధాయనుడు, వసిష్ఠుడు, మనువులోనగువారు సెప్పుచున్నారు. అధికవృద్ధి కిచ్చు పద్ధతిని నిరసించుచు ప్రభుత్వము అరికట్టు చుండెనని తెలియుచున్నది. అధికవడ్డీకి ఆశించి ఋణములనిచ్చువారిని, అట్లిచ్చువిషయమున ఋణదాతలకు ప్రోత్సాహ మొసగువారిని,-ప్రభుత్వము వారు శిక్షించుచుండిరి. ఇట్టి ప్రోత్సాహకులను ఋణముల నిచ్చువారికి విధించు నపరాధమున సాబాలు ఇచ్చునట్లు లొనర్చు చుండిరి. (అర్థశాస్త్రము) ఋణదాతయు ఋణగ్రస్తుడును ఋణమువిషయమున వివదించి న్యాయస్థానద్వారమున బరిష్కరించుకోదలచి నట్లులయిన నదివఱకు వారు నిర్ణయించికొనిన వృద్ధి న్యాయశాస్త్రరీత్యా నిర్ణయింపబడు వృద్ధికంటె దక్కువయైనను, అధికమైనను,-దల యొగ్గవలసినదే! యని మనుస్మృతి వాకొను చున్నది. సామాన్యముగ వృద్ధి వస్తురూపమున గైకొనబడుచుండెడిది. ధాన్యము విషయమున ధాన్యమును, బసుగణము విషయమున బసుగణమును, ద్రవ్యమువిషయమున ద్రవ్యమును,-ఋణములు సాగుచుండెడివి. ద్రవ్యమునకు-ద్రవ్యము,-ధాన్యమునకు-ధాన్యము,-ఇంక నిట్లే వర్తకపు సరకులకు-వర్తకపు సరకులు, మారకము అగుచుండెడివి. మంచిపంట కాలములో ధాన్యములకు ద్రవ్యమునకున్న యాధిక్యతకంటె సాబాలు మించకుండెడిదని కౌటిల్యుడు సెప్పుచున్నాడు. సామాన్యముగ వృద్ధి ముఖ్యమైన పెట్టుబడిదారుని ప్రమాణము (*Ratio*) వోలె బరిగణింపబడుచుండెనని యాజ్ఞవల్క్యుడు పలుకుచున్నాడు. న్యాయశాస్త్రకర్తలు నికరమైన వృద్ధి నూటికి బదునెన్మిదవ వంతు అని యొప్పికొనిరి. ఇంతియగాక సంవత్సరపు వృద్ధికంటె మాసపువృద్ధి (*Monthly interest*) యే సర్వసామాన్యముగ నమలునందుండెననియు, గొన్ని విషయములలో ద్రవ్యము విషయమున వత్సరముకంటె నధికముగ వృద్ధి కాలనిర్ణయ ముండెడిదనియు, నింక గొన్ని విషయములలో ననగా భూమి, పశుసంపద, సేవలు లోనగు వానిపై నిచ్చు ఋణములకు వృద్ధి లేకుండెడిదనియు-మనుస్మృతి వాకొనుచున్నది.

స్వల్పకాలపు గడువుమీద నిచ్చు ఋణములకును, దీర్ఘకాలపు గడువుపై నిచ్చు ఋణములకును,-విభేదము కలదని గౌతముడు, మనువు వచించుచున్నారు. స్వకాయకష్టము ననుసరించి యొసంగు ఋణములకు నిర్ణయమైన వృద్ధి న్యాయశాస్త్రమునుబట్టి యంగీకరింపబడని యపుడు అనగా అసలుకు ద్విగుణముగా వృద్ధి యగునని తోచినపుడవి ఋణగ్రస్తుడు తన కష్టకాలమున దీసికొనిన యప్పుని యొప్పికొనినపుడు కాలవృద్ధి యనగా మాసవారీ వడ్డి లేక ద్రవ్య సంబంధమగు ఋణములో అసలుకు ద్విగుణముగా వడ్డీయైనయెడలను లేక వస్తువుల విషయములో నయిదింత లభివృద్ధియైన పశుమునను బసువులు మొదలయినవాని విషయమునగూడ నిట్లేయైన యెడలను, జక్రవృద్ధి(*Compound interest*)యు భోగలాభము వడయునట్లు దుదకు బరిగణింపబడునని మనుస్మృతి వాకొనుచున్నది.

వర్తక సౌకర్యములబట్టి వృద్ధి నిర్ణయమును మాఱుచుండుననియు, గులము, ఋణము, అది నిలువయుండు కాలము, ఋణమిచ్చు వస్తువిభేదముల ననుసరించి వృద్ధియు, నిర్ణయ మగుచుండెడి దనియు దెలియుచున్నది. నూటికి బదియైదు (15%) వంతువృద్ధి(*interest*) మంచి దని నిదర్శనము లనేకము లున్నవి. నెలకు నూటికి $1\frac{1}{4}$ చొప్పున వృద్ధియైనచో న్యాయమే నని కౌటిల్యుడు సెప్పుచున్నాడు. ఋణదాత తన పెట్టుబడి ద్రవ్యముపై ద్విగుణము నేర్పాటు సేసికొనవచ్చునని వసిష్ఠు డొప్పికొనినవిధముగా మాసమునకు నూటికి నెనుబదియవవంతు గైకొనవచ్చునని మనుస్మృతియందు జెప్పబడియున్నది. మనువు తరువాతివారు ప్రతి యిఱువదికర్షపణములకును నైదు మాషలువంతున దీసికొనవచ్చునని చెప్పుచున్నారు.

ఈ సందర్భముల నన్నిటను సంవత్సరమునకు నూటికి బదియైదువంతున వృద్ధి యని యర్థమగుచున్నది. ఇవ్విధానము నిఱుపేదలకును, అవసర కార్యములకు గైకొనువారికిని, - ఋణమొసంగు విషయమున నే యమలునందుండునని విస్పష్టమగుచున్నది. తాకట్టుమీద నొసగు ఋణము విషయములో వృద్ధి 1/80 అనియును, నిట్టి ఋణములు సామాన్యముగ నష్టకాలములో జరగు వర్తక సంవిధానములకు దీసికొందురనియును,-యాజ్ఞవల్క్యుడు పలుకుచున్నాడు. సముద్రవ్యాపారమునకు గైకొను ఋణములకు నూటికిఱువది వంతున దీసికో బడవచ్చునని కౌటిల్యుడు సెప్పుచున్నాడు. ఎట్టులయిన నేమి? క్రీ. త. రెండవ శతాబ్దమున ఉషవదత్తు కాలమున రెండువేల కర్షపణములమీద సంవత్సరవారీవడ్డి నూఱుకర్షపణము ఉషవదత్తు డేయుంచె (*Deposit*) ననియు, నింకొకతూరి వేయి కర్షపణములమీద సంవత్సరవారీ వడ్డి 75 కర్షపణము లుంచెననియు,-'బొంబాయిగజటీరు' నందు గలదు. ఈ నూతన యుగములలో ఈవృద్ధి (*interest*) యధికమైనది గాదనియు, గాని సంవత్సరమునకు నూటికైదునుండి యేడున్నఱ వఱకు వృద్ధి మార్పు కాబడినదనియు, నగపడుచున్నది. ఆకాలములందీ వృద్ధి మాత్రము చాల దక్కువ యనియె నిష్కర్షగా చెప్పవచ్చును.

ఈ వృద్ధియొక్క యేర్పాటు వివిధకాలములలో, వివిధస్థలములలో విభేదించియుండె నని చెప్పవచ్చును. వర్తకసౌకర్యములకు నేర్పాటు కాబడిన కాలనిర్ణయము వృద్ధియొక్క ప్రమాణమును జూపెట్టుచున్నది. కొన్ని దృష్టాంతములంబట్టి వృద్ధి సంవత్సర కాలవిశంబమగు నెడల నెలకు నూటికి 5 మాషలవంతుల గైకొనవచ్చునని గౌతమస్మృతియం దుద్ఘాటింపబడినది. ఈ విషయలో ఋణగ్రస్తున కధికవృద్ధియె విధింపబడినది. కారణ మేమన, అతడు తన ద్రవ్యముతో నెక్కువకాలము సాగింపవచ్చును. ఇంతియకాక వర్తకపు గ్లిష్ట పరిస్థితుల నాధారపఱచుకొని ఋణగ్రస్తు డెక్కువ కాలము గడపవచ్చును. అర్థశాస్త్రములో ఆరణ్యకఋణములపయి నూటికి బదివంతునను, సముద్రవ్యాపారఋణములపయి నూటికిఱువదివంతునను,-వృద్ధి నిర్ణయింపబడవచ్చునని విధి కలదు. ఈ యారణ్యకఋణములను, సముద్రవ్యాపారసంబంధఋణములను, - కష్టనష్టములకు లోనగునని యెంచియే యధికమొత్తములుగ నిచ్చుచుందురు. ఓడలు మునిగి, యందుండు సరకు అనగా వస్తువులు నాశముకాబడి,-తద్వ్యాపారమునకై యొసగు ఋణములు వసూలగుట యసంభవము. అట్టియెడ నాటినుండి వృద్ధి (అసలుతోసహా) నీయవలెనననినిష్కర్ష యొనర్తురు. దీనింబట్టి వర్తకవ్యాపారములలో వృద్ధి నాశించిమాత్రమే సొమ్మియరాదనియు, నందువలన అసలుమొత్తమునకే నష్టి సంభవించు ననియు,-శుక్రనీతి వాకొనుచున్నది.

వస్తువులపైగాని, పశువులపైగాని, ద్రవ్యము మీదగాని తీసికొను ఋణములకీ వృద్ధిలేకుండెడిది. ఆవుదూడలపైగాని, నూనె, నిర్మలమైన వెన్న లోనగువానిపైగాని, నూటికి నెన్మిదివంతులనియు, వస్త్రములు, ధాన్యములు, బంగారుపై నూటికి నాలుగు, మూడు, రెండువంతులనియు,-వృద్ధిస్మృతుల ననుసరించియుండదగునని యాజ్ఞవల్క్యుడు పలుకుచున్నాడు. ద్రవ్యముమీదివృద్ధి నూటికిఱువదవవంతుకంటె నధిక ముండరాదని నిర్ణయము కలదు. తాకట్టుపెట్టినచో వృద్ధియె లేకుండెడిది. తాకట్టులేని ఋణముల కధికవృద్ధి (*interest*) యుండెడిది. అప్పు గైకొనువాని గౌరవప్రపత్తులనుబట్టియు, నమ్మకమునుబట్టియు-వర్తకపుబనులు సాగుచుండెడివి. ఇట్టి సంక్లిష్టస్థితి యందుగూడ స్నేహితున కొసగు ఋణమునకు వృద్ధియుండగూడదని శుక్రనీతి బోధించుచున్నది. అప్పు గైకొన్నవాడు ఆ ద్రవ్యముతో నతడు సేయు వ్యాపారమున (లేక పనియందు) నధిక లాభము గడించినయెడల నదివఱకు నిర్ణయింపబడిన వృద్ధికంటె నధికవృద్ధి ఋణదాత గైకొననగునని కౌటిల్యుడు సెప్పుచున్నాడు. అదియును గాక వ్యాపారమునకయి యొసంగు ఋణములకు నూటికి 5వంతున వృద్ధియుండవలెననియు గౌటిల్యుడు సెప్పుచున్నాడు. అధిక పంట తనకు బండునని యభిప్రాయపడి ఋణ మడిగినప్పుడును, ఋణ దాతకును నట్టి యభిప్రాయమే కలిగినప్పుడును, —అధిక వృద్ధికి గాంక్షింపకయే ఋణ మీయవలెనని యొక నిర్ణయమున్నది. కులవివక్షత ననుసరించి ఋణములు దొఱకుచుండెడి వనియు, నెలకు నూటికి రెండు, మూడు, నాల్గు ఐదు వంతున ఋణములు లభ్యమగుచుండె ననియు గౌటిల్యుడు సెప్పుచున్నాడు. అధిక వృద్ధి సామాన్యముగ గర్హింపబడుచుండెడిది. నిర్ణీతమైన వృద్ధి న్యాయశాస్త్ర రీత్యా తక్కువయైనను న్యాయశాస్త్రనిబంధనల కతిరిక్తమైనచో రాబట్టబడదు. ఇట్టి వృద్ధి (*interest*) ని న్యాయశాస్త్రకర్త "లన్యాయవృద్ధి" యని యందురని మనుస్మృతి ధృవపఱచుచున్నది. అప్పిచ్చువాడు నూటికైదు వంతుకంటె నధికముగా వృద్ధి యాశించి యిచ్చుటకు వలనుపడ దయ్యెను. గడువు మించిన ఋణములవిషయములో వృద్ధి నిర్ణయమును, మరల ఋణమొసంగు విషయమును, —పునర్విమర్శతో నిబంధనలు గలవు. ఋణదాత యీయవలసిన ఋణమును ఈయ నిరాకరించినచో గౌటిల్యు నభిప్రాయముంబట్టి యతడు 12 పణము లపరాధము సెల్లింపవలయును. అత్యాశాపరుండగు ఋణదాత స్వార్థాభిలాషముతో నిర్విఘ్నముగ ఋణగ్రస్తునుండి సొమ్మును లాగికొనునని తెల్లమగుచున్నది. ఋణగ్రస్తుడీయ నిరాకరించినది న్యాయ్యమే యైనచో ఋణదాత కాతడు వడ్డీ యీయ నక్కఱ లేకుండ జేయబడి యామొత్త మితరులయొద్ద 'హామీ'గా నుంచబడుచుండెడిది. దీన నప్పులవాడు అప్పు పుచ్చుకొనిన వానికీయక సొమ్మును నిలువ యుంచిన కాలములో వృద్ధి (*interest*) సెల్లింప నక్కఱ లేదవి విస్పష్టమగుచున్నది.

ఋణదాత తన సొంత ద్రవ్యమును బెట్టుబడి పెట్టిన విషయములో బైసలనుండి లెక్కించి మీనమేషముల నెంచ యత్నించినచో ఋణగ్రస్తు డీదలంచిన మొత్తమును దీసికొనకుండెను. మధ్యవర్తిద్వారమున ఋణగ్రస్తుడా ద్రవ్యము నిలువ యుంచినయెడల నాటినుండియు నాతని ఋణమునకు వృద్ధి యుండదు. వృద్ధియొక్క మొత్తమునకు గాలనిర్ణయ ముండును. ద్రవ్యపరివర్తనముల విషయమున పెక్కుపర్యాయములుగా గాక యొక్క పర్యాయమే వృద్ధి సెల్లింపబడు ననియు, నారీతి జెల్లింపబడిన వృద్ధి అసలు మొత్తమునకు రెండింతలు కంటె నధికముగా దనియు, —యాజ్ఞవల్క్యుడు సెప్పుచున్నాడు. ధాన్యము, ఉన్ని, పశువులు లోనగు వర్తకపుసరకులపయి అసలు మొత్తమునకైదు గుణములకు మించకుండె ననియు, విష్ణుపురాణమునందును, గౌతముడు, యాజ్ఞవల్క్యుడు, మనువు లోనగు వారును, సెప్పుచున్నారు. ఈ సందర్భముల ననుసరించి ఋణగ్రస్తుడు ద్రవ్యము సెల్లింప దలచినపుడు ఋణదాత గైకొనవలెనని నిబంధనము కలదు. వృద్ధి యీవలసినకాలము అతిక్రమించినపుడు ఋణదాత తన ఋణ మీయవలసినదని యడుగవచ్చుననియు, ఋణగ్రస్తు డీయ నిరాకరించినయెడల నపరాధముక్రింద నాల్గు గుణముల మొత్తము (*Four times amount*) వివాదముక్రింద జెల్లింపవలెననియు, - గౌటిల్యుడు వచించుచున్నాడు. ఋణగ్రస్తుడు సకాలములో వృద్ధిని జెల్లింపజాలకున్నచో నాతడు ఒడంబడిక పత్రము (*Agreement*) పునరుద్ధరించవచ్చును. ఆ పత్రమున జెల్లించజాలని వృద్ధి (*interest*) మొత్తమున జేర్చి వ్రాసికొనవచ్చునని మనువు వాకొనుచున్నాడు. గ్రామములంగల ప్రజ లివ్విధమున శాంతి సౌభాగ్యములతో దనరారుచు, నభ్యుదయ పరంపరాభివృద్ధి జూఱగొనుచు, నాదర్శప్రాయముగ పసిలుచుండిరి.



వైట్‌హౌస్ మెట్లమీద అమెరికాలోని వివిధరాష్ట్రాల యువకు గవర్నర్లతో సల్లాపము లాడుతున్న ట్రూమన్ అధ్యక్షుడు.

సాహిత్య మీమాంస :

మన నవలలు

[శ్రీ బసిరెడ్డి ఈశ్వరరెడ్డి]

కావ్యములు మానవుని సుకుమారభావమును మాత్రమే ప్రకటించగలవు. గేయములు ఒక విధమైన మాధుర్యమిశ్రితమైన ఆహ్లాదమును మాత్రమే యివ్వగలుగును. కథలు జీవితానికి ప్రతిబింబములైనా వాటిలో పూర్తివికాసమున కవకాశ ముండదు. ఒక జీవితాన్ని విస్తారంగా, యాథార్థ్యంగా చిత్రించవలెనంటే, ఒక పెద్ద ఘటనను మనోజ్ఞంగా వివరించవలెనంటే నవల ద్వారానే సాధ్యమగును. ప్రతిభావంతు లందరూ కష్టభూయిష్ఠమైన ఒక సంఘాన్ని చూపించడానికిగానీ, మరిదేనినిగానీ విస్తారపూర్వకంగా సాహిత్యంలో ప్రదర్శించడానికిగానీ నవలనే సాధనంగా తీసికొంటారు. నేడు సాహిత్యంలో కథలకూ, నవలలకూ మాత్రమే ప్రాధాన్య మున్నది.

సాహిత్యం జీవితాని కనుకృతి అనునది సర్వసమ్మతం. జీవిత యాథార్థ్యము నుపేక్షించి కేవలం కల్పనల ఆధారంతో అల్లబడినది ఉత్తమ సాహిత్య మనబడదు. [illegible] కావ్యాల్లో, గేయాల్లో మాధుర్యభావములకేగానీ ప్రతి జీవిత యాథార్థ్యవర్ణనకూ అవకాశ ముండదు. అట్లు ప్రతి జీవిత యాథార్థ్యవర్ణనకూ మానవతత్త్వంలోని వైచిత్ర్యపూర్ణమైన వివరణకూ నవలయే శరణ్యం. నవలద్వారా వివరించబడే ప్రతి విషయమూ వ్యాసాలద్వారా ప్రచారపత్రముల ద్వారా వివరించబడు విషయంకంటె ఎక్కువ ప్రభావోత్పాదకంగా సజీవంగా ఆకర్షకంగా ఉండగలదు. మాలపల్లి నవల కలిగించని జాతీయ సంచలనం ఏ పార్టీ కలిగించలేదు. శరత్ బాబు పల్లీయులూ ప్రేమచందు గోదాన్ పల్లెపరిస్థితులనూ, గ్రామజీవితమునూ చూపించినంత సజీవంగా ఆకర్షకంగా ఏ గ్రామోద్ధారకుని ప్రచారకరచనా కల్గించలేదు. విశాలసృష్టిలోని వైచిత్ర్యాన్నీ, స్త్రీ పురుష ప్రకృతులలోని శాశ్వతసమస్యాత్మకమైన సౌందర్యమునూ వివరించుటకు నవలయే సాధనము.

నేడు నవలలు విపరీతంగా వృద్ధిజెందినవి. జీవితంలోని ప్రతివిషయాన్నీ వివరించే సాంఘిక రాజకీయపరిశోధకైతిహాసిక నవలలూ మన కున్నవి. తెలుగుదేశంలో నేడనుక్షణమూ ఉద్భవిస్తూండే అనేకనవలలూ శరత్ బాబునవలలూ కొంతవరకూ ప్రేమచంద్ నవలలూ సాంఘికములుగా లెక్కించబడును. సంఘంలోని లోటుపాట్లనూ, మంచిచెడ్డలనూ నిరూపించే రచనలూ స్త్రీపురుష వైచిత్ర్యమునూ తదౌన్నత్యమునూ చూపించే శరత్ నవలలూ, గ్రామీణజీవితాన్ని నిరూపించే ప్రేమచంద్ నవలలూ, సాంఘికవర్గంలోనే చేరును. నవల లన్నిటా సాంఘికములకే ఎక్కువ ప్రాధాన్యం. రాజకీయములనే లక్ష్యంగా పెట్టుకొన్న నవలలను సాంఘికములుగా ఎంచగూడదు. మాలపల్లినీ, ప్రేమచంద్ యొక్క కర్మభూమిలాంటి రచనలనూ రాజకీయములుగానే ఎంచవలెను. యిటువంటి నవలలు ప్రజల్లో ఉద్రేకాన్నీ, విప్లవాన్నీ రగుల్కొల్ప వచ్చునుకానీ వాటి విలువ తాత్కాలికం. అపరాధపరిశోధకనవలలకు పూర్వంవలె నేడు ప్రాధాన్యంలేకున్నా వాటిపై ఆసక్తి ప్రజల్లో పూర్తిగా నశించలేదు. యిటువంటి నవలలకు సాహిత్యకమైన విలువ ఏమాత్రం ఉండదు. వీటిని మనం సాహిత్యంలో లెక్కించజాలము. కేవలం మన కౌతూహలాన్నిమాత్రమే వృద్ధిబొందించే యీ నవలలను ఆశ్చర్యవర్ధకమైన కథలుగా లెక్కించవచ్చును. మన భాషలో స్వతంత్రాపరాధపరిశోధకనవలలూ, యితర భాషలలోని వాటి అనువాదములూ విపరీతముగా విలసిల్లినవి. యీరకంనవలలు చదువునంతసేపూ మనకు "తరువాత ఏమి జరుగగలదు?" అనే ధ్యాస తప్ప మరే భావమూ కలుగదు. మన దృష్టి అంతా నవలాంతములో తెలుపబడు రహస్యముపై కేంద్రీకరించబడును. యిట్లు మనలో రసావేశమునూ కల్గించక స్థాయిభావసంచారిభావములూ లేనట్టి రచనను సాహిత్యములో చేర్చజాలము. మెదడు కెక్కువ పరిశ్రమను కల్గిస్తూ రసనిష్పత్తిని కల్గించని యీరకం నవలలు ఉత్తమవిద్యావంతుల నెక్కువ ఆకర్షించజాలవు.

ఐతిహాసికనవలలను వ్రాయడం అతి కష్టం అందులో రచయిత కడుగడుగునా ప్రమాదము సంభవించుట కవకాశ మున్నది. రచనాశక్తీ, అపారైతిహాసికజ్ఞానమూ, బహుళజ్ఞతా ఉన్నట్టి వారుమాత్రమే అందుకు పూనుకొనుట యుక్తము. మన తెలుగులో ఐతిహాసికనవలలు చాలా తక్కువ. ఉన్నవి కూడా చాలావరకూ దోషభూయిష్ఠములని ఒప్పుకొనక తప్పదు. యీ విధంగా తెలుగునవలాసాహిత్యం వివిధత్వంతో, వ్యాపకరూపాలలో విరాజిల్లుచున్నది. కానీ సాంఘికనవలలు రచించబడినంత అధికంగా ఉత్తమంగా తదితరమైన నవలలు రచించబడలేదని చెప్పవచ్చును. ఏ యితరభాషతోనైనా పోటీచేయగల సాంఘికనవలలు మనకున్నవి. కానీ ఆంధ్రుల ఉపేక్షమూలంగా అవి ఇతర భాషలలోని కనూదితం కాలేదు. తెలుగులో నవలారచనలో యుగాంతరమును సాధించినది "మాలపల్లి" యనవచ్చును. యిది రాజకీయనవలయైనా ఉత్తమ భావప్రపూర్ణమై, నవరసాలంకృతమై మన నవలాప్రపంచమునకు తలమానికమై విరాజిల్లుతున్నది. యిందులో జ్యోతి సంగదాసుల చరిత్ర అత్యుత్తమంగా విరచించబడినది. రామదాసుయొక్క పవిత్రస్వరూపమూ, దురహంకారానికి ప్రతినిధియైన చౌదరిచరిత్రా మనల ననేకభావానుభావములలో ముంచివేయును.

ప్రస్తుతం తెలుగుదేశములోని నవలా రచయితలలో విశ్వనాథ సత్యనారాయణా, అడివి బాపిరాజూ, చలం త్రిమూర్తు లనవచ్చును. విశ్వనాథ సత్యనారాయణగారి రచనారంగం అతివిస్తృతం. ఆయనయొక్క వేయిపడగలూ, మాబాబూ, ఏకవీరా తెలుగుభాషకే భూషణములు. వేయిపడగలు కథాక్రమంతోబాటు అనేక విషయములతో రచింపబడిన ఒక పెద్దనవల. యిందులోని ధర్మారావు రచయితభావములకు ప్రతినిధి యనవచ్చును. యీ నవలలో రచయిత పాత్రలద్వారా వెల్లడించిన భావములు సర్వసమ్మతములు కాకున్నా తర్కసంగత మనుటకు సందేహం లేదు. యీ నవల కంతటికీ అత్యుత్తమంగా అత్యుజ్జ్వలంగా సృష్టించబడిన మంగమ్మ ఉచితానుచితములు తెలియని వేశ్యవంటి మంగమ్మ తుదకు పశ్చాత్తాపదగ్ధురాలై విరాగిణియైపోవును. పసిరిక వ్యక్తిత్వమే విచిత్రం. కానీ అటువంటి వ్యక్తిత్వంగల మానవులు ఉండరని ఆశ్చర్యపడ నవసరం లేదు. యీ నవలకంతటికీ సజీవమై మనలను ఆనందింపజేస్తూ నవ్వింపజేయు పాత్ర కుమారస్వామి. ధర్మారావు అనసూయలద్వారా గార్హస్థ్య ధర్మాదర్శం వివరించబడినది. ఏవో కొన్ని అస్వాభావికము లున్ననూ మొత్తంమీద యీ నవల తెలుగులోని ఉత్తమోత్తమ నవలల శ్రేణికి చెందిన దనునది నిర్వివాదమైనది. మాబాబు నవలలో ఒక భగ్నజీవియొక్క విషాదపూర్ణగాథయే యితివృత్తం. దుర్భర దారిద్ర్యాన్ననుభవిస్తూ నిరాధారుడై గొడ్లను మేపే ఆ వ్యక్తి అనేకయాతనల తరువాత అత్తగారి ప్రాపకం సంపాదించుకొంటాడు. విశుద్ధ మనస్సుతో అతడు ప్రేమించిన పిల్ల అతి విశ్వాసఘాతకంగా అతని తమ్మునిద్వారానే పతితురాలై పోతుంది. తన ప్రేమా తన లక్ష్యం తన సౌఖ్యం భగ్నమైపోయినా కుటుంబసౌఖ్యం కోసం భయంకర విషాదాన్నంతా మనస్సులోనే కప్పిపుచ్చి అతడు తమ్మునకే ఆ అమ్మాయిని వివాహం చేయడం మొదలగు ఘట్టాలు సంస్కారులైన పాఠకులకు కూడా కన్నీళ్లు తెప్పించగలవు. అతడు చేసిన యీ ఉదాత్తమైన త్యాగమును ప్రపంచములోని ఉత్సర్గశీలురయొక్క మహాత్యాగములతో సరిపోల్చవచ్చును. కుటుంబప్రేమ లేనిది రాష్ట్రప్రేమగానీ, విశ్వమానవప్రేమకానీ లగడం కల్ల. మాబాబులోనా చెలియలికట్టలోనా మార్మికఘట్టము లసంఖ్యాకములు. ఒక్క మాబాబే ఒక్క వేయిపడగలే, సత్యనారాయణగారికి తెలుగు నవలారచయితలలో ఉత్తమ స్థానము నివ్వగలవు.


బాపిరాజుగారి నవలల కొక ప్రత్యేక పోకడ ఉన్నది. వివిధవిషయములపై అపారజ్ఞానం వారి కున్నది. సంస్కృతరచయితలకు నిర్దేశించబడిన అనేకయోగ్యతలు వారి కున్నవి. వారికి శిల్పాభిమానం అత్యంతం. వారి ప్రతినవలలోనా అపారజ్ఞానం శిల్పాభిమానం వెల్లివిరుస్తుంటుంది. ఒక కాలేజీయువతిలో ఎంత వైచిత్ర్యం ఎంత ఉద్దండత చూపించడమునకు సాధ్యమో అంతా తుఫానులో మనం చూస్తాం. అప్రస్తుత విషయాలనుకూడా ప్రస్తుతాశయంతో వ్రాయడం వారికే చెల్లును. తుఫానులోని అప్రస్తుతమైన హిమాలయయాత్రా విషయం మన కేమీ విసుగు కల్గించదు. తన స్వకీయానుభవాలను ప్రపంచానుభవాలుగా సాహిత్యంలో ప్రవేశపెట్టడంలో తన వివిధవిషయజ్ఞానమును నవలలలో ప్రవేశపెట్టి విరసాలనుకూడా సరసాలుగా మార్చడంలో వారికి వారే సాటి. నారాయణరావు ఒక సాంఘికనవల. రచయిత తన భావా లన్నిటినీ నారాయణరావుద్వారా ప్రకటిస్తాడు. సాహిత్యానుభూతినేగాక అనేక విషయజ్ఞానంకూడా మన కీ నవలద్వారా తెలియును. పెద్దనవలలలో కథతోబాటు అనేకవిషయములను చర్చించుట కవకాశ ముండు ననువిషయమును నేనూ అంగీకరిస్తాను. కానీ యిట్లు చర్చించబడు విషయములు కథాప్రవాహమునకే అంతరాయం కల్గించునంత పెద్దవిగా ఉండకూడదు. నారాయణరావు సకలవిధసుగుణములూ మూర్తీభవించిన వ్యక్తి. ఈ నవలలో ప్రాసంగిక కథయైన రాజేశ్వరరావుచరిత్రయే మవల నత్యంతంగా ఆకర్షిస్తుంది. విశ్వలాపురంజమీందారుయొక్క ఉదారస్వభావమూ నేటి భ్రష్టత్వాన్ని పొందిన జమీందారుల విలాసస్వరూపమూ పుష్పశీలయొక్క పుష్పశీలమూ మరపు కురానివి. మనకు ఐతిహాసికనవలలు చాలా తక్కువ. ఈ కొరతను 'హిమబిందు'వంటి చారిత్రక నవలలు తీర్చుచున్నవి. ఆంధ్రులకూ శాతవాహనులకూ ఉన్న సంబంధ మెలాంటిదని అనేక చారిత్రక పరిశోధకులు సందేహస్థితిలో నున్న యీ సమయంలోనే బాపిరాజుగారు ఆంధ్రుల శౌర్యాన్ని, కీర్తినీ చాటే యీ నవలను రచించుట వారి ప్రతిభనే వెల్లడిస్తున్నది. బాపిరాజుగారీ నవలకు ఆనాటివాతావరణం కల్పించుటలో కృతకృత్యులైనారు. మనం సంస్కృత నాటకములలో విషకన్యవిషయమును మాత్రమే విన్నాం కానీ ఆమె నింత బీభత్సంగా చూపించిన రచయిత యెవ్వడూ లేడు. ధాన్యకటకం నుంచీ విశాలమగధసామ్రాజ్యము నేలిన శాతవాహన చక్రవర్తుల ఉజ్జ్వల చరిత్రను తెలిసికొనవలెనంటే గతించిన ఆంధ్రుల లోకోత్తర చరిత్రను ఛాయామాత్రంగానైనా చవిచూడవలెనంటే 'హిమబిందు' చదివి తీరవలెను. బాపిరాజుగారి ప్రతిభావిషయికజ్ఞానం అపారం. తెలుగు భాష నింకా కొన్ని అమూల్యనవలారత్నములతో అలంకరించగలరని నా ఆశ.

వాడవాడలా పల్లెపల్లెలా ప్రఖ్యాతి జెందిన చలంరచనలను గురించి తెలియనివారే లేరు. శరత్ బాబుతో పోటీ చెయ్యగలిగిన యీ లోకోత్తర ప్రతిభావంతుడు ఆంధ్రదేశములో పుట్టినందువల్ల శరత్ బాబుపేరునూ ప్రఖ్యాతినీ పొందలేకపోయ్యాడు. సర్వజనసమ్మతంగాని వీరి రచనలు ఆంధ్రదేశములో అత్యంతసంచలనం కల్గించినవి. "స్త్రీ"లో వీరు వ్రాసిన భావములనే ప్రతిరచనలోనా వెల్లడిస్తుంటారు. నిష్కాకణములను రాల్చే శక్తి వీరి కలమున కున్నది. "మైదానం"వంటి వీరి రచనలు కొందరికి జుగుప్సనుకూడా కల్పించునేమో. ఈ ప్రతిభావంతుడు తన రచనలను కొంత సంయమంతో వ్రాసి ఉంటే బాగా ఉండేది. మొత్తంమీద వీరి రచనలు కల్గించినంత సంచలనం మరెవ్వరి నవలలూ కల్గించలేదు.

ఈ విధంగా అనేకనవలారచయిత లున్నారు. ఈ నవలారచయిత లందరిలోనా కొవ్వలివారి నవలలు స్వల్పవిద్యావంతులలో అత్యంతప్రచారమును పొందినవి. భాషా భావాలూ తేలికగా ఉండడం రచన కథవలె అతిసంక్షేపంగా ఉండడంవల్లనే వీరి నవలల కింత ప్రచారం కలిగినది. వీరి నవలలలోని సాహిత్యం ఉత్తమ నవలలకు కావలసిన ఉత్కృష్టత్వము ఏమీ లేకున్నా అనేకులకు సాహిత్యాభిరుచిని కల్గించుటకు కారణమైనవి. యిటే అనేకులు తమ అమూల్యనవలాపుష్పములతో తెలుగు తల్లిని పూజిస్తున్నారు.

తెలుగునవలాసాహిత్యంలో అనూదిత నవలాసాహిత్యమున కున్న ప్రాధాన్యము కాదనజాలము. ఆంగ్లంనుంచీ, బెంగాలీనుంచీ, హిందీనుంచీ తుదకు కన్నడంనుంచీకూడా అనువదింపబడినవి. ఆంధ్రులకు మౌలికగ్రంథాలపై మక్కువ తక్కువ ఏమో. యితరభాషల్లోని చెత్తను అనువదించుకోడానికి కూడా మనం సంకోచించడం లేదు. అనువాదములద్వారా మన భాషను సమృద్ధం చేసికొనవచ్చును కానీ వాటికే ప్రాధాన్య మిచ్చి మౌలికత్వమును తృణీకరించగూడదు. తుఫానువంటి నవలలను యితరభాషలలోనికి అనువాదం చేయడానికి మనమూ ప్రయత్నించవలెను. యితరభాషల్లో వాటికి పూర్తి గౌరవం లభించగలదని నా దృఢవిశ్వాసం.

డిటెక్టివ్ నవలలలో అనువాదముతో పెంపొందిన తెలుగు నవలాలత ఉత్తమోత్తమ నవలాపుష్పములతో అనుక్షణం వృద్ధిజెందుతున్నది. డిటెక్టివ్ నవలలపై వ్యామోహం తగ్గిపోతున్నది. రాజకీయ నవలలు 'మాలపల్లి'తోనే సమాప్తి యైపోయినవి. యిదంతా నవలాసాహిత్యాభివృద్ధికి శుభసూచన. ప్రస్తుతం మనకు ప్రజాజీవితాన్ని ఉత్తమోత్తమంగా చిత్రించగలిగే సాంఘికనవలలూ ఐతిహాసిక తథ్యాలపై ఆధారపడిన చారిత్రక నవలలూ మనకు కావలసియున్నవి. ఒక ప్రాంతంలోని ప్రజలు యింకొక ప్రాంతసంస్కృతిని అవగాహన చేసికొనవలెనంటే అనువాద సాహిత్యం ద్వారానే సాధ్యమగును. అనేకులకు అనువాదములు చదవడంద్వారానే బెంగాలీలపై బెంగాలీ సంస్కృతిపై ఒకరకమైన అభిమాన మేర్పడ్డది. మనం కూడా యితర సోదరభాషల్లోనికి మన నవలలను అనువదించి అఖిలభారతీయులకూ మన సంస్కృతినిగురించి తెలసికోడానికి తగిన అవకాశం కల్పించవలెను.



★ కాశ్మీర్ సమస్య: ట్రూమన్, అట్లీల విజ్ఞప్తి

కాశ్మీరంలో ప్లెబిసైట్ జరిపేముందు ఆ సంస్థానంలో శాంతిని నెలకొల్పి సైన్యాల్ని ఉపసంహరించడానికిగాను ఐక్యరాజ్య సమితి వారి కమిషన్ కొత్త ప్రతిపాదనలు చేసింది. ఈ ప్రతిపాదనల్ని పాకిస్తాన్ భారతదేశాలు నిరాకరించాయి. వానిని అంగీకరించవలసిందిగా అమెరికా అధ్యక్షుడు ట్రూమన్, బ్రిటిష్ ప్రధాని అట్లీలు ఉభయప్రభుత్వాల ప్రధానామాత్యులకూ విజ్ఞప్తులు పంపారు.

కమిషన్‌వారి క్రొత్త ప్రతిపాదన లేవో అధికారరీత్యా బహిరంగపరచబడలేదు. బహుశా కమిషన్ ఇదివరలో ప్రతిపాదించిన అంశాలపైన ఒక మధ్యవర్తి విచారణకూ నిర్ణయానికీ అంగీకరించవలసినదని కమిషన్ సూచించినట్లు తెలియవస్తోంది. ఈమధ్యవర్తి ప్లెబిసైట్ నిర్వాహకుడుగా ఇదివరకే ఎంచబడిన అడ్మిరల్ చెస్టర్ నిమిట్జ్‌ను నియమించాలని సూచించినట్లుకూడా తెలియవచ్చింది.

కాశ్మీర్ సమస్యనుగురించి భద్రతామండలి 1948 ఆగస్టులో చేసిన తీర్మానంలో మూడో అంశంకోసం నిమిట్జ్ నియమింపబడ్డాడు. మూడో అంశం ప్లెబిసైట్‌నిర్వహణకు సంబంధించినది. మొదటి అంశం యుద్ధవిరమణకు సంబంధించినది అమలు జరిగిపోయింది. రెండో అంశం సంస్థానంలో శాంతిని స్థాపించడానికి ఉభయ ప్రభుత్వాల మధ్యనూ జరగవలసిన ఒడంబడిక.

శాంతిస్థాపనకు కమిషన్ ఇంతవరకూ నాలుగుసార్లు ప్రతిపాదనలు సూచించి విఫలమయింది. రౌండ్ టేబుల్ సమావేశం జరపాలని కమిషన్ ప్రతిపాదించింది. సమావేశానికి అంగీకరించిన ఉభయప్రభుత్వాలూ చర్చనీయాంశాలు ముందుగా తెలపమని కోరాయి. కమిషన్ ఈ క్రింది క్రమం సూచించింది. 1. కాశ్మీర్ సంస్థానంనుంచి పాకిస్తాన్ సైన్యాల ఉపసంహారం, 2. సంస్థానానికి చెందని పాకిస్థాయునీల్నీ, కొండజాతి పఠాన్లనీ వెళ్ళగొట్టడం, 3. భారతసైన్యాల బలాల్ని సంస్థానంనుంచి తరలించడం, 4. పై నాలుగింటికీ సంబంధించిన ఇతర విషయాలు. (ఇందులో ఆజాద్ కాశ్మీర్ సైన్యాలనబడే దళాలని నిరాయుధం చేసే విషయమై భారతప్రభుత్వం కోరికపైన చర్చించవలసి ఉంటుంది).

నాలుగో విషయం చర్చించడానికి పాకిస్తాన్ ప్రభుత్వం అంగీకరించలేదు. అది చర్చించి తీరాలని భారతప్రభుత్వం కోరింది. ఉభయ ప్రభుత్వాలకూ చర్చనీయాంశాలపైనే సమాధానం కుదరలేదు. కాబట్టి ఢిల్లీ సమావేశ సూచన రద్దుచేయబడింది.

ఆపైన కమిషన్ అయిదో పర్యాయం శాంతి సాధనసూచనల్ని చర్చించి పరిష్కరించడానికి పరిష్కర్తని (ఆర్బిట్రేటర్) అంగీకరించవలసిందని సూచించింది. అయిదో సూచనకి ఉభయప్రభుత్వాలూ ఇంకా సమాధాన మివ్వలేదు. ఈలోగా ట్రూమన్ అట్లీలు ఈ సూచనల్ని అంగీకరించాలంటూ పండిట్ నెహ్రూ, లియాఖత్ ఆలీఖాన్‌గార్లకు లేఖలు వ్రాశారు.

పండిట్ నెహ్రూ అలహాబాద్‌లో ఈ విషయమై ప్రసంగిస్తూ, వీరి జోక్యానికి ఆశ్చర్యం ప్రకటించారు. అసలు వివాదాంశాన్ని గ్రహించకుండా వీరు పెడదోవ పడుతున్నారన్నారు. కాశ్మీరం భారత అధినివేశంలో చేరిన భాగం, పాకిస్తాన్ ఆ ప్రాంతంపై దాడి చేసింది. పాకిస్తాన్ దురాక్రమణను అరికట్టవలసి ఉన్నది. మొదట దాడి చెయ్యలేదని వాదించి ఇప్పుడు అంగీకరిస్తూ, తమ దురాక్రమణను సమర్థించుకోడానికి పాకిస్తాన్ యత్నిస్తోంది. వారు దురాక్రమణ చేశారనే సత్యాన్ని లోకం అంగీకరిస్తుందా! భారతప్రభుత్వం చేసిన ఫిర్యాదు ప్రకారం పాకిస్తాన్ నేరం ఋజువైనట్లే. లేదని తలిస్తే ఆ అభిప్రాయాన్ని స్పష్టపరచవలసి ఉన్నదన్నారు పండిట్ నెహ్రూ.

కాశ్మీర్ సంస్థానాధిపతి భారతఅధినివేశంలో చేరిన తరువాత భారత ప్రభుత్వం వాగ్దానంప్రకారం ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోగలదు. అయితే ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోడానికి ప్లెబిసైట్ నిర్వహించవలసిన అధికారం న్యాయతః భారతప్రభుత్వానికే ఉంటుంది. కాని భద్రతామండలితీర్మానాన్ని మన్నించడానికిగాను ప్లెబిసైట్‌నిర్వహణకు ఆ మండలి నిర్ణయించేవారినే నియమించడానికి భారతప్రభుత్వం అంగీకరించింది. ప్లెబిసైట్ నిర్వహణలో పాకిస్తాన్‌కి ఏమాత్రం జోక్యం ఉండరాదని భారతప్రభుత్వం స్పష్టపరిచింది. ప్లెబిసైట్ జరిగేముందు రెండో అంశంఅమలు జరగాలి. ఈ రెండో అంశం విషయంలో, అంటే శాంతిసాధనవిషయంలో పాకిస్తాన్ చిక్కులుపెట్టి, ప్లెబిసైట్‌నిర్వహణలో జోక్యం చేసుకునే అధికారం సంపాదించాలని యత్నిస్తోంది.

ఆజాద్ కాశ్మీర్‌దళాలనే పేరుతో పాకిస్తాన్ తన సైనికదళాలను తన ఆక్రమణలో ఉన్న ప్రాంతంలో నిలవరించాలని యత్నిస్తోంది.

ఇప్పుడు మధ్యవర్తిని నియమించి పరిష్కారం చేసుకోవాలంటే అర్థం, శాంతిసాధన, సైన్యాల ఉపసంహరణ, సుస్థిరపరిపాలన నెలకొల్పడం మొదలైనవానిలో పాకిస్తాన్‌కి భారతప్రభుత్వంతో సమానప్రతిపత్తి నిచ్చి, ఆ మధ్యవర్తి నిర్ణయించేప్రకారం విధిగా అంగీకరించాలని చెప్పడమన్న మాట. దీనికే అంగీకరించవలసిందని ట్రూమన్, అట్లీలు ఒత్తిడి తెస్తున్నారు. పాకిస్తాన్ అంగీకరించగందంటే ఆశ్చర్యం లేదు. కాని భారతప్రభుత్వ అంగీకరించడం కష్టం. అంగీకరించినట్లయితే షేక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని వెన్నులో పొడిచినట్లే.

కులాసా కబుర్లు

"ఏక్ దో తీన్ చార్"

[జి. యన్. సూరి]

మన రాజ్యాంగ పరిషత్ కార్యక్రమం ఎప్పటికి ముగుస్తుందో ఎవ్వరూ చెప్పలేకుండా ఉన్నారు. తాబేళ్లకు, నత్తగుల్లలకు మించిన మందగమనంలో నడుస్తున్నది. ఇత్యాది జంతుజాలాలమాదిరి నడిచినా ఎప్పటికో అప్పటికి గమ్యస్థానాన్ని చేరవచ్చునని ఆశించవచ్చు. కాని సముద్రపు ఒడ్డున ఎండ్రకాయలమాదిరి ముందుకు పోకుండా ఆప్రక్కనుంచి ఈప్రక్కకు పాకులాడుతున్నది. అంతే గాదు; మనపైపు బొడుగలకు పోయే జట్కాగుర్రాలలాగా వెనకకు నడవటంకూడా కద్దు.

అసలు పరిషత్ సభ్యులకు త్వరగా పని ముగించటం ఇష్టం లేదన్నట్లు మనలాంటివాళ్లకు స్పష్టంగా తోస్తుంది. ముసాయిదాలు, సబ్ కమిటీ రిపోర్టులు, అధికార అమెండుమెంట్లు అనధికార సవరణలు, పాయింట్ అఫ్ ఆర్డర్లు, అధ్యక్షుల రూలింగ్సు, అనంతమైన చర్చలు, అతిదీర్ఘమైన ఉపన్యాసాలు కోరం లేకపోవటం,—ఒకటేమిటి? ముందుకు నడపటానికి ఎన్నివిధాల ప్రతిబంధకాలు ఉంటాయో వాటి నన్నిటినీ పూర్వం అస్త్రాలను సంధించినట్లు మన ప్రతినిధులు ప్రయోగిస్తున్నారు. నివసించేందుకు అన్ని సౌకర్యాలూ ఉన్న కాన్స్టిట్యూషన్ భవనం, రోజుకు నలభైఅయిదు రూపాయల భత్యఖర్చు, సబ్‌కమిటీ అలవెన్సులు మొదలైన లాంఛనాలతో నిత్యమేజువాణీగా వ్యవహరిస్తున్నారు.

పాఠశాలలలో చిన్నతరగతులకు డిబేటింగు క్లాసులమాదిరి ఉంటున్నది వ్యవహారం. విద్యార్థులు చర్చించటానికి కొన్ని మామూలువిషయాలు ఉంటాయి. ఆరోగ్య ఐశ్వర్యములలో ఏది గరీయసి? కత్తీ కలములలో ఏది బలీయమైనది? దేవుడు ఉన్నాడా లేడా? శాకాహారం మాంసాహారం, వీటిలో ఏది ఉత్తమం? ఇటువంటి విషయాన్ని తీసుకుని కొంపమునిగి పోయినట్లు బల్లదగ్గర నుంచుని అవాకులు చవాకులు ప్రేలుతారు.

మన పరిషత్ సభ్యులు ఈ విద్యార్థులనే ఆదర్శంగా ఏర్పరచుకున్నట్లు కనబడుతుంది. మనదేశంపేరు ఇండియా అని ఉంచవచ్చునా లేక భరతవర్షమనో, భారత్ అనో లేక హిందూస్తానం అనో మార్చవలెనా? రాష్ట్రభాషగా హిందీ ఉండాలా లేక హిందుస్తానీ ఉండాలా? హిందీ అయితే సంస్కృతభూయిష్ఠమైనదా లేక ప్రాకృతపూరితమైనదా? నాగరిలిపి, ఉరుదులిపి, రోమనులిపి, వీటిలో దేనిని ఎన్నుకోవాలి? జాతీయగీతంగా ఉంచవలసినది జనగణమనా లేక వందేమాతరమా? ఇత్యాది అంశాలమీద గంభీరోపన్యాసాలను ప్రకటనార్థం ప్రయోగిస్తున్నారు. ఈ చర్చలకు తెంపు అనేది కనబడదు. పాతవి ముగిసిన వనుకుంటే కొత్తవి తయారవుతున్నవి.

విద్యార్థుల డిబేటింగు క్లాసులలో కొన్ని సుగుణాలు ఉంటున్నవి. పరిమితిని మించి ఏ కుర్రవాడూ మాట్లాడడానికి వీలు లేదు. కావలసిన కోరంలేదని చర్చలు హఠాత్తుగా ఆపవలసిన అగత్యంలేదు. చర్చ జరుగుతున్నప్పుడు ఎవ్వడూ నిద్రపోటానికి తగిన సౌకర్యంగాని, నిబ్బరంగాని ఉండదు. టీచరుగారి బెత్తంపుణ్యమా అని కార్యక్రమం యథావిధిగా వెళ్లిపోతుంది. మన రాజ్యాంగపరిషత్తులో ఇటువంటి అంతరాయాలకు అడ్డం ఏదీలేదు. అధ్యక్షుడి దండానికి భయపడరు. పార్టీ విప్‌కు లొంగరు. రెండున్నర కోట్ల రూపాయలు ఈ పరిషత్ మూలాన ఖర్చు అవుతున్నదనే విషయాన్ని సరకుచేయరు.

గతవారంలో జరిగిన పార్టీసమావేశచర్చలు అందరూ పత్రికలలో చదివే ఉంటారు. సంఖ్యలు ఇప్పటిమాదిరి అరబిక్ విధానంలో ఉంచవచ్చునా లేక హిందీ సంఖ్యలను ఉపయోగించాలా అనే విషయం మగ్గానికి ఎక్కించారు. మనకు అరబిక్ సంఖ్యలతో ఎంతమాత్రం నిమిత్తం ఉండకూడదు. హిందీవే ఉండాలన్నారు చప్పాతీలవాళ్లు. ఏక్ దో తీన్ చార్ మాకు వద్దయ్యా బాబూ ఇప్పటి ఒకటి రెండు మూడును అట్లాగే ఉంచమన్నారు గోంగూరవారు, సాంబారు వారూను. అసలు అరబిక్ సంఖ్యలు మన దేశంనుంచి రవాణా అయినవే నని శాస్త్రపరిశోధకులుకూడ హెచ్చరించారు. నెహ్రూ పండితుడు అంతర్జాతీయ ఆనువాయితీనిబట్టి ఇప్పటి అంకెలనే ఉంచమని సలహాఇచ్చాడు. కానీ పరోటాలవాళ్లు లొంగక బిగుసుకున్నారు. గోంగూరసాంబారులు ఈ సందర్భంలోనైనా మిళితమై ఈ మార్పుకు ఒప్పుకోమని భైటాయించారు.

చేతులు చేతులు కలుసుకునేంతరకూ చర్చలు జరిగినవి. ఏవర్గంవారూ మెత్తబడలేదు. రాజీ ప్రయత్నాలు విఫలమైనవి. ఓటుకు పెట్టవలసిందే నన్నారు ఉభయులూ. పట్టుదలతో కాన్వాసింగ్ బయలుదేరింది. గోధుమలు తినే ప్రతివాడు ఏక్ దో తీన్ అనవలసిందే నన్నారు ఔత్తరాహికులు. బియ్యం మింగే ప్రతివాడు ఒకటి రెండు మూడు అనవలసిందే నన్నారు దాక్షిణాత్యులు. ఓటింగు జరిగింది దురదృష్టవశాత్తూ ఒక్కొక్క పక్షానికి 77 ఓట్లు సమానంగా వచ్చినవి.

రెండుపక్షాలకు ఓటింగులో సరిసమానంగా ఓట్లు వచ్చినప్పుడు అటో ఇటో నిర్ణయించే ఓటు అధ్యక్షుడికి ఉంటుంది. ఆనాడు ఎవరు అధ్యక్షత వహించినా ఈ విషయం తేలిపోయేది. కాని కుర్చీలో కూర్చున్నది డాక్టరు పట్టాభిసీతారామయ్య పంతులుగారు. పుటకవల్ల

(21 వ పేజీ చూడుడు)

మనరాష్ట్రం, మనదేశం

(9-వ పేజీ తరవాయి)

...లకు రావచ్చు. ఆవిషయంజోస్యంతో మనకు పనిలేదు.

వచ్చినపుడు రాష్ట్రాన్ని దక్షతతో నడప డానికి ఆర్థికసంపదాభివృద్ధిమార్గాలను ఇప్పటి నుంచి ప్రతిఆంధ్రుడూ ఆలోచించవలెను.

ఆంధ్రరాష్ట్ర ఆర్థికబలం :

ఆ తరువాత శ్రీ గోపాలరెడ్డిగారు ఆంధ్ర రాష్ట్ర ఆయవ్యయాలగురించిన ఈ క్రింది వివరాలను ఆంధ్రపత్రికకు ఇచ్చారు. ఇవి 1947-48 ఆయవ్యయాలపట్టీఆధారంపైన తయారు చెయ్యబడినవి.

1947-48

	జమ లక్షలలో	ఖర్చు లక్షలలో	జనాభా లక్షలలో
1 విశాఖ	225.34	117.91	38 46
2 తూ॥ గోదావరి	246.60	104 22	21.62
3 ప॥ గోదావరి	168.88	61.36	13.80
4 కృష్ణా	192.97	99 62	14 44
5 గుంటూరు	176.03	138 29	22 77
6 నెల్లూరు	79.74	103 20	16 17
పై ఆరూ	1089.56	624.60	127 26
7 కడప	44.90	69 48	10 57
8 అనంతపురం	46.02	72 62	11.72
9 బళ్లారి	59.06	85.39	10 51
10 కర్నూలు	58.85	77.03	11 46
11 చిత్తూరు	45.09	80.24	16 32
పై ఐదూ	253 92	384 76	60 58
పై పదకొండూ	1343 48	1009.36	187.84
12 ఉ॥ ఆర్కాటు	109 77	145 12	[illegible] 77
13 చెంగల్పట్టు	150.33	136.38	18 24
14 ద॥ ఆర్కాటు	214.37	141.36	26 09
15 తంజావూరు	220 96	130.77	25 63
16 తిరుచిరాపల్లి	158. 28	140.92	21 94
17 మధుర	195 48	145 76	24 47
18 రామనాథపురం	115 25	100 64	19 80
19 తిరునల్వేలి	196 43	145.12	22 44
20 కోయంబత్తూరు	193 87	190 54	28 10
21 నీలగిరులు	40.30	64 03	2 10
22 సేలం	115 04	122 87	28 69
పై పదకొండూ	1710.08	1463 91	243 27
పై 22 జిల్లాలు	3053.56	2473 27	431 11

మద్రాసు రాజధాని 25 జిల్లాలలోను దక్షిణ కన్నడ, మలబారు, మద్రాసు జిలాలు మూడింటినీ వదలగా, మిగిలిన 22 జిల్లాలలోను ఆదాయము రూ 3053 56 లక్షలు. ఖర్చు 2473.27 లక్షలు అనగా తెలుగుజిల్లాలు 11, తమిళజిల్లాలు 11 మొత్తం 22 జిల్లాలలోను 80% ఖర్చవుతున్నది.

తమిళజిల్లాలు 11 నుంచీ ఆదాయము రూ 1710 08 లక్షలు ఖర్చు రూ 1463 91 లక్షలు అనగా ఖర్చు 86%.

తెనుగుజిల్లాలు 11 నుంచీ ఆదాయము రూ 1343.48 లక్షలు ఖర్చు రు. 1009 36 లక్షలు అనగా ఆదాయంలో వ్యయం 75%.

ప్రత్యేకము 11 తెనుగుజిల్లాలలోను ఉత్తరసర్కారు లనబడు ఆరుజిలాల కున్నూ ఆదాయము 1089.56 లక్షలు ఖర్చు 624.60 లక్షలు అనగా వ్యయము, 60%.

రాయలసీమ

రాయలసీమ అనబడు 5 జిల్లాలమీదనూ ఆదాయము రూ 253 92 లక్షలు, వ్యయము రూ 384.76 లక్షలు అనగా వ్యయము 151%. ఆదాయపు అంకెలలో 1947-48 సంవత్సర మధ్యములో గుంటూరు, నెల్లూరుజిల్లాలలో మద్యనిషేధము అమలుపరచబడిన సంగతి జ్ఞాపకముంచుకొనవలెను. అప్పటికే రాయలసీమలో మద్యనిషేధము అమలులో ఉన్నది. తమిళజిల్లాలలోగూడా సంవత్సరమధ్యములో కొన్నిటియందు అమలు పరచబడెను.

ఉత్తర సర్కార్లలో నెల్లూరు లోటుజిల్లా. రాయలసీమజిల్లాలు అన్నియూ లోటుజిల్లాలే. తమిళజిల్లాలలో ఉత్తరార్కాడు, సేలం, నీలగిరులు లోటుజిల్లాలు. మొత్తము తమిళ తెలుగుజిల్లాలు 22 నుండి వచ్చు ఆదాయములో 31% తెనుగు జిల్లాలమీదను 48% తమిళజిల్లాలమీదను వెచ్చింపబడుచున్నది.

దక్షిణ కన్నడ జిల్లా ఆదాయం రూ 109.43 లక్షలు వ్యయము 86 47 లక్షలు. మలబారు ఆదాయం 237 94 లక్షలు వ్యయము 284 44 లక్షలు.

[సీతారాం]

కులాసా కబుర్లు

(20-వ పేజీ తరువాయి)

గోంగూర వాడైనా రాష్ట్రపతి ఎన్నికల సందర్భంలో గోంగూరను కావేరిలోనో గంగ ...గయలోనో విసవటం జరిగింది. దరిమిలా ...పట్నం విషయంలో తెలుగువాళ్లకు ...ంత దూరం కావటం సంభవించింది.

మొత్తంమీద పట్టాభి సీతారామయ్య పంతులుగారికి క్లిష్టసమస్య ఏర్పడ్డది. విడూ అంటే పాముకు కోపం, కరూ అంటే కప్పకు కోపం. ఏక్ దో తీన్ చార్ ఎంత చేస్తివే అని చాలా సేపు పంతులుగారు విచారించారు. ఏదో నిర్ణయం చేయక తప్పదు. ఆలోచించే కాలయాపనకు అవకాశం లేదు. ఏదైనా సలహా ఇస్తాడేమోనని కళా వెంకటరావుగారి వంకకు చూశాడు రాష్ట్రపతి. అట్లా చూస్తాడని ఎరిగి నందువల్ల కాబోలు కాంగ్రెస్ కార్యదర్శి ఏదో మునుచుకుపోయినట్లు ఆఫీసుఫైళ్ల చాటున ముఖం దాచుకు కూర్చున్నాడు.

డాక్టరుగారు యుగంధరుడికి ఉపాయంలో ఎక్కడా తీసిపోరు. నొప్పించక తా నొవ్వక తప్పించుక వ్యవహరిస్తేనేగాని గొడవ తప్పదని గ్రహించారు. బందరులో గద్దెమీద కూర్చుని తీర్పు చెప్పిన పంచాయితీలు జ్ఞాపకానికి వచ్చినవి. ఒక్క చిరునవ్వు నవ్వారు.

"ఇటువంటి ప్రధానాంశాన్ని నా కాస్టింగ్ ఓటుతో నిర్ణయించటం భావ్యం కాదని నేను తలుస్తున్నాను. అందువల్ల ఈ విషయాన్ని పార్టీ నిబంధనలతో ప్రమేయం లేకుండా వ్యక్తిగతంగా నిర్ణయించవలసినదని కోరుతున్నాను. రాజ్యాంగపరిషత్‌లోనే ఎవరికి తోచినట్లు వారు ఓటుచేసి నిర్ణయించవచ్చు. నేటికి సభ చాలించడమైనది;" అన్నారు. అందరూ చప్పట్లు కొట్టారు. బతికి బయట పడ్డానురా భగవంతుడా అని డాక్టరు పట్టాభిగారు ఒక్క నిట్టూర్పు విడిచారు. ఎవరింటికి వాళ్లు వెళ్లారు.

తరువాత కథ రాజ్యాంగపరిషత్‌లో చూసి ఆనందింతాం.

కూలీ

(11-వ పేజీ తరువాయి)

తంగా గంగాధర్రావు గంభీరంగా వచ్చాడు. కోడలిని కేకవేసి గోనె అందుకొని వాకిటపరచి 'మా బాబులు సాలాకాలానికి వచ్చినారు. కూసోండి' అంటూ అతివినయంగా గౌరవించాడు.

ఎదురుగా నిల్చొని రెండు చేతులతో లాటీ పట్టుకొని 'ఏంటిరా షేలావ కుర్రాడితో' కర్కశస్వరంతో అన్నాడు సబిన్సుపెక్టరు.

జవాబీయక ఆ చీకటిలో సబిన్సుపెక్టరు ముఖంవేపు దీక్షగాచూస్తున్నాడు బంగారయ్య.

'వధవా...నిన్నేరా'

ఎగాదిగా ఒకసారిచూసి మెల్లగా అన్నాడు. 'నా కొడుకు గుడిసె కదలొద్దన్నాడు. కదిత్తె సంపెస్తనన్నాడు కడుపుకి తిండి...ఒంటికిబట్ట యిస్తున్న నా కొడుకన్న యినసపెక్టేరు యెచ్చా—!

యిప్పుడు నలుగురూ పిలుస్తున్న అహంభావమైన వాగుడు వినిపించుకోకుండా ఆ గంగడి వేపు ఆశ్చర్యంగా చూస్తునే వుబికే వుత్సాహంతో వణికిపోతూ కుడిచేతిని సబిన్సుపెక్టరు చెంపమీదికి పోనిచ్చాడు ఆ చీకట్లో.

ఒక్కసారిగా బంగారయ్యమీద నలుగురి చేతులు పడ్డాయ్. అప్పుడే వస్తున్న కొడుకు గొంతుకకూడ కలిసింది—'యెదవనాయన. యెమ్మాతిగ్గూ నేకండా బాబునే...సంపండి.'

బంగారంచేతులు బంధింపబడ్డాయ్. బలవంతాన యిన్సెపెక్టరుగారింటికి తీసుకపోయారు. అప్పన్నమంచంసగ్గర నిలబెట్టారు. అప్పన్న లేరి జూడటంతో అలా మంచంమీద కూర్చుండిపోయాడు.

అప్పన్న లేవాలని ప్రయత్నించాడు. కాని లాభం లేకపోయింది. ముఖం దించుకొని వున్న బంగారయ్యవేపు చూసాడు. హీనస్వరంతో అన్నాడు. బంగారం...ఏడస్తన్నావురా...... కూతురు నేవనేకదా...నా కొడుకు...నీకూతుర్ని ...సంపాడు. ఆ పాలన్నీ...యీడే తాగేసినాడురా...సెమించరా'

బంగారయ్యశరీరం జలదరించింది. గొంతుకలో కంపనం బయలుదేరింది. 'ఒరే అప్పిగా' అన్నాడేగానీ కళ్లు మూసుకున్నాడు. అప్పన్న కార్చే కన్నీటిని చూడకుండానే జారే కన్నీటితో 'సిన్నప్పుడు మన్ను తిన్నాడని పాలు తాగుతున్నోడి బుగ్గమీద సిన్న లెంపతేస్తే 'కయ్‌' మన్నాడురా...ఆ గంగడే అను కోని బుగ్గమీద సెయ్యేస్తే దుమ్ము విరగ్గొట్టాడురా... నా కొడుకు నన్నే తిట్టాడురా...నా కూతురైతేనో యేడిసి అడ్డుకోదురా...'

యీ మాటలు వినగలిగిన అప్పన్న జబాబు మాటలద్వారా యీయలేకపోయాడుగాని పెద్ద పెట్టున యేడ్చుకుంటున్నాడు.

ఏడుస్తున్న అప్పన్నను జూచి 'సా...యేడమాకురా యెర్రోడా...పెళ్లాం సచ్చినాడు అలానే యేడ్చినావ్...ముసిలోడివి యిప్పుడూ అంతే...సా...యేడమాకురా...నివ్వేడిస్తే నాను సచ్చినట్టు...సా...అదేంటిరా నాను సస్తే నామీదపడి యేడస్తావురా ఆడదానినాగ... ఏడమాకురా...కోపం వస్తే కసాయోడికన్నా అధ్వానం...వూరుకోరా అప్పిగా...'

అప్పన్న గొంతుక మెల్లగా పెగిలింది...

'నివు...కాదరా...కసాయోడివి...బం... గా...రం...నివు...సావొద్దు...నాను పడి యేడొద్దు...నా మీద పడి...యేడమాకురా... నన్నూ...నా కొడుకుని...తి...ట్టు...కో...ని పో...రా...ఎలి...పో...రా...బం...గా... రం...బం......'

'ఏంమాట సెప్పినావురా...నీకొడుకోటే నా కొడుకోటా! తెలిసో తెలీకో తప్పు సేసినాడు. తిడతానా? తప్పని మనలాంటి తెలిసినోలు సెప్పొద్దూ...నిన్నూ...గోడు...సెగ రా...సే... నీకేం రోగం...సే...'

అప్పన్న లేవలేరుగాని అప్పన్నమీద పడి యేడ్చే కోడలివేపు చూస్తూ తనమీదే ఎవరో పడి ఏడుస్తున్నట్లు భ్రమపడ్డాడు బంగారయ్య... ఒకకూలీ.

సమితి

(8-వ పేజీ తరువాయి)

యాన్ని కాశికావృత్తిలోని - "దేవదత్తో గ్రామణీ రేషాంత ఇమే దేవదత్తకాః."5.3.112. ఈ పంక్తి వ్యక్తీకరిస్తోంది.

కేంద్రశాసనసభ ఒక యుద్ధాన్ని ప్రకటించేందుకైనా, ఎదిరిపక్షంతో సంధి చేసుకొనేందుకైనా, గ్రామపరిషత్తుల అనుమతులను బడయగలగాలి. ఈ విషయము తైత్తిరీయ సంహితలోని ii 1-8-4. పంక్తిని చూస్తే బాగా బోధపడుతుంది. ప్రజాప్రభుత్వ సంస్థఅయిన ఆసమితి నిర్మాణానికి ఆ రోజులలో కేవలం గ్రామాలే ముఖ్యమైన పునాదులనే సారాంశం ఒకటి ఇప్పుడు వ్యక్తమయింది.

దేశానికి పల్లెటూళ్లు అనేవి ఎంత ఆయువుపట్లో ఇప్పుడు బాగా వ్యక్తమయింది. ఇందుచేతనే గాంధిమహాత్ముడు గ్రామపునరుద్ధరణ కావాలంటూ బల్లగుద్ది చెప్తూ ఉండేవాడు. ఏవిధమైన బాలారిష్టాల్నీ గండాల్నీ చూడకుండా సంపూర్ణారోగ్యంతో శతాబ్దాలుకాలదీ నిరాఘాటంగా సంచరించగలిగింది ఈ సమితి భరతఖండంలో. అంటే వేదయుగమంతా నిరాక్షేపంగా ప్రకాశించిందని దీని అర్థము. ఎంత దీర్ఘాయుర్దాయమో!

ఈ సమితి ప్రజాపతి కూతురని వ్యవహరింపబడుతూ ఉండేది. ఇపుడిక, ఆయనకెంత పూర్ణాయువో ఈవిడకుకూడా అంత పూర్ణాయువే అని పాఠకులు నిశ్శంకగా నిశ్చయించుకొనవచ్చును.

జాతక కథల యుగారంభంనాటికి, అనగా క్రీస్తునకుపూర్వము 600 సం॥లనాటికి సమితి విశ్రాంతిగృహానికి చేరుకొన్నట్లుగా దాఖలాలు కనిపిస్తున్నాయి.

నాకబలి

(5-వ పేజీ తరువాయి)

"ప్రభా! నువ్వు వెళ్లిపొమ్మన్నప్పుడు వెళ్లితే నీ స్థితిని ఇంత రసాభాసగా చేసేవాడిని కానేమో?"

ప్రభావతి దీనంగా చిరునవ్వు నవ్వింది. "ఇప్పుడు విచారిస్తున్నావా! పోనీ ఇప్పుడైనా నీ పరిస్థితి విషమించకముందే వెళ్లిపో!"

చిరుకోపమూ, చిరువిచారమూ అలముకొన్న కంఠంతో అన్నాడు. "ప్రభా నా విషయమే ఆలోచిస్తూన్నానా!"

అతని మెడచుట్టూ చేతులు గీలించి, అతని జుట్టులో వేళ్లు పోనిచ్చి, చిక్కుదీస్తున్నట్టుగా గీరుతూ—

"కాదు రాఘవా! అందుకే నా విచారం. నీ స్వార్థం సరిగా చూసుకొనే జాగ్రత్త నీకు లేదు. అందుకనే నాకు బాధా విచారమూను."

"నా స్వార్థలోభంవల్లనే కదా ఈనాడు నిన్నీ దుస్థితిలోకి తెచ్చాను."అని తల వాల్చాడు.

"పిచ్చివాడా నా దుస్థితి నువ్వు తెచ్చింది కాదు. నాకు నేను తెచ్చుకొందే. నువ్వు నిమిత్తమాత్రుడవే అయ్యావు."

"అంతేనా!"—మొగం తిప్పి అంటున్నాడు.

ఆ మాట అన్నిటికన్నా జాలిగా వినబడింది ప్రభావతికి. మొగం తనవైపుతిప్పుకొంది కాదని క్రియారూపంగా ప్రత్యుత్తర మిచ్చింది.

వెలుగు

ఆహారోత్పత్తివృద్ధి: కొన్ని సూచనలు

1951 ఆహారోత్పత్తి ప్రోగ్రాము జయప్రదముగా నిర్ణీత కాలములో కొనసాగవలెనన్న, ఉత్పత్తిదారుల సహకారము అత్యవసరము. ఇందుకు గ్రామములో భూమి కలిగిన వ్యవసాయదార్లకు ఆ జవాబుదారీ పని ఒప్పచెప్పవలెను. వారిలో కొందరిని ఒక కమిటీగా ఏర్పాటుచేసి గవర్నమెంటు సాగించనున్న ప్రోగ్రామునిర్వహణ వారిష్టప్రకారం జరుపవలెను. ఇప్పటికిని ప్రభుత్వం ఆరీతిగా వారల సహకారమును పొందుటలేదు. ఇది గొప్ప లోపము. ఈ లోపము తీరనంతవరకు ఈ ప్రోగ్రాము సరిగా కొనసాగుటకు అవకాశము తక్కువ. కమిటీ అనగానే వెనుక ఏర్పడి మానివేయబడిన ఆహార కమిటీలు జ్ఞప్తికి వచ్చును. ఆహారకమిటీలు నిర్వహించుటలో జరిగిన లోపము లేవో గుర్తెరిగి దిద్దినయడల అవి సక్రమముగా నడచును. గవర్నమెంటుడిపార్టుమెంట్లు ఏ పాత పద్ధతులలో నడపబడుచున్నవో ఆ రీతిగానే ఆహార కమిటీలను ఆ డిప్యూటీ కలక్టెరు, కలక్టర్లు నడపుటయు, అసలు ఉద్దేశ్యయ తప్ప తక్కిన వ్యవహారములలో వారలకు శ్రద్ధాభక్తులు ఏర్పడి రాజకీయ పార్టీ విభేదములను పురస్కరించుకొని నడుపుట వలన ఉపయోగపడలేదు.

గ్రామములు రెండు ముఖ్య తెగలు. మెట్టవూళ్లు, మాగాని వూళ్లు. మెట్టవూళ్ళల్లో జనాభాకు తగినట్లు ఆహారపైర్లు వేయు బాధ్యత ఆ వూళ్ళకమిటీలకు పెట్టవలెను. మాగాని వూళ్ళలో అన్ని భూములకు కావలసిన 'పై ఎరువులు' సప్లయిచేయుట, ఈరెండు పనులు జరుగునట్లు బాధ్యతవహించిన కమిటీయు వ్యవసాయ డిపార్టుమెంటు చేయవలెను. ఈ బాధ్యత ఇప్పటి పద్ధతులలో గవర్నమెంటు తరఫున వ్యవసాయ డిపార్టుమెంటు, రయితుల తరఫున గ్రామకమిటీకి ఒప్పచెప్పక పోవుటయు, సక్రమముగా ప్రతి నెల ఎంత జరుగుతున్నదో చూడకపోవుటయు తటస్థించుచున్నది.

గ్రామములో వ్యవసాయము లేనివారల ఒత్తిడి భూఖామందులమీద ఎక్కువ. భూమి ఆహారధాన్యముల ఉత్పత్తికి వినియోగించునట్లు చేయుటకుగాను ఆ కమిటీలలో వారి తరఫున కొద్దిమందిని ఉంచుట భావ్యము.

సాధారణముగా చీడలవలన సగమునకుపైగా పైర్లకు నష్టము కలుగుచుండును. సకాలములో రయితులకు అందుబాటులో మందులుగాని, పరికరములుగాని సప్లయిచేయతగిన డిపార్టుమెంటు వారుగాని కనపడరు. కనుకనే డిమాన్స్ట్రేటరుకు గ్రామభూములకు సన్నిహితముగా వచ్చు బాధ్యత, అవకాశములు కల్పించవలెను. ఇప్పుడు ఈపని జరుగుటలేదు. వ్యవసాయ పనులుచేసి చూపించ తగిన వ్యవసాయ సిబ్బంది దాపున గ్రామములలో రయితులకు అందుబాటు కావడం లేదు. ఇందువలననే డిమానుస్ట్రేటరుకు కంట్రోలు వస్తువుల అమ్మకం పని తీసివేసి తన సిబ్బందిని మందులు వగైరా పరికరములతో గ్రామములలో నివసించు పనివాళ్లను నియమించవలెను. గ్రామములకు శీఘ్రగతిన రాకపోకలు జరుపుటకును, ఉండుటకు భోజనవసతులకు తగిన పబ్లికు స్థలములు లేకపోవుటచేత డిమానుస్ట్రేటరుకు గుర్రముల సప్లయిచేయుట అవసరము. పైతనిఖీలకు ఉంచే పై ఆఫీసర్లను తగ్గించి గ్రామములకు అందుబాటుగా చిన్న సిబ్బందిని వృద్ధిచేయుట (ముఖ్యముగా వ్యవసాయ, పశు పక్ష్యాదివృద్ధికి, చికిత్సకు) అత్యవసరము.

కాంగ్రెసు రాజకీయ సంస్థలలో రాచరికపు ఆందోళనవ్యవహారవిధులకంటె చెట్లు నాటుట, కంపోష్టు చేయుట, ఆహార పైర్లు ఎక్కువ పండించు నిర్మాణకార్యక్రమపనులకు తమ మెంబర్లు ఎంతపని జరిపినారో దానినిబట్టి వారికి జవాబుదారీ స్థానములకు అర్హత గమనించునట్లు చేయుట యోగ్యము.

తా॥ పరమానందము

సినీ ఉద్యోగులు

ఆర్యా,

ఆంధ్రదేశంలోని సినీఉద్యోగుల అసోసియేషన్, యిప్పటికి సరిగా రెండు సంవత్సరాలకు పూర్వం, సర్వసభ్యసమావేశంలో అంగీకరించిన కనీసకోర్కెల మెమోరాండం, రాష్ట్రంలోని అన్ని థియేటర్ల యజమానులకూ, ఫిలిండిస్ట్రిబ్యూషన్ సంస్థలకూ, అధికారవర్గానికి అందజేసింది. ఆ విషయమై తిరుగ యజమానులకు రాష్ట్రవ్యాపితంగా విజ్ఞప్తిచేసినా, సమాధానం రాలేదు. పైపెచ్చు దీనిని సాకుగా తీసుకొని పనివారలను అనేక యిబ్బందులకు గురిచేస్తున్నారు.

పనివారలంతా, తమ సంఘ ఆదేశాలను జవదాటకుండా, ఫిలింపరిశ్రమకు ఏకాంచం హాని జరుగకుండా, కనీసకోర్కెలను యజమానులు అంగీకరిస్తారని కొండంత ఆశతో ఎదురుచూస్తూ, శాంతియుతమైన పరిష్కారానికి చూస్తున్నారు. కనీసకోర్కెల్లో, అంగీకరించుటకు అసాధ్యమైన కోర్కెలుగానీ, అంగీకరించుటవల్ల పరిశ్రమకు దెబ్బ తగులుతుందనే వాదనకు అవకాశంగానీ లేదని ప్రాజ్ఞులందరూ అంగీకరిస్తున్నా, వాటిని అంగీకరించి ఆచరణలో పెట్టుటకు రెండుసంవత్సరాలకాలం జాగుచేయటంవల్ల పనివారలలో తీవ్రమైన అసంతృప్తి పెరిగిపోతోంది.

పైవిషయంలో మామాజీకార్యదర్శి, ఆర్గనైజర్లు యిద్దరూ పరిస్థితులను లేబరుకమీషనర్ గారికి విపులీకరించగా, మధ్యవర్తిసంఘంతో గూడిన కోర్టునొకదానిని ఏర్పరచి, అవుసరమైన సహాయం చేస్తానని ఉభయ మిచ్చియున్నారు. గౌ॥ మంత్రి శ్రీ భక్తవత్సలంగార్ని, విజయవాడ 11-6-49 న వచ్చినప్పుడు మా కార్యదర్శి కలుసుకు యీ విషయాల నన్నింటినీ మంత్రివర్యుల దృష్టికి తీసుకరాగా, సానుభూతితో ఆలకించి, "అవుసరమైన సహాయం చేస్తాననీ, కార్మిక మంత్రిగార్కికూడా శిపార్సు చేస్తాననీ" సెలవిచ్చారు.

గాన ప్రభుత్వం, వెంటనే కార్యాచరణకు కదలి, మద్రాసుసినిమాపనివారల విషయంలో ఏర్పరచిన విధంగానే, ఒక మధ్యవర్తిసంఘాన్ని నియమించి పని ప్రారంభించవలసిందిగా అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరుతోంది. వెంటనే కదలి ప్రభుత్వం పనిచేయులాగున, పనివారలంతా సమావేశాలు జరిపి, తీర్మానాల ద్వారా, టెలిగ్రాంద్వారా ప్రభుత్వాన్ని కోరుతూ, ఆ విషయాన్ని వెంటనే అసోసియేషన్ఆఫీసుకు తెలియజేయగోర్తాం.

ఎస్. రామచంద్రరావు
ఆంధ్ర సినీ ఎంప్లాయర్స్ ఎసోసియేషన్
సహాయ కార్యదర్శి

రష్యనిజం- మానవాభ్యుదయం

(6-వ పేజీ తరువాయి)

ఆశయం లార్డ్ యార్టక్ చెప్పినట్లు స్వేచ్ఛను అరికట్టుతుంది. వృత్తంలోని రేఖలు వృత్తపరిధిచే నిర్ణయింపబడునట్లు, సమానత్వం ఆశయంగాగల సమాజంలోని వ్యక్తుల ఆంతరంగిక శక్తుల స్వేచ్ఛాభివృద్ధి సమాజాదేశాలవల్ల అరికట్టబడుతుంది. దేశంలో మూసపోత జరుగుతుంది. (యూనిఫార్మిటీ ఏర్పడుతుంది) స్వతంత్రశక్తి నశిస్తుంది. ఆంతరంగిక శక్తుల ప్రోత్సాహం ప్రకారం స్వచ్ఛందంగా పురోగమింపలేని వ్యక్తులు ఆత్మవంచకులౌతారు, సమాజభయంవల్ల. ఆత్మవంచకుల సమాజం ఆదర్శప్రాయమైనది కానేరదు.

ఇట్టి పరస్పర వైరుధ్యాలతో కూడిన తాత్విక పునాదితోనూ మానవత్వంపై కత్తిగట్టిన ఆశయాలతోనూ, నియంతృత్వసాధనలతోనూ ప్రపంచాధిపత్యానికి రష్యా అఱ్ఱులు చాస్తోంది. కార్యక్రమం కూడా సాగించింది. రాజకీయంగా స్వేచ్ఛారహిత రాజ్యం ద్వారా స్వేచ్ఛారాజ్యాన్ని స్థాపించడమే రష్యా ఏకైకఆశయం. ఆ ఆశయం ఎలా సాధ్యంకాదో చూచాం. రష్యాలో స్టాలిన్ నియంతయైనప్పటినుండి పరిస్థితులు తారుమారైనై, 'జాకోబినిజా'నికి నెపోలియన్ చేసిన 'మహాపకారం, బోల్షివిజానికి స్టాలిన్ చేశాడు. స్టాలిన్ అన్నివిధాలా ఉక్కుమనిషి అనే బిరుదానికి తగ్గిపోయాడు! బూర్జువా ప్రభుత్వభయం సాకుతో యుద్ధవాదానికి దారి తీసి రష్యాలో కమ్యూనిస్టు నియంతృత్వాన్ని సుస్థిరం చేశాడు. ప్రపంచాధిపత్యం రష్యాకు కట్టబెట్టడమనే ఆశయంతోనే రెండవ ప్రపంచసంగ్రామంలో ప్రవేశించాడు స్టాలిన్. యుద్ధంలో రక్తం చవిచూచిన 'రెడ్ ఆర్మీ'కి రక్తదాహం అధికం కాజొచ్చింది. విజయగర్వంతోపాటు రష్యనులలో జాతీయోద్రేకం జన్మించింది. రష్యా ఆధిపత్యానికి పూర్తిగా సమ్మతించని కమ్యూనిస్టులే మాయ మౌతున్నారు. డెమిట్రావ్ అకస్మిక మరణమూ, టిటో బహిష్కరణ ఇందుకు నిదర్శనాలు కాదా? శ్రామికవర్గం, దోపిడీవర్గం అని మానవకోటిని రెండుజాతులుగా మార్క్సు విభజించిన విధానం పోయింది. ప్రపంచాన్ని పాలించటానికి రష్యన్‌జాతి ఉద్భవించింది. అంతేగాదు. అధికారపదవులకు వారసత్వం కూడా ఏర్పడుతోంది. క్రమంగా నెపోలియన్ లాగానే స్టాలిన్‌గూడా రష్యన్‌సామ్రాజ్య చక్రవర్తి బిరుదాన్ని ధరించ దనడానికి ఆధారం ఏముంది?

జాతీయవాద యుద్ధవాదాలు సామ్రాజ్య వాదానికి దారితీసినై. దీనితో స్టాలిన్ అంతర్జాతీయరంగంలో జరిగే నూతనపరిణామాలకు అంధుడైనాడు. యుద్ధఫలితంగా ప్రతి దేశంలోనూ ఒక ప్రత్యేకవర్గం బయలుదేరింది. రెండవ ప్రపంచయుద్ధానికి పూర్వం పార్లమెంటరీ డెమాక్రసీ పతనమైనప్పటినుండీ 'ఫాసిజమే' తరణోపాయంగా నమ్మినవారు యుద్ధానంతరం ఫాసిజాన్ని నిజస్వరూపంలో గ్రహించి ద్వేషింపసాగారు. కాని యుగాలతరబడి మానవుడు నిర్మించిన నాగరికతాసౌధాన్ని కూలద్రోయడమే ఆశయంగాగల కమ్యూనిజాన్ని వీరు సమంగా గర్హించారు. వీరే నేడు మధ్యవర్గంగా పరిగణింపబడుతున్నారు. ప్రజాస్వామ్యసూత్రాలపై ప్రపంచాన్ని పునర్నిర్మించాలనే వీరు ప్రతి దేశంలోనూ ఉన్నారు. మార్క్సుచేసిన సమాజ వర్గీకరణలో వీరి ప్రస్తావన లేదని స్టాలిన్ వీరిని కూడా బూర్జువాలక్రిందే జమకట్టాడు! కమ్యూనిజాన్ని ప్రజాస్వామ్య సూత్రాలపై పునర్నిర్మించ ప్రయత్నించినచో స్టాలిన్‌కు ఈ వర్గంబలం చేకూరేది. నాడు ప్రపంచనాయకత్వం వహించడానికి రష్యాకు అవకాశం లభించేది. కాని రష్యాలోని శక్తులు అందుకు వ్యతిరేకంగాఉన్నై. సహకారంపైని కాక సైనికబలంపైనే సామ్రాజ్యం నిర్మించినగాని రష్యాప్రతిష్ట ఇతోధికం కాదు. ఈ విధానానికే "రెడ్ నెపోలియానిజం" అన్నారు విజ్ఞులు. దీనికి నిదర్శనాలు లేకపోలేదు.

చెకోస్లావియా, ఆల్బేనియా దేశాలలో సోదర కమ్యూనిస్టులకు అధికారం సంక్రమింపచేయటం, గ్రీస్ కమ్యూనిస్టులు ప్రభుత్వంపై తిరుగుబాటు చేయడానికి ప్రోత్సహించడం రష్యా సామ్రాజ్యవాదాన్ని స్థిరపరుస్తున్నై. తన అరుపొజ్జలలో ఉండే దేశాలతో రష్యా ఇంతవరకూ సుమారు ఇరవైపైన సైనికసహకార ఒడంబడికలు చేసికొని పశ్చిమయూరప్‌రాజ్యాలు తమ ఉమ్మడిభద్రతకై కావించుకొన్న అట్లాంటిక్ ఒడంబడికను తూలనాడుతోంది. అన్నిటికీ మించినది, మార్షల్ ప్రణాళికను ప్రతిఘటించడం. ఈ ప్రతిఘటనలోని అంతరార్థం గ్రహించితే రష్యాగుట్టు బట్టబయలౌతుంది. యుద్ధఫలితంగా పశ్చిమయూరప్ రాజ్యాల ఆర్థికస్థితి చితికిపోయింది. తమ పాదాలపై తాము నిలువలేని స్థితిలోనున్న పీదేశాలన్నీ. బైటనుండి ఆర్థిక సహాయం ఈ దేశాలకు అత్యవసరం, అతి జరూరు. ఈదేశాల పునర్నిర్మాణానికి, మార్షల్ ప్రణాళికద్వారా ధనసహాయాన్ని సూచించింది అమెరికా. ఈ ప్రణాళిక అమలుజరిగినచో పశ్చిమయూరప్‌రాజ్యాలు అమెరికాపలుకుబడిలోకి పోగలవనే భయంతో రష్యా ఈ ప్రణాళికను ప్రతిఘటిస్తోంది. యుద్ధకాలంలో రష్యామాత్రం అమెరికావల్ల సాయం పొందలేదా? అంతమాత్రాన రాజకీయంగా అమెరికా ప్రాబల్యం రష్యాపై పడిందా? ఈదేశాలుకూడా స్వతంత్రంగా అమెరికా ఆర్థికసాయంతో పునర్నిర్మాణం సాగించి ఎందుకు సాధించరాదు? దీనిలోని ఆంతర్యంవేరు. కమ్యూనిస్టు సిద్ధాంతంప్రకారం, ఆఁజడిలోనే కమ్యూనిజం త్వరగా వ్యాపిస్తుంది. కల్లోలితజలంలో చేపల వేట కమ్యూనిస్టుకార్యక్రమం. ఆర్థిక క్లిష్టత వల్ల ప్రజలు బాధపడుతున్నా చావగా మిగిలినవారే కమ్యూనిజాన్ని స్వీకరిస్తారని రష్యా ఆశయం. అందుచే పశ్చిమయూరప్‌రాజ్యాలు ఆర్థికచిక్కులలో పడవలసినదే. ప్రజలు చావవలసినదే. వాటిని ఉద్ధరించడానికి పూనుకొన్న అమెరికా, రష్యాకు గర్భశత్రువు కావటానికి కారణం అదే. మార్షల్‌ప్రణాళికను ప్రతిఘటించడంలో రష్యావిధానం అసమగ్రసుజ్ఞనత్వం కాకపోతే - తనే ఏ మాలటావ్‌ప్రణాళికో తయారుచేసి ఆరాజ్యాలకు ఆర్థికసహాయం చేయకూడదా? ఆసన్న విపద్దశనుండి తప్పింపకూడదా? అప్పుడే దేశాలు విశ్వాసంతో రష్యాయందు స్నేహభావం వహించియుండవా? అసలుసంగతి అది కాదు. దేశాన్ని యుద్ధభయంలో ప్రతిష్ఠించితేగాని స్టాలిన్ సృష్టించిన "రెడ్‌ఆర్మీకి" ఆస్కారం ఉండదు. అతని అధికారం సుస్థిరం కాదు. అందుచే రష్యా వాంఛించేది ఆ దేశాల మేలుకాదు. ఆయా దేశాల్లో అరాజకం చెలరేగితే తమ అనుచరులను అందు పట్టాభిషిక్తులను చేయడం, ఏకచ్ఛత్రాధిపత్యం తనకు సంక్రమించడం జరుగుతుంది. ఈ సంఘటనలన్నీ పరిశీలించినచో రష్యా రాజకీయ సిద్ధాంతం అభివృద్ధిపథంలో పరిణామయుతమైన పురోగమనం కాదు. ప్రస్తుత వ్యవస్థలను నిర్మూలించి రష్యా ఆధిపత్యంలో కమ్యూనిస్టు ప్రపంచాన్ని సృష్టించే మహా ప్రళయం. అందుకై రష్యను లవలంబించేది కమ్యూనిజమూ కాదు, మార్క్సిజమూ కాదు; రష్యనిజం-స్టాలిన్ మేదస్సులో జనించిన ప్రతీపగామిని యంతృత్వసిద్ధాతం.


వైజ్ఞానిక రంగంలో రష్యనిజం విపరీతపు వింతపోకడలు పోతోంది. శాస్త్రంపై ప్రభుత్వాధికారంవల్ల, అధికారవర్గాలకు వ్యతిరేకంగా ఉండే అభిప్రాయాలకు అపాయం, శాస్త్రంలో పిడివాదం బయలుదేరగలదని 1932 లోనే హాల్డేన్ భయపడ్డాడు. రష్యా నేడు బూర్జువావిధానంపై యుద్ధం చేస్తోంది. కాబట్టి రాజకీయ ఆర్థికరంగాల్లోనే గాక అలంకారిక తాత్వికశాస్త్రీయ మార్గాల్లో కూడా బూర్జువా అభిప్రాయాలనూ పద్ధతులనూ। అంగీకరింపరాదనే నిర్ణయానికి వచ్చారు రష్యనులు. కేవలం, విమర్శించడానికి కూడా బూర్జువా అభిప్రాయాలనూ, తాత్వికాలోచనాపద్ధతులనూ ఎత్తగూడదు. ప్రతి సిద్ధాంతానికి సంఘర్షణాత్మకమైన భౌతికవాదవే మూలం కావాలి. అట్లు కానినాడు శిక్షయే. లెవిట్, ఆగాల్‌లు అంతులేకుండా పోయారు. వావిలావ్ అలా కాలేదని, సహజమైన మరణవే పొందాడని - కాని అకాలమరణం - కమ్యూనిస్టులు అంటున్నారు. వైశాంకోసిద్ధాంత వాదప్రతివాదనలు చెలరేగుతూనే ఉన్నై. నోబెల్ బహుమానం పొందిన *H. J.* ముల్ల వైశాంకోవాదంలో బలం లేదని ఋజువుచేస్తున్నాడు. ఇది ఇట్లుండగా 'అఖమటోవా' అనే కవయిత్రిని 'మురాడిల్లీ' అనే సంగీత విద్వాంసునీ, ప్రభుత్వాదేశానుసారం తమ కవిత్వరాగాలు, మార్చలేదనే నేరంతో ప్రభుత్వ ఇబ్బందుల పాలు చేసిందని తెలుస్తోంది. దీ సారాంశం, ప్రభుత్వంలో నున్న అల్ప సంఖ్యాకులు, తమ అధికారానికి పునాదులైన సూత్రాలతో సరిపోకపోయినచో శాస్త్రాన్ని లలితకలనూ గూడా ఆదేశించడానికి వెనుదీయరు రష్యాచరిత్ర రుజువు చేస్తోంది.

కమ్యూనిస్టుసిద్ధాంతంలోకి వ్యక్తుల స్వయపరివర్తనం కాదు రష్యా కాంక్షించేది, దౌర్జన్యపీడాఫలితమైన అంగీకారం. సూర్యుడే విశ్వాని కేంద్రమని చెప్పిన బ్రూనోప్రభృతులను మట్టుపెట్టిన రోమన్‌మతాధికారుల నిరంకుశత్వం నశించింది. కత్తి మొనపై మతాన్ని ప్రచారం చేసిన ఖలీఫాల దౌర్జన్యం- అంతరించింది. కాని మధ్య యుగలక్షణాలతో కరకమైన నియంతృత్వం అవతరించింది. మానవజాతిని ముందుకు గొంపోవుచున్న వెనుకకు మరలించుచున్నదో విద్యావంతు గ్రహించటం కష్టం కాదు.



గోదావరికోటిలింగక్షేత్రమున కీ॥ శే॥ కొండా వెంకటప్పయ్య పంతులుగారి అస్థినిమజ్జనదృశ్యం. కర్మకాండ జరుపుచున్నది శ్రీ వేదాంతం శంభు ప్రసాదశాస్త్రిగారు. (పంతులుగారి ప్రియశిష్యులు)

కీ॥ శే॥ కొండా వెంకటప్పయ్య పంతులుగారి అస్థినిమజ్జనము



పెన్నానదిలో దేశభక్తుని అస్థినిమజ్జనదృశ్యం. వెన్నెలకంటి రాఘవయ్య గారు కర్మకాండ జరిపించుచున్నారు.



గవర్నరు జనరలు రాజగోపాలాచారి కాంపౌండులో పండిన మొక్కజొన్నల పంటను వారు అంచనావేయుట.



నెల్లూరులో దేశభక్తుని అస్థికలు రిక్షాలో ఊరేగించుట.

చిత్రాల్లో వార్తలు



హైదరాబాదు ఆంధ్ర 'బి' (సికింద్రాబాదు) కాంగ్రెసు అధ్యక్షుడు పండిత నరేంద్రజీ క్రిందటినెల వరంగల్లు వచ్చినప్పుడు స్వాగతమిచ్చినప్పటి దృశ్యం.



అంతర్జాతీయవాణిజ్యవస్తుప్రదర్శనం:—మొన్న మేమాసంలో బ్రిటిష్‌పారిశ్రామికప్రదర్శనంలో ప్రదర్శింపబడిన భారతవస్తువులను ఎలిజబెత్ రాణీ, మేరీరాణీ చూచుచున్నారు.

Regd. No. M. 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., G. T. Madras 1.